# భారత్ శక్తి ®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 109 | హైదరాబాద్ | బుధవారం 15-10-2025 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

శబరిమల బంగారం మాయం కేసులో సంచలన విషయాలు

## నేటి భారతం

- గురువు ఒక దీపం లాంటివాడు.. తాను కాలిపోయి, ఇతరుల జీవితాలను వెలిగిస్తాడు.
- విద్యార్థుల భవిష్యత్తు గురువు చేతుల్లో ఉంటుంది.. ఆ చేతులు దేశ భవిష్యత్తును తీర్చిదిద్దుతాయి..
- ఉపాధ్యాయుడు అనేది పుస్తకాలలోని జ్ఞానాన్ని మనసులలో నింపగల మాంత్రికుడు.
- ఒక మంచి గురువు, వేల మందికి ప్రేరణగా నిలుస్తాడు.
- గురువు ఇచ్చే పాఠం జీవితాంతం మనసులో నిలిచే శక్తి కలిగిఉంటుంది.
- తల్లిదండ్రులు మనకు జీవితం ఇస్తారు.. కానీ గురువు ఆ జీవితానికి దిశ చూపుతాడు.
- ఒక మంచి ఉపాధ్యాయుడు, విద్యార్థుల్లోని చీకట్లను తొలగించి జ్ఞాన దీపాన్ని వెలిగిస్తాడు.
- గురువు మాటే విద్యార్థి మనసులో మార్పుకు మొదటి మెట్టుగా మారుతుంది.
- పుస్తకాలకంటే గొప్ప పాఠం గురువు ప్రవర్తనలో ఉంటుంది.
- గురువు ప్రేమ, శ్రద్ధ, మార్గదర్శకత.. ఇవే విద్యార్థి జీవితానికి బాటలు వేస్తాయి.

– కేసారం పెంటారెడ్డి
సీనియర్ సామాజిక విశ్లేషకులు



11లో

## విశాఖలో గూగుల్ ఏఐ సెంటర్...

### సుందర్ పిచాయ్ పోస్టుకు బదులిచ్చిన ప్రధాని మోదీ

- గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ ప్రకటనపై ప్రధాని మోదీ హర్షం
- 'వికసిత భారత్'కు ఇది ఊతమిస్తుందన్న ప్రధాని
- అదానీకానెక్స్, ఎయిర్‌టెల్‌తో కలిసి నిర్మాణం

### తక్కువ డోస్ తో ఎక్కువ ప్రభావం చూపించే

## కొత్త యాంటీబయోటిక్

- ప్రమాదకరమైన పేగు ఇన్‌ఫెక్షన్‌పై ఈవీజీ7 అనే కొత్త యాంటీబయాటిక్ విజయం
- అతి తక్కువ డోసుతోనే 'సి. డిఫిసిల్' బ్యాక్టీరియా నిర్మూలన
- ఇన్‌ఫెక్షన్ మళ్లీ రాకుండా నివారించడంలో అద్భుత ఫలితాలు
- ఆరోగ్యానికి మేలు చేసే బ్యాక్టీరియాను కాపాడుతున్న కొత్త ఔషధం
- ఎలుకలపై జరిపిన పరిశోధనల్లో కీలక విషయాలు వెల్లడి
- యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ ప్రమాదం కూడా తక్కువేనన్న పరిశోధకులు



11లో

## గ్రూప్-2 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 18న నియామక పత్రాలు

11లో






11లో

### భారత్‌లో మసకబారుతున్న సూర్యుడు

## సౌరశక్తి లక్ష్యాలకు కాలుష్యం దెబ్బ!

- దేశవ్యాప్తంగా గణనీయంగా తగ్గుతున్న సూర్యరశ్మి గంటలు
- వాయు కాలుష్యం, మేఘాలే ప్రధాన కారణమని వెల్లడి
- ఆరుగురు భారత శాస్త్రవేత్తల అధ్యయనంలో కీలక విషయాలు
- సౌరశక్తి ఉత్పత్తి, వ్యవసాయ రంగాలపై తీవ్ర ప్రభావం
- ఉత్తర, పశ్చిమ భారతంలో పరిస్థితి మరింత ఆందోళనకరం

### తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసు

## ఐక్లౌడ్ పాస్‌వర్డ్ ఇవ్వాల్సిందే



11లో

- పాస్‌వర్డ్ మర్చిపోయాను అంటే కుదరదు.. ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టు స్పష్టం
- సిట్ పిలిచినప్పుడు ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో పాస్‌వర్డ్ రీసెట్ చేయాలని సూచన
- ప్రభాకర్ రావు దర్యాప్తునకు సహకరించడం లేదని కోర్టుకు తెలిపిన తెలంగాణ ప్రభుత్వం



11లో

### #GoogleComesToAP... ఎక్స్ లో

## ఇప్పుడిదే టాప్ ట్రెండింగ్

- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో టెక్ దిగ్గజం గూగుల్ కీలక ఒప్పందం
- విశాఖలో భారీ ఏఐ-పవర్డ్ డేటా సెంటర్ ఏర్పాటుకు నిర్ణయం
- సుమారు రూ.1.33 లక్షల కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు అంచనా
- సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, నిర్మలా సీతారామన్ హాజరు

## బ్రతుకు ఈడ్చలేక భోరుమంటున్న బడిపంతుళ్ళు..

- తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యలు ఎన్నెన్నో..
- సింగల్ టీచర్ల వ్యధలు అన్నీ ఇన్నీ కావు..
- బదిలీల ప్రక్రియలో బలైపోతున్న టీచర్ల కుటుంబాలు..
- ప్రభుత్వ ఉపాధ్యాయులపై నిర్లక్ష వైఖరి..
- ప్రభుత్వ పాఠశాలలను గాలికోదిలేస్తున్న దౌర్భాగ్యం..
- 70, 80 మంది విద్యార్థులకు ఒకే ఉపాద్యాయుడు..
- చదువు నేర్పించాలా..? వారిని కట్టడి చేయాలా..?
- భావి భారతాన్ని కార్పొరేట్ వలయంలో పడేస్తున్న సర్కార్..
- విద్యలేనివాడు వింతపశువు అంటారు..
- విద్య కొనలేనివాడు వేస్ట్ ఫెలో అంటున్నారు ఇప్పుడు..
- జీతం తీసుకుంటూ విధులు నిర్వహించలేకపోతున్నామంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు..
- ఈ వైఖరి మారకపోతే పిల్లల భవిష్యత్ అంధకారం అవుతుందని హెచ్చరిస్తున్న " ఫోరం ఫార్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "..



12లో

బ్రతకలేక బడిపంతులు అనేవాళ్ళు పూర్వాశ్రమంలో.. బ్రతుకు ఎలా ఈడ్చాలో అర్థం కావడం లేదంటున్నారు ఈనాటి ఉపాధ్యాయులు.. ప్రభుత్వ ఉపాధ్యాయుల వ్యధలు అన్నీ ఇన్నీ కావు.. బదిలీలు, ఏకోపాధ్యాయ పాఠశాలలు.. స్థానిక రాజకీయ నాయకుల జులుం.. ఉపాధ్యాయ వృత్తి కాకుండా ఇంకా అనేకానేక బాధ్యతలు నిర్వహించాల్సి రావడం.. తాము ఒకచోట, భార్యా పిల్లలు ఒకచోట.. ఇలా ఒక్కటికాదు రెండుకాదు.. ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణితో ప్రభుత్వ ఉపాధ్యాయుల జీవితాలు ఆగమాగం అవుతున్నాయి.. వీరి సమస్యలను పట్టించుకునే వారు లేరు.. ఇక ప్రైవేట్ ఉపాధ్యాయుల సంగతి చెప్పనక్కరలేదు.. జీతం తక్కువ, యాతం ఎక్కువ.. ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు ఊడుతుందో తెలియని ఉద్యోగాలు.. మరీ ముఖ్యంగా ప్రభుత్వ ఉపాధ్యాయుల దుర్భర జీవితం ఎంత చెప్పుకున్నా తక్కువే అవుతుంది.. భావి భారత పౌరులను తయారుచేయడం మాట అటుంచి.. తమ భవితవ్యం ఏమవుతుందో అన్న భయంతో క్షణమొక యుగంలా గడుపుతున్నారు.. పాఠాలు నేర్పే ఉపాద్యాయుడు ప్రభుత్వ పాపపు పాలనలో అల్లాడిపోతున్నాడు..

## సంపాదకీయం

# పాకిస్తాన్ 4 ముక్కలేనా...

అఫ్ఘానిస్థాన్ హెచ్చరికలు, గాజా వివాదం, బలూచిస్థాన్‌లో తిరుగుబాటు, ఆర్థికంగా కుదేలు కావడం వంటి వాటితో ప్రస్తుతం పాకిస్థాన్ తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోయింది. నలువైపులా సవాళ్లతో సతమతమవుతున్న పాక్ భవిష్యత్తుపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి.అఫ్ఘానిస్థాన్ నుంచి వస్తున్న హెచ్చరికలు ఒక వైపు, మరోవైపు గాజా ఒప్పందానికి మద్దతు పలకడంపై సొంత దేశంలోనే తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిణామాలు పాక్ ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పాక్‌లో వేర్పాటువాద ఉద్యమాలు పెరుగుతున్నాయా? అన్న సందేహాలు వస్తున్నాయి. ఈ పరిస్థితులకు తోడు, "పక్కలో బల్లెం"లా మారిన బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ రోజుకో దాడితో పాకిస్థాన్‌ను చావుదెబ్బ కొడుతోంది. బలూచిస్థాన్‌లో నిరంతరం కొనసాగుతున్న ఈ తిరుగుబాటు దేశ భద్రతకు పెను సవాలుగా మారింది. అంతేకాకుండా, పాకిస్థాన్ సొంత గడ్డపైనే అనేక ప్రాంతాలలో వేర్పాటువాద ఉద్యమాలు ఇబ్బడిముబ్బడిగా నడుస్తున్నాయి.కిస్తాన్ లోని పలు కీలక నగరాల్లో ప్రస్తుతం తీవ్ర హింస చెలరేగుతోంది. గాజా ప్రాంతంలో ఇజ్రాయిల్ దాడులకు నిరసనగా ఒఒఖ సంస్థ చేపట్టిన భారీ ర్యాలీ హింసాత్మకంగా మారింది. ఆందోళనకారులు పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతూ పోలీసుల పైకి రాళ్లు రువ్వారు. లాహోర్, ఇస్లామాబాద్, పెషావర్, క్వెట్టాతో సహా దేశంలోని అనేక ప్రాంతాల్లో ఈ హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. ముఖ్యంగా, ఇస్లామాబాద్‌లోని అమెరికా ఎంబసీని ముట్టడించేందుకు నిరసనకారులు ప్రయత్నించగా, పోలీసులు వారిని సమర్థవంతంగా అడ్డుకున్నారు. లాహోర్ నగరంలో పోలీసుల కాల్పుల్లో ఇద్దరు వ్యక్తులు మరణించారు. అఫ్గనిస్తాన్ తూర్పు కునార్ ప్రావిన్స్‌లోని డ్యూరాండ్ లైన్ వెంబడి, పక్టియా, దక్షిణ హెల్మండ్ వెంబడి ఉన్న పాకిస్తాన్ సైనిక పోస్టులపై దాడులు జరిగాయని తాలిబాన్ రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపిందితాలిబాన్ దళాలు తేలిక నుంచి భారీ ఆయుధాలతో దాడి చేశాయని, ఇది ఇరుపక్షాల మధ్య తీవ్రమైన పోరాటానికి దారితీసిందని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు.అఫ్గనిస్తాన్ నుంచి జరిగిన దాడులను పాకిస్తాన్ సైనిక వర్గాలు కూడా ధృవీకరించాయి. బలూచిస్థాన్ లోని అంగూర్ అడ్డా, బజౌర్, కుర్రం, దిర్, చిత్రల్, బారామ్ చాహ్ వంటి ప్రదేశాలపై ఎలాంటి కవ్వింపులు లేకపోయినా తాలిబాన్ దళాలు కాల్పులు జరిపాయని తెలిపాయి.సరిహద్దుకు కొన్ని కిలోమీటర్ల దూరంలో ఉన్న పాకిస్తాన్ లోని కుర్రం జిల్లాకు చెందిన ఒక పోలీసు అధికారి మాట్లాడుతూ, ఇరువైపులా భారీ ఆయుధాలతో కాల్పులు జరుగుతున్నాయని, ఇప్పటిదాకా ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారని చెప్పారు.పాక్‌కు బలూచ్ ఆర్మీ మరింత తలనొప్పులు తెస్తోంది. పాకిస్తాన్ చేతుల్లో నుంచి బలూచిస్తాన్ జారిపోతోంది. ఃఒం వరుస దాడులతో పాక్ ఆర్మీ బెంబేలెత్తిపోతోంది. గత కొన్ని రోజులుగా బలూచిస్తాన్‌లో నాన్‌స్టాప్ వార్ జరుగుతోంది. పాక్ సైన్యాన్ని బలూచ్ లిబరేషన్ ఆర్మీ తరుముతోంది. బలూచిస్తాన్‌లో పలు చోట్ల పాక్ ఆర్మీపై ఃఒం దాడులు చేస్తోంది. పాక్ పోలీస్ స్టేషన్లను స్వాధీనం చేసుకుని, హైవేలను నిర్బంధించింది. పాకిస్తాన్ పోలీసులను ఖైదు చేసింది. పాక్ ఆర్మీ ఇన్‌ఫార్మర్లను ఃఒం ఫైటర్లు అదుపులోకి తీసుకుంటున్నారు. పాక్ బలగాలపై ఎక్కడికక్కడ దాడులు చేస్తున్నారు. బాంబులతో పాక్ ఆర్మీ వాహనాలను పేల్చివేస్తున్నారు.కోటిన్నర జనాభా ఉన్న బెలూచిస్తాన్.. పాకిస్తాన్‌లోని అతిపెద్ద ప్రాంతం. బొగ్గు. బంగారం లాంటి ఖరీదైన ఖనిజ నిక్షేపాలతో పాటు సహజవాయు నిల్వలు అపారంగా ఉన్నా.. తమకు ప్రయోజనాలు దక్కడం లేదనేది స్థానికుల వాదన. పైగా.. పాకిస్తాన్ ప్రభుత్వం తమపై రాజకీయంగా కక్ష తీర్చుకుంటోందన్న ఆవేదన. వీళ్ల కడుపుమంట నుంచి పుట్టిందే బలూచ్ లిబరేషన్ ఆర్మీ.. బీఎల్ఏ. పాకిస్తాన్ నుంచి విడదీసి బలూచిస్తాన్‌ను స్వతంత్ర దేశంగా ప్రకటించాలన్న డిమాండ్‌తో పాతికేళ్ల కింద ఏర్పాటైన వేర్పాటువాద సంస్థ. పాకిస్తాన్-ఇరాన్ మధ్య విభజించిన ఇరానియన్ జాతి సమూహం. బలూచ్-నివాస ప్రావిన్సులు కేంద్ర ప్రభుత్వాలకు నిరంతరం ఇబ్బందులకు కారణమవుతున్నాయి. సాయుధ స్వాతంత్ర్య ఉద్యమానికి శ్రీకారం చుట్టారు.పుట్టింది అఫ్ఘన్ నగరం కాందహార్‌లో.. నలుగురితో మొదలై ఇప్పుడు 600 మంది సాయుధులతో మిలిటెంట్ ఆర్గనైజేషన్‌గా ఎదిగింది. మొదట్లో అఫ్ఘన్ నుంచే ఎటాకింగ్ షురూచేసేది. తర్వాత పాకిస్తాన్ లోపలికి జొరబడి బెలూచ్ నడిగడ్డ మీద నుంచే సవాల్ విసురుతోంది. ఇప్పుడు పాకిస్తాన్ మిలిటరీకి సమఉజ్జీగా మారి.. ఆ దేశ పాలకుల కంట్లో నలుసుగా మారింది. పాకిస్తాన్ ఎదుర్కొంటున్న అంతర్గత సమస్యల్లో అత్యంత కీలకమైంది బెలూచ్ తిరుగుబాటు బెడద. "పాకిస్తాన్ ఒక వికృతమైన భావజాలమున్న న్యూక్లియర్ కంట్రీ.. ఐసిస్ లాంటి గ్లోబల్ టెర్రరిస్ట్ నెట్‌వర్క్‌కు పాలు పోసి పెంచుతోంది.. ఈ మొత్తం ప్రోగ్రామ్ ఐఎస్ఐ కనుసన్నల్లోనే డిజైనౌతోంది.. మేమైతే సైలెంట్‌గా చూస్తూ కూర్చునేవాళ్లం కాదు? 51 చోట్ల 71 సార్లు దాడులు చేశాం.. ఇప్పుడే సినిమా ఐపోలేదు.." అని పాకిస్తాన్ ఒరిజినల్ షేప్‌ను ప్రపంచానికి చాటి చెబుతోంది బెలూచ్ లిబరేషన్ ఆర్మీ.ఈ పరిణామాలన్నీ గమనిస్తుంటే, పాకిస్థాన్ త్వరలో అనేక ముక్కలుగా విడిపోనుందా అనే ప్రశ్నలు బలపడుతున్నాయి. తీవ్ర ఆర్థిక సంక్షోభం, రాజకీయ అస్థిరత, పెరుగుతున్న ఉగ్రవాదం, వేర్పాటువాద ఉద్యమాలు పాకిస్థాన్ సమగ్రతను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. ఈ సవాళ్లను పాకిస్థాన్ ప్రభుత్వం ఎలా ఎదుర్కొంటుందో, భవిష్యత్తులో ఈ దేశం ఏ దిశగా పయనిస్తుందో?

# పిడిఎఫ్ బియ్యం గుర్తించేందుకు
## 700 రాపిడ్ టెస్టింగ్ మొబైల్ కిట్లు



విజయవాడ, అక్టోబరు 16,
రాష్ట్రంలోని వేర్వేరు పోర్టుల ద్వారా పిడిఎఫ్ బియ్యం.. విదేశాలకు తరలిపోతోంది. పౌరసరఫరాల అధికారుల తనిఖీల్లో అనేక సందర్భాల్లో ఈ విషయం బయటపడింది. కేసులు కూడా పెట్టారు. కాకినాడ పోర్ట్ లో రేషన్ బియ్యం వ్యవహారంలో సిట్ ఎంక్వయిరీ కూడా నడుస్తోంది. ఇక విశాఖ పోర్టు నుంచి కూడా బియ్యం విదేశాలకు తరలిపోతుందనేది పౌరసరఫరాల శాఖ గట్టిగా నమ్ముతుంది. ఇటీవల తరలించేందుకు గోడౌన్లో సిద్ధంగా ఉంచిన బియ్యాన్ని కూడా అధికారులు గుర్తించారు. ఎన్ఫోర్స్మెంట్ డిపార్ట్‌మెంట్ ను మరింత పటిష్టం చేశారు.నిఖీ చేస్తున్న సమయంలో ఆ బియ్యంపై అనుమానం వస్తే వాటిని ల్యాబ్ కు పంపి పరీక్షలు చేసిన తర్వాత మాత్రమే వాటిపై ఒక నిర్ధారణకు రావాల్సి ఉంటుంది. ఆ రిపోర్టు వచ్చేలోగా ఈ రవాణా సంబంధిత సమస్యలు ఎదురవుతున్నాయి అనేది.. గతంలో అనేకమంది ఎగుమతిదారులు పౌరసరఫరాల మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అయితే.. వాటిని అధిగమించేందుకు ప్రభుత్వం సంస్కరణలు తీసుకువచ్చింది.. బియ్యం పై అనుమానం వచ్చిన వెంటనే చెక్ చేసి అప్పటికప్పుడు నిర్ధారించుకునేలా ఓ సరికొత్త ప్రణాళికనూ సిద్ధం చేసింది ప్రభుత్వం. పౌం సరఫరాల శాఖ ప్రత్యేక మొబైల్ ర్యాపిడ్ కిట్లను రంగంలోకి దింపింది. 700 రాపిడ్ టెస్టింగ్ మొబైల్ కిట్లను సిద్ధం చేసింది. వాటిని పౌరసరఫరాల శాఖ అధికారులకు నుంచి ఎన్ఫోర్స్మెంట్ పటిష్టం చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు మంత్రి నాదెండ్ల మనోహర్..పౌరసరఫరాల శాఖలో గత సంవత్సర కాలంలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చామన్నారు మంత్రి నాదెండ్ల మనోహర్. ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ద్వారా నాణ్యమైన పోర్టిఫైడ్ రైస్ ప్రజలకు అందిస్తున్నందని.. ప్రభుత్వం అందించే బియ్యం పక్కదారి పట్టకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పిడిఎస్ బియ్యం అవునో కాదో గుర్తించడానికి 700 మొబైల్ రాపిడ్ కిట్స్ అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ రాపిడ్ కిట్లలో పొటాషియం థయో సైనైడ్, హైడ్రోక్లోరిక్ యాసిడ్ బాటిల్స్ ఉంటాయని అన్నారు. ప్రభుత్వం సరఫరా చేసే పోర్టిఫైడ్ రైస్ అయినట్లయితే.. ఈ ద్రావణాలు ఆ బియ్యంపై చల్లితే అవి ఎరుపు రంగుకు మారుతాయని.. బయట దుకాణాల్లో అమ్మే బియ్యం అయితే రంగు మారవు అని తెలిపారు. గతంలో అయితే అక్రమ బియ్యం పట్టుకున్న తర్వాత ల్యాబ్ కి పంపించడం వలన సమయం ఎక్కువగా తీసుకోవడం కోర్టులో నిరూపణ కష్టమయ్యేదని.. ఈ రాపిట్ కిడ్స్ వల్ల వెంటనే గుర్తించడానికి.. సీజ్ చేయడానికి వీలు కలుగుతుందన్నారు మంత్రి.ఎన్ఫోర్స్మెంట్లో రాజీ పడేది లేదని, అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని.. అవకతవకలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలోనే పౌర సరఫరాల విభాగంలో విప్లవాత్మక మార్పులు తీసుకు వస్తున్నామన్నారు. బియ్యం తీసుకొచ్చే వాహనాలను నిరంతరం తనిఖీ చేయడానికి విశాఖ పోర్టు ప్రాంతంలో మూడు అంతర్గత చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. గాజువాక గేట్ వే సి.ఎఫ్.ఎస్. షీలా నగర్ వద్ద, శ్రవణ్ సి.ఎఫ్.ఎస్. షీలా నగర్ వద్ద, బిపిఎల్ ఇంటిగ్రల్ సి.ఎఫ్.ఎస్. పెదగంట్యాడ లలో మూడు చెక్పోస్ట్ లు ఏర్పాటు చేయడం జరిగిందని, ఇప్పటికే అవి పని చేయడం ప్రారంభించాయని చెప్పారు. ఈ చెక్ పోస్ట్ లు 24 గంటలు మూడు షిఫ్టుల్లో పని చేస్తాయని.. 33 మంది సిబ్బందిని నియమించామని మంత్రి తెలిపారుకాకినాడ పోర్టులో గతంలో జరిగిన అక్రమ రవాణా జరిపిన వారిపై చట్ట పరమైన చర్యలు.. వాహనాలు సీజ్ చేయడం జరిగిందని అన్నారు. మన దేశానికి సంబంధించిన పీడీఎస్ రైస్ మన పోర్టుల నుండి అక్రమ రవాణా జరగకూడదని.. అందుకే చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని.. ఈ విధానం కాకినాడలో విజయవంతంగా అమలు చేశామన్నారు. రాష్ట్రంలో 4 కోట్ల 42 లక్షల మందికి క్యూఆర్ కోడ్ కలిగిన స్మార్ట్ రైస్ కార్డులు అందించడం జరిగిందని, 89% మంది వీటి ద్వారా రైస్ తీసుకుంటున్నారని తెలుస్తుందన్నారు. వినియోగదారులకు బియ్యం సంబంధించిన సమస్యలు ఉంటే 1967 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫిర్యాదు చేయవచ్చన్నారు. రాష్ట్రంలోని 29,752 చౌక ధర దుకాణాలలో ఎక్కడైనా రేషన్ బియ్యం తీసుకునే అవకాశం ఉందన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో 5 లక్షల 35 వేల క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకుంటే.. ఈ ప్రభుత్వం గత 14 నెలలో 245 కోట్ల విలువైన 5 లక్షల 65 వేల క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఇప్పటివరకు 230 క్రిమినల్ కేసులు పెట్టామని.. కోర్టులలో విచారణ జరుగుతుందన్నారు. విశాఖపట్నంలో కూడా అలాంటి బియ్యం అక్రమ రవాణా జరగకుండా కంటైనర్ పోర్టు సందర్శించి సమావేశాలు నిర్వహించి హెచ్చరించడం జరిగిందన్నారు. న్యాయంగా, సక్రమంగా జరిపే వ్యాపారానికి ఆటంకాలు కలుగకుండా సహకరిస్తామని అప్పుడే తెలిపామన్నారు. ఎన్ఫోర్స్మెంట్ పటిష్టంగా అమలు చేస్తామని కఠినంగా కూడా వ్యవహరిస్తామని మంత్రి పేర్కొన్నారు.పోర్టిఫైడ్ రైస్ అంటే 100 కేజీల బియ్యం లో ఒక కేజీ మల్టీ విటమిన్ మిక్స్, ఐరన్ తో కూడిన రైస్ కలుపుతారని.. అన్నారు పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరబ్ గౌర్. వీటి పై ప్రజల్లో ప్లాస్టిక్ బియ్యం అనే అపోహ ఉన్నదని, నిజానికి బియ్యాన్ని పిండి చేసి దానిలో దాన్లో మల్టీ విటమిన్ మిక్స్ కలుపుతారన్నారు. ఇది సాధారణ బియ్యం కంటే పోషక విలువలు కలిగిన ఆహారం అని ఆయన పేర్కొన్నారు.

# పాలిటిక్స్‌లోకి షర్మిళ కుమారుడి ఎంట్రీ.



.కడప, అక్టోబరు 14,
ప్రతి రాజకీయ నాయకుడు తన వారసత్వాన్ని అందించే ప్రయత్నం చేస్తారు. ఎందుకంటే రాజకీయం అంటే గౌరవంతో కూడిన ఒక రకమైన వ్యాపారం కూడా. అయితే బడా నాయకుల వారసత్వం విషయంలో పెద్దపెద్ద కుటుంబాల మధ్య గొడవ జరగడం అనేది సర్వసాధారణం. అటువంటి పరిస్థితి వైయస్ రాజశేఖర్ రెడ్డికుటుంబానికి ఎదురైంది. తండ్రి అకాల మరణంతో కాంగ్రెస్ పార్టీతో విభేదించి సొంత పార్టీని ఏర్పాటు చేసుకున్నారు జగన్మోహన్ రెడ్డి. అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రి పదవిని కూడా అలంకరించారు. మరోవైపు కుమార్తె షర్మిల సైతం తెలంగాణలో తండ్రి పేరుతో పార్టీని ఏర్పాటు చేశారు. వర్కౌట్ కాకపోవడంతో తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరి ఏపీ పగ్గాలు తీసుకున్నారు. సోదరుడు జగన్మోహన్ రెడ్డితో విభేదిస్తూ ముందుకు సాగుతున్నారు షర్మిల.మొన్న ఆ మధ్యన షర్మిల తన కుమారుడు రాజారెడ్డిని తన వెంట తీసుకొచ్చారు. దీంతో రాజారెడ్డి పొలిటికల్ ఎంట్రీ ఉంటుందని ప్రచారం ప్రారంభం అయింది. దానిపై షర్మిల మాట్లాడుతూ కచ్చితంగా రాజారెడ్డి రాజకీయాల్లోకి వస్తారని తేల్చి చెప్పారు. వస్తే తప్పేంటి అని ప్రశ్నించారు. అంతటితో ఆగకుండా రాజశేఖర్ రెడ్డి నిజమైన వారసుడు తన కుమారుడు అని ప్రకటించారు. దీనిపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కౌంటర్ ఇవ్వడం ప్రారంభించారు. రాజశేఖర్ రెడ్డి నిజమైన వారసుడు జగన్మోహన్ రెడ్డి అని తేల్చి చెప్పారు. ఈ విషయాన్ని ప్రజలు గుర్తించి జగన్మోహన్ రెడ్డికి అధికారం కట్టబెట్టిన విషయాన్ని కూడా గుర్తు చేశారు. షర్మిల కుమారుడికి ఆ అవకాశం లేదని తేల్చి చెప్పారు. దీనిపై చాలా రోజులపాటు వాదనలు కొనసాగాయి. మీడియాలో డిబేట్ లు కూడా జరిగాయి.రాజశేఖర్ రెడ్డి వారసత్వం విషయంలో షర్మిల నుంచి తనకు సవాళ్లు ఎదురవుతాయని జగన్మోహన్ రెడ్డికి తెలుసు. ఇప్పటికే పొలిటికల్ గా ఆమె చాలా డామేజ్ చేశారు. వారసత్వ రాజకీయాల విషయానికి వచ్చేసరికి షర్మిల కుమారుడు రాజారెడ్డి తెరపైకి వస్తే.. తన రాజకీయ వారసత్వం కనుమరుగవుతుందని జగన్ భావిస్తున్నట్లు సమాచారం. అందుకే తన కుమార్తెలను రాజకీయాల్లోకి తెస్తారని ప్రచారం ప్రారంభం అయింది. అయితే ఈ విషయంలో జగన్మోహన్ రెడ్డి ఆలోచనలు ఎలా ఉన్నాయో ఇంకా బయటపడలేదు. కానీ రాజకీయంగా తన వారసత్వం ఉండాలని ఆయన కోరుకుంటారు అనడంలో ఎటువంటి సందేహం లేదు. పైగా కుమార్తెలను రాజకీయాల్లోకి తీసుకురావడం ఇది కొత్త కాదు. గతంలో చాలామంది నేతలు ఇలానే వచ్చారు.వచ్చే ఎన్నికల్లో కడప నుంచి అవినాష్ రెడ్డిని తప్పిస్తారని ప్రచారం ఉంది. ఆయనకు బదులు జగన్మోహన్ రెడ్డి కుమార్తెల్లో ఒకరిని పోటీ చేయిస్తారని సోషల్ మీడియాలో అయితే ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి జగన్మోహన్ రెడ్డి కుమార్తెల గురించి సమాచారం ఇప్పుడు బయటకు వచ్చినా సందర్భాలు లేవు. ప్రస్తుతం ఆ ఇద్దరు పిల్లలు చదువు పూర్తి చేసుకుని లండన్ లోనే ఉంటున్నారు. అయితే రాజశేఖర్ రెడ్డి ఉన్నంతవరకు ఆ కుటుంబంలో మహిళలు రాజకీయాల్లోకి రావడం అరుదు. కేవలం రాజకీయ వేదికలపై కనిపించేవారు. కానీ రాజశేఖర్ రెడ్డి అకాల మరణంతో ఆ ఇంటి మహిళలు బయటకు వచ్చారు. రాజకీయాల్లో కనిపిస్తున్నారు. ఇప్పుడు వారసత్వ రాజకీయం పుణ్యమా అని జగన్మోహన్ రెడ్డి కుమార్తెల పేరు వినిపిస్తోంది. మరి అందులో ఎంత నిజం

# ప్రధాని టూర్ కు అంతా రెడీ



కర్నూలు, అక్టోబరు 14,
: ప్రధాని మోదీ ఆంధ్రప్రదేశ్ పర్యటన నేపథ్యంలో, ఈ నెల 16న కర్నూలు జిల్లాలో ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టారు. శ్రీశైలం దర్శనం అనంతరం, నన్నూరులో ఏర్పాటు చేసిన సభకు వచ్చే వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలను కేటాయించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను నిర్దేశిత మార్గాల్లో మళ్లించి, రద్దీ నియంత్రణకు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. భద్రతా ఏర్పాట్లు, క్రౌడ్ కంట్రోల్ పై అధికారులకు సూచనలు అందాయి.భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆంధ్రప్రదేశ్ పర్యటనకు వస్తున్న సంగతి తెలిసిందే. ఈ నెల 16న ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆయన పర్యటిస్తారు.. ముందుగా శ్రీశైలం మల్లన్నను దర్శించుకుని.. అనంతరం ఆయా కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ క్రమంలో ఈ నెల 16న ఓర్వకల్లు మండల పరిధిలోని నన్నూరు దగ్గర ప్రధానమంత్రి సభ ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో రద్దీ నియంత్రణలో భాగంగా వాహనాలను దారి మళ్లించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ప్రధాని సహా ఈ కార్యక్రమానికి హాజరయ్యే వీఐపీల భద్రతా చర్యలకు అనుగుణంగా నిబంధనలు అమలు చేస్తున్నారు. కర్నూలులలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రధాని సభకు వచ్చే వాహనాలను మళ్లించనున్నారు.

1) ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం ఏరియాల నుండి వచ్చే వాహనాలను నాగాలాపురం దగ్గర ట్రాఫిక్ మళ్లిస్తారు. బస్తిపాడు, చిన్న టేకూరు , తడకన పల్లి మీదుగా నన్నూరు రాగమయూరి దగ్గర ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాలకు చేరుకునే విధంగా ప్లాన్ చేశారు.

2) డోన్, ప్యాపిలి, తుగ్గలి, పత్తికొండ ఏరియాల నుండి వచ్చే వాహనాలు నేషనల్ హైవే కు వచ్చి తడకన పల్లి మీదుగా నన్నూరు రాగమయూరి దగ్గర ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాలకు చేరుకునే విధంగా ప్లాన్ చేశారు.

3) కర్నూలు మీదుగా నుండి వచ్చే వాహనాలు నన్నూరు టోల్ గేట్ దాటి తర్వాత రాగమయూరి దగ్గర ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాలకు చేరుకునే విధంగా ప్లాన్ చేశారు.

4) నంద్యాల , ఆళ్ళగడ్డ, బనగానపల్లె ఏరియాల నుంచి వచ్చే వాహనాలు నంద్యాల రోడ్డు లో వచ్చి రాగమయూరి పార్కింగ్ దగ్గర ఏర్పాటు చేసిన ప్రదేశానికి చేరుకునే విధంగా ప్లాన్ చేశారు.ఆయా నియోజక వర్గాల నుంచి వచ్చే వాహనాలను ఏవిధంగా పార్కింగ్ ప్రదేశాలకు మళ్ళింపు చేయాలనే విషయాలపై చర్చించి పోలీసులకు ఎస్పీ పలు సూచనలు చేశారు. నియోజక వర్గాల వారిగా కేటాయించిన పార్కింగ్ ఏరియాలలో వారి వాహనాలను పార్క్ చేసుకునే విధంగా చేయాలన్నారు. పార్కింగ్ ఏరియాలలో ఇండికేషన్ సైన్ బోర్డు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అఫిషియల్స్‌కు నెంబర్ 2 పార్కింగ్ ఏరియాను కేటాయించామన్నారు. ట్రాఫిక్ డైవర్షన్స్ గురించి, వీఐపీ కాన్వాయ్ రూట్, ఏయే నియోజక వర్గాల నుంచి ఎంత మంది ప్రజలు వస్తున్నారని, క్రౌడ్ కంట్రోల్ ఏవిధంగా చేయాలనే విషయాల గురించి బందోబస్తు వివరాల గురించి, జియోగ్రాఫికల్ మ్యాప్ ను చూపిస్తూ వివరిస్తూ దిశా నిర్దేశం చేశారు. ప్రతి సెక్టార్ ఇంఛార్జ్ పోలీసు ఉన్నతాధికారులకు, లైజనింగ్ ఆఫీసర్లకు పలు సూచనలు చేశారు. వీవీఐపీల పార్కింగ్, గ్యాలరీల దగ్గర అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతిఒకరూ నిబంధనలు పాటించాలని ఆయన కోరారు.

# ఆర్థిక రాజధానిగా వైజాగ్

విశాఖపట్టణం, అక్టోబరు 14,
జకీయంగా కొందరికి అరుదైన అవకాశాలు వస్తుంటాయి. కానీ సద్వినియోగం చేసుకునేది కొందరే. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చింది. కొందరికి అనూహ్యంగా మంత్రి పదవులు దక్కాయి. అటువంటి వారిలో మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్ ఒకరు. కీలకమైన ఐటి, పరిశ్రమల శాఖను దక్కించుకున్నారు. తన సమర్థతను నిరూపించుకోగల గొప్ప అవకాశం లభించింది. కానీ పదవిలో ఉన్నప్పుడే కాదు.. దిగిపోయిన తరువాత కూడా ఆయన చేస్తున్న ప్రకటనలు దిగజారుడుగా ఉన్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే సోషల్ మీడియాలో ఆయన వినోదాన్ని పంచే నేతగా మిగిలిపోయారు. తన పదవీకాలంలో శాఖపరమైన ప్రగతి కంటే.. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ లను ఎద్దేవా చేసేందుకే అన్న రీతిలో వ్యవహరించారు.అయితే ప్రస్తుతం విద్యా శాఖ మంత్రిగా ఉన్నారు నారా లోకేష్. ఐటీ శాఖను కూడా నిర్వహిస్తున్నారు. పరిశ్రమల శాఖను టీజీ భరత్ చూస్తున్నారు. అయినా సరే లోకేష్ వ్యక్తిగతంగా చొరవ తీసుకొని ఢిల్లీ, ముంబై తదితర నగరాలకు వెళ్లి పారిశ్రామికవేత్తలను కలిసి రాష్ట్రానికి పరిశ్రమలు, ఐటీ కంపెనీలు తీసుకొస్తున్నారు. విశాఖను ఐటి హబ్ గా మార్చాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నారు. నిన్ననే విశాఖలో ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్, ఓపెన్ కేబుల్ లాండింగ్ స్టేషన్ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు.అయితే లోకేష్ లో ఒక విజినరీ కనిపిస్తోంది. రాజకీయ విమర్శలను పక్కన పెడితే.. 16 నెలల కాలంలో పరిశ్రమలు, ఐటీ కంపెనీలు విశాఖ జిల్లాకు వచ్చాయి. రాబోయే ఐదేళ్లలో మరిన్ని రాబోతున్నాయి. భారీ ఎత్తున ఉద్యోగ అవకాశాలు పెరిగే అవకాశం ఉంది. జనాభాతో పాటు వాహనాల రద్దీ కూడా పెరుగుతుంది. ఆ సమయంలో ఫ్లై ఓవర్లు నిర్మించడం కాదు.. ఇప్పుడే మొదలుపెట్టి పరిశ్రమలు, ఐటీ పరిశ్రమలు వచ్చే సమయానికి విశాఖలో మౌలిక వసతులు కల్పించాలన్నది లోకేష్ లక్ష్యంగా కనిపిస్తోంది. అందులో భాగంగా క్లీన్ సిటీని టార్గెట్ చేసింది విశాఖ నగర పాలక సంస్థ. తెలంగాణకు హైదరాబాద్ ఏ విధంగా గుండెకాయ వంటిదో.. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి విశాఖ నగరం ఆర్థిక, పారిశ్రామిక, ఐటీ రాజధానిగా మార్చేందుకు లోకేష్ ఒక లక్ష్యంతో పని చేస్తున్నారు. ఆయన చేస్తున్న కృషి మాత్రం ఇప్పుడు వర్క్ అవుట్ అయ్యేలా ఉంది. తనకు వచ్చిన అవకాశాన్ని ఆయన సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు.

విశాఖకు కాగ్నిజెంట్...
గ్లోబల్ ఐటీ దిగ్గజం కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ సీఈఓ ఎస్. రవి కుమార్ నవంబర్‌లో విశాఖపట్నం పర్యటించనున్నారు. తమ కొత్త క్యాంపస్‌ను ఆయన ఫైనల్ చేసే అవకాశం ఉంది. డెలవప్‌మెంట్ సెంటర్ ను డిసెంబర్‌లో ప్రారంభించనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఐటీ హబ్‌గా విశాఖపట్నంను బలోపేతం చేసేందుకు ఈ చర్య భాగంగా, కంపెనీ రూ.1,583 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా 8,000 ఉద్యోగాలు లభిస్తాయి. కాగ్నిజెంట్, భారతదేశంలో 3.36 లక్షల మంది ఉద్యోగులతో ప్రపంచంలోనే అతిపెద్ద ఐటీ సర్వీసెస్ కంపెనీలలో ఒకటి. ఈ కొత్త క్యాంపస్ కపులుప్పాడ ఐ హిల్స్‌లో 22 ఎకరాల్లో డెవలప్ అవుతుంది. మూడు దశల్లో నిర్మాణం పూర్తి చేసి, 2029 నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుంది. మొదటి దశలో 800 మంది సిబ్బందిని తాత్కాలిక ఫెసిలిటీలో ఏర్పాటు చేసి, 2026 ప్రారంభంలో ఆపరేషన్స్ మొదలుపెట్టనున్నారు. అయితే, డెవలప్‌మెంట్ సెంటర్‌ను ముందుగా డిసెంబర్‌లో ప్రారంభించడం ద్వారా, స్థానిక టాలెంట్‌ను త్వరగా ఉపయోగించుకోవాలని కంపెనీ ప్రణాళిక సిద్ధం చేసుకుంది. విశాఖపట్నంలో ఈ క్యాంపస్ మా భారతీయ విస్తరణలో ముఖ్యమైన మైలురాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి మా కృతజ్ఞతలు. ఈ నగరం అందుబాటులో ఉన్న టాలెంట్, బలమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో విశాఖమా వ్యూహానికి సరిపోతుంది," అని సీఈఓ రవి కుమార్ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రాజెక్టు ఎఐ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, క్లౌడ్ సర్వీసెస్‌పై దృష్టి పెట్టి, గ్లోబల్ క్లయింట్లకు సేవలు అందజేయనుంది. విశాఖపట్నం ఐటి సెక్టర్ కు మంచి రోజులు వచ్చాయి. గూగుల్ , టీసీఎస్ వంటి కంపెనీలు డేటా సెంటర్ లు ఏర్పాటు చేస్తున్నాయి.

# నకిలీ మద్యం కేసులో జోగి పేరు

విజయవాడ, అక్టోబరు 14,
ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తంబళ్లపల్లి నియోజకవర్గం లో నకిలీ మద్యం వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీంతో ఏపీ ప్రభుత్వం ఒక్కసారిగా అప్రమత్తమైంది. దీని వెనుక ఉన్న వ్యక్తులను అరెస్టు చేసింది. నకిలీ మద్యం తయారు చేస్తున్న వ్యక్తులు రాజకీయంగా పలుకుబడి ఉన్నవారు కావడంతో ఏమాత్రం వెనకడుగు వేయకుండా కూటమి ప్రభుత్వం ఆ చర్యలు తీసుకోవడం మొదలుపెట్టింది. ఈ వ్యవహారంలో ఏ -1 గా జనార్దన్ రావు అనే వ్యక్తి ఉన్నాడు. ఇతడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారిస్తున్నారు. విచారణలో భాగంగా అతడు సంచలన విషయాలను బయటపెట్టాడు.

నకిలీ మద్యం కేసులో జనార్దన్ సంచలన వీడియో

ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేస్తానని జోగి రమేష్ చెప్పారు

జోగి రమేష్ ఆధ్వర్యంలోనే నకిలీ మద్యం తయారీ

ప్రభుత్వానికి చెడ్డ పేరు రావడానికే కుట్ర చేశారు

కూటమి ప్రభుత్వం రాగానే నిఘా పెరగడంతో నకిలీ మద్యం వ్యాపారం ఆపేశాం

ఈ ఏడాది ఏప్రిల్ లో?

నకిలీ మద్యం వ్యవహారం బయటపడిన తర్వాత వైసిపి కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేసింది. నకిలీ మద్యం మొత్తం కూటమి ప్రభుత్వంలో ఉన్న వ్యక్తులు చేస్తున్నారని.. ప్రజల ఆరోగ్యాలతో ఆటలాడుతున్నారని మండిపడింది. అంతేకాదు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తన సొంత మీడియాలో రకరకాల కథనాలను వండి వార్చింది. అయితే అసలు విషయాలను మాత్రం వైసిపి బయట పెట్టలేకపోయింది. అయితే ఇప్పుడు జనార్దన్ రావు విచారణలో సంచలన విషయాలను వెల్లడించడంతో వైసిపికి తల ఎత్తుకోలేని పరిస్థితి ఏర్పడింది. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు నకిలీ మద్యం మాత్రమే కాకుండా మద్యం కుంభకోణం కూడా జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నకిలీ మద్యం వ్యవహారాలపై ఉక్కు పాదం అవ్వడంతో అప్పటి భాగోతాలు మొత్తం ఇప్పుడు వెలుగులోకి వస్తున్నాయి. ఇదే విషయాన్ని జనార్దన్ రావు కూడా అంగీకరించారు..వైసిపి అధికారంలో ఉన్నప్పుడు అప్పటి ఎమ్మెల్యే, మంత్రి జోగి రమేష్ ఆధ్వర్యంలో నకిలీ మద్యం తయారుచేసినట్టు జనార్దన్ రావు అంగీకరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిఘా పెంచడంతో నకిలీ మద్యం వ్యాపారాన్ని నిలిపివేసినట్టు జనార్దన్ రావు పేర్కొన్నారు. అయితే ఈ ఏడాది ఏప్రిల్ నెలలో జనార్దన్ రావుకు జోగి రమేష్ ఫోన్ చేశారు. నకిలీ మద్యం తయారు చేయాలని పేర్కొన్నారు. టిడిపి ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడానికి మళ్లీ నకిలీ మద్యం తయారు చేయాలని జోగి రమేష్ జనార్దన్ రావును ఆదేశించారు. మొదట్లో ఇబ్రహీంపట్నంలో నకిలీ మద్యం తయారు చేయాలని అనుకున్నారు. రమేష్ ఆదేశాలు వేరే విధంగా ఉండడంతో తంబళ్లపల్లిలో తయారి కేంద్రాన్ని మొదలుపెట్టారు. ఆ ప్రాంతంలో మద్యం దుకాణాలను జనార్దన్ రావు తీసుకున్నారు. పైగా తంబళ్లపల్లి ప్రాంతం ముఖ్యమంత్రి సొంత జిల్లాలో ఉండడంతో.. ప్రభుత్వంపై బురద చల్లడానికి అవకాశం ఉంటుందని జోగి రమేష్ ఆ విధంగా స్కెచ్ వేశారు. దానిని జనార్దన్ రావు అమలు చేశారు.

ఇతర వ్యక్తుల పేరు మీద గదులను అద్దెకి తీసుకొని.. మద్యం తయారీకి కావలసిన యంత్రాలను మొత్తం తీసుకొచ్చారు.. ఇక ఆ తర్వాత తయారీ మొదలుపెట్టారు. ప్రభుత్వం మీద బురదజల్లే ప్రయత్నాన్ని ప్రారంభించారు.. అంతేకాదు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న జనార్దన్ రావు అండగా ఉంటారని జోగి రమేష్ మాట కూడా ఇచ్చారు.. దీంతో జనార్దన్ రావు నకిలీ మద్యాన్ని జోరుగా తయారు చేయించడం మొదలుపెట్టారు.నకిలీ మద్యం తయారవుతున్న క్రమంలోనే జనార్దన్ రావు ను ఉన్నట్టుండి ఆఫ్రికా పంపించారు. ఆఫ్రికాలో జనార్దన్ రావుకు ఒక స్నేహితుడు ఉన్నారు. ఎప్పుడైతే జనార్దన్ రావు ఆఫ్రికా వెళ్లారో.. అప్పుడే జోగి రమేష్ తన అనుచరుల ద్వారా ఎక్సైజ్ డిపార్ట్మెంట్ కు లీకులు ఇచ్చారు. అధికారుల ద్వారా దాడులు చేయించారు. ఆ తర్వాత ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు. మరోవైపు ఈ వ్యవహారంలో టిడిపి నేతలు ఉండడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే వారిని సస్పెండ్ చేశారు. ఇది జోగి రమేష్ ఊహించలేదు.

దీంతో మళ్ళీ జనార్దన్ రావుకి ఫోన్ చేసి ప్రణాళిక అనుకున్న స్థాయిలో విజయవంతం కాలేదని.. ఈసారి ఇబ్రహీంపట్నంలో కూడా దాడి చేయిద్దాం..

సరుకు తీసుకొచ్చి పెట్టని జనార్దన్ రావు జోగి రమేష్ ఆదేశించారు. ఇబ్రహీంపట్నంలోని గోదాంలో ముందు రోజే అన్ని సరుకులు తీసుకొచ్చి పెట్టమని జోగి రమేష్ జనార్దన్ రావును ఆదేశించారు. జోగి రమేష్ చెప్పినట్టే జనార్దన్ రావు లీక్ ఇచ్చి రైడ్ చేయించాడు. దీనికి తోడు వైసిపి అనుకూల మీడియా సాక్షిని కూడా ముందుగానే అక్కడ ఉంచారు. ఈసారి జోగి రమేష్ ప్లాన్ వర్కౌట్ అయింది. ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చింది.ఇదే సమయంలో జోగి రమేష్ జనార్దన్ రావు కి ఫోన్ చేసి నువ్వు రావాల్సిన అవసరం లేదని చెప్పేశాడు. బెయిల్ కూడా ఇప్పిస్తానని చెప్పాడు. కానీ చివరికి జోగి రమేష్ జనార్దన్ రావుకు హ్యాండ్ ఇచ్చాడు

అంతేకాదు జనార్దన్ రావు తమ్ముడిని కూడా ఈ కేసులో ఇరికించాడు. జనార్దన్ రావు స్నేహితుడు జయచంద్ర రెడ్డి ఆఫ్రికాలో వ్యాపారాలు చేసుకుంటూ ఉంటాడు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీ చేయాలని అతడు అనుకుంటున్నాడు.

అయితే అతడికి వచ్చే ఎన్నికల్లో సీటు ఇచ్చేది లేదని.. ఆస్థానంలో నీకు సీటు ఇస్తామని జోగి రమేష్ జనార్దన్ రావుకు హామీ కూడా ఇచ్చాడు. అయితే ఈ వ్యవహారంలో జయచంద్ర రెడ్డి పేరును వైసిపి తెగ ప్రచారం చేస్తున్నప్పటికీ.. ఇందులో అతని పాత్ర లేదని జనార్ధన స్పష్టం చేశాడు.. జోగి రమేష్ నమ్మించి మోసం చేసిన నేపథ్యంలోనే జనార్దన్ రావు బయటకు వచ్చి ఈ విషయాలు మొత్తం వెల్లడించాడు. దీంతో వైసిపి కుట్ర బయటపడింది.

## రోడ్లు బాగుపడేదప్పుడు

నిజామాబాద్, అక్టోబరు 14,మండలంలోని రహదారులు గుంతల మాయంగా మారడంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పదర ప్రధాన రహదారితోపాటు మద్దిమడుగు వరకు ఎక్కడ పడితే అక్కడ గుంతలు పడి యమ లోకానికి ద్వారాలుగా ఉన్నాయి.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా రహదారుల మరమ్మత్తు పనులపై పట్టించు కోలేకపోవడం దురదృష్ట కరం..నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మండల పర్యటనకు వచ్చినప్పుడల్లా ఈ రహదారుల గుండానే ప్రయాణం చేస్తున్నా కనీసం పట్టించుకోకపోవడం గమనార్హం. కోతులు పడిన ఈ రహదారిలో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతు న్నాయి. ద్విచక్ర వాహనదారులు గోతుల్లో పడి తీవ్రంగా గాయపడిన సంఘటనలు అనేకం. వర్షపు నీరు నిలిచి ఉండడంతో గోతులు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్న పరిస్థితి.గత ప్రభుత్వ మాజీ ఎమ్మెల్యే ఎన్నోసార్లు హామీలు ఇచ్చి ఏ రోడ్డు కూడా మరమ్మతులు చేయలేకపోయారనే విమర్శలు ఉన్నాయి. పదర నుండి మద్దిమడుగు వరకు డబల్ రోడ్డు వేయాలని ప్రయాణికులు, గ్రామస్తులు, భక్తులు కోరుతున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే, అధికారులు స్పందిం చాలని ప్రయాణికులు కోరుతున్నారు. కొంత కాలంగా గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులు బిటిగా మార్చకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పూర్తిగా మట్టి రోడ్లు కావడం అధిక వర్షాలు కురుస్తుం డడంతో దారులన్నీ దెబ్బతిని రాకపోకలకు వీల్లేని విధంగా మారాయి. అదే మార్గాల్లో భారీ వాహనాలు సైతం వెళ్తుండడంతో నిత్యం వ్యవసాయ పొలాలకు వెళ్లే రైతులు ప్రమాదాల బారిన పడుతున్నారు.అధిక మంది పాడి రైతులు ఉదయం సాయంత్రం రాకపోకలు చేస్తుండడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు.

## గొట్టిపాటికి కలిసి రాని కాలం

విజయవాడ,భారత శక్తి, అక్టోబర్ 13:
కొందరు మంత్రుల తీరుతో సీఎం చంద్రబాబు అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. నిన్న జరిగిన క్యాబినెట్ సమావేశంలో సీఎం ఫైర్ అయినట్లు సమాచారం. ముఖ్యంగా విద్యుత్ శాఖపై తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల చార్జీలు తగ్గించిన సంగతి తెలిసిందే. ట్రూ డౌన్ పేరిట రాష్ట్ర ప్రభుత్వం చార్జీలను తగ్గించింది. చార్జీలు తగ్గించడం ఉమ్మడి ఏపీలో ఇదే తొలిసారి. కానీ దీనిపై విద్యుత్ శాఖ ప్రజల్లోకి బలంగా వెళ్లకపోవడంపై చంద్రబాబు ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. భారీ ఎత్తున చార్జీలు తగ్గిస్తే ప్రచారం చేసుకోకపోతే ఎలా అంటూ క్యాబినెట్ సమావేశంలో చంద్రబాబు ప్రశ్నించినట్లు తెలుస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం చేస్తుంటే ఏం చేస్తున్నారు అని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ను చంద్రబాబు మందలించినట్లు తెలుస్తోంది.వాస్తవానికి క్యాబినెట్ సమావేశం జరిగిన ప్రతిసారి మంత్రుల వ్యవహార శైలి చర్చకు వస్తోంది. కొంతమంది మంత్రులకు ఉద్వాసన తప్పదని ప్రచారం జరుగుతోంది. కానీ కూటమి అధికారంలోకి వచ్చి 16 నెలలు మాత్రమే అవుతోంది. సాధారణంగా మంత్రివర్గ విస్తరణ అనేది రెండేళ్లకు ఒకసారి జరుపుతారు. గత వైసిపి ప్రభుత్వం అయితే అధికారంలోకి వచ్చిన మూడేళ్ల తరువాత విస్తరణ చేపట్టింది. కానీ చంద్రబాబు సర్కార్లో అధికారంలోకి వచ్చిన మూడు నెలల తరువాత నుంచి వింత ప్రచారం జరిగింది. మంత్రుల మార్పు ఉంటుందన్నది దాని సారాంశం. కానీ అటువంటిదేమీ లేకుండా పోయింది.అయితే తాజాగా విద్యుత్ చార్జీలకు సంబంధించి ప్రజలకు చెప్పుకోవడంలో విఫలమయ్యా మన అసంతృప్తి చంద్రబాబులో కనిపిస్తోంది. దీనిపై సంబంధిత మంత్రి గొట్టిపాటి రవికుమార్ పై చంద్రబాబు ఆగ్రహంగా ఉన్నట్లు ప్రచారం సాగుతోంది.

## బై పోల్ వార్
### రెండు పార్టీలకు ప్రతిష్టాత్మకం

హైదరాబాద్, అక్టోబరు 14, తెలంగాణలో జూబ్లీహిల్స్ ఉపఎన్నిక రాజకీయం వేడెక్కుతోంది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు జూబ్లీహిల్స్ బైపోల్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ అయితే ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నాయ్. జూబ్లీహిల్స్ నియోజకవర్గం సిట్టింగ్ స్థానం కావడంతో బీఆర్ఎస్ ఈ ఉప ఎన్నికను సీరియస్‌గా తీసుకుంది. తమ సీటును తిరిగి గెలిచి తీరాలనే ప్లాన్‌తో గ్రౌండ్‌లోకి దిగింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ డైరెక్షన్‌లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తోంది గులాబీ దళం. ఈ క్రమంలో బీఆర్ఎస్ ఇప్పటికే జూబ్లీహిల్స్ పొలిటికల్ పిచ్‌లో హీట్‌ను క్రియేట్ చేసింది.రేవంత్ సర్కార్ పవర్‌లోకి వచ్చి రెండేళు కావొస్తోంది. ఈ 20 నెలల కాలంలో రేవంత్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని బీఆర్ఎస్ చెప్పుకుంటూ వస్తోంది. అది నిజమని జూబ్లీహిల్స్ రిజల్ట్ ద్వారా ప్రూవ్ చేయాలనుకుంటోంది కారు పార్టీ. ఈ క్రమంలోనే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుపోటములు రానున్న రోజుల్లో రాష్ట్ర రాజకీయాలను తీవ్ర ప్రభావం చూపుతాయన్న అంచనాలున్నాయి.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారలో చేసిన కామెంట్స్ రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతున్నాయి. హైదరాబాద్‌లో అభివృద్ధి తిరిగి గాడిన పడాలంటే కేసీఆర్ మళ్లీ రావాలని, అది జూబ్లీహిల్స్ నుంచి మొదలు కావాలని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ రెండేళ్ల పాలనతో తెలంగాణ ప్రజలు విసిగిపోయారన్న కేటీఆర్..మళ్లీ ఎప్పుడెప్పుడు బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందా అని ఎదురుచూస్తున్నారని చెప్పారు.అయితే మళ్లీ ఎన్నికలు రావడానికి రెండేళ్ల సమయం ఉందని, కానీ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ గెలిస్తే రాష్ట్రంలో ఏమైనా జరగవచ్చని కేటీఆర్ కామెంట్ చేశారు. జూబ్లీహిల్స్ బైపోల్‌లో బీఆర్ఎస్ గెలిస్తే రెండేళ్లు ఆగాల్సిన పనిలేదని కేటీఆర్ చెప్పడం చర్చనీయాంశం అవుతోంది. జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ గెలిచి అధికార కాంగ్రెస్ పార్టీ ఓడిపోతే ఏమైనా జరగొచ్చన్న కేటీఆర్ మాటల వెనుక ఆంతర్యం ఏమై ఉంటుదన్న చర్చ జరుగుతోంది.సీఎం రేవంత్ రెడ్డిపై అధిష్టానం అసంతృప్తి, రేవంత్‌కు మంత్రులకు మధ్య విభేదాలు, మంత్రివర్గంలోని చాలా మంది మంత్రుల మధ్య గొడవలు, తమకు ఏ పనులు కావడం లేదన్న అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యేల అసంతృప్తులను దృష్టిలో పెట్టుకుని కేటీఆర్ ఈ వ్యాఖ్యలను చేశారన్న టాక్ వినిపిస్తోంది. అధికారంలో ఉండి కూడా కాంగ్రెస్ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలవలేకపోతే అది ఆ పార్టీపైనా, ప్రభుత్వంపైనా తీవ్ర ప్రభావం చూపడం ఖాయమన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ గెలిస్తే దాని ప్రభావం రేవంత్ సర్కార్‌పై ఉంటుందని కేటీఆర్ చెప్పకనే చెబుతున్నారు. అయితే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేంత తీవ్రంగా ఉంటుందా అన్నదే ఇక్కడ ఇంట్రెస్టింగ్ పాయింట్. ఎందుకంటే జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీఆర్ఎస్ గెలిస్తే కాంగ్రెస్ పాలనతో విసిగిపోయిన ప్రజలు రెండేళ్ల వరకు ఎదురుచూడాల్సిన అవసరం లేదని, అంతలో ఏమైనా జరగొచ్చని, పరోక్షంగా రేవంత్ సర్కార్ పడిపోయినా ఆశ్చర్యపోనక్కర్లేదన్నట్లుగా కేటీఆర్ కామెంట్ చేశారన్న టాక్ వినిపిస్తోంది.అందుకే సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని చెబుతున్నారు. బైఎలక్షన్‌లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని, అప్పుడు రాష్ట్రంలో ఏమైనా జరగొచ్చని కేటీఆర్ చెప్పడంలో అంతర్యం అదేనన్న చర్చ జరుగుతోంది. జూబ్లీహిల్స్ ఫలితం ఎలా ఉండబోతుందో..ఉప ఎన్నికలో గెలుపోటములు రాష్ట్ర రాజకీయాలను ఎంతలా ప్రభావితం చేయబోతున్నాయో చూడాలి మరి.

## జూబ్లీహిల్స్ లో ఓట్ చోరీ కలకలం

హైదరాబాద్, అక్టోబరు 14,
దరాబాద్ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఫేక్ ఓట్ల కలకలంపై అధికారులు విచారణ జరిపారు. యూసుఫ్ గూడలోని ఒకే ఇంట్లో 43 ఓట్లు ఉన్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. దీంతో యూసుఫ్ గూడ డివిజన్ 246 బూత్ ఓటర్ జాబితాపై గందరగోళంపై అధికారులు విచారణ జరిపారు. సంస్కృతి అవెన్యూకి వచ్చిన విచారణ జరిపిన ఎన్నికల అధికారులు అపార్ట్ మెంట్ కు ఒకే ఇంటి నెంబర్ ఉండటంతో అందరికీ సేమ్ డోర్ నెంబర్ వచ్చిందని తెలిపారు.5 అంతస్తుల్లో అపార్ట్ మెంట్ ఉండగా అందులో 15 ప్లాట్స్ లో నివాసం ఉంటున్నారు. పార్లమెంట్ ఎన్నికల ఓటర్ లిస్టులోనూ ఇవే పేర్లు ఉన్నాయి. ఎవరైనా చనిపోతే మాత్రమే ఓట్లను తొలగించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఉపఎన్నికల సమయంలో ఓటర్ లిస్టులో భారీ మార్పులకు అవకాశం తక్కువ అని అధికారులు స్పష్టం చేశారు.జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు తొలి రోజు 10 నామినేషన్ల దాఖలయ్యాయి. 10మంది అభ్యర్థుల 11 సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఉపఎన్నికకు స్వతంత్ర అభ్యర్థి సిలివేరు శ్రీకాంత్ తొలి నామినేషన్ దాఖలు చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు నవంబర్ 11న పోలింగ్ జరగనుంది. 14న ఫలితాలు వెల్లడి కాబోతున్నాయి. ఒక అభ్యర్థి రెండు సెట్ల నామినేషన్లు వేశారు. దీంతో 11 నామినేషన్ పత్రాలు వచ్చాయి. దీనికి సంబంధించిన సమాచారం రిటర్నింగ్ అధికారి సాయిరాం ప్రకటించారు. 19, 20వ తేదీలలో సెలవులు ఉంటాయని అప్పుడు నామినేషన్లు స్వీకరించము అని చెప్పారు.21వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. 22న స్క్రూటీని ఉంటుందన్నారు. బోగస్ ఓట్ల అంశంపైనా రిటర్నింగ్ అధికారి స్పందించారు.

## భారతదేశ మిస్సైల్ మ్యాన్ మన అబ్దుల్ కలాం నేడు ఆయన జయంతి

( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

భారతదేశంలో ఉన్న అతికొద్దిమంది గొప్ప శాస్త్రవేత్తల్లో ఏపీజే అబ్దుల్ కలాం ఒకరు. ఈయన పూర్తి పేరు.. డాక్టర్ అవుల్ ఫకీర్ జైనుల్లాబ్దీన్ అబ్దుల్ కలామ్. ఈయన 1931, అక్టోబర్ 15వ తేదీన తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరంలో జన్మించారు. ఈయన తల్లిదండ్రులు అషియమ్మ జైనుల్లాబ్దీన్, జైనుల్లాబ్దీన్ మరకయార్. ఓ మధ్యతరగతి ముస్లిం కుటుంబంలో పుట్టిన ఆయన 1958లో మద్రాస్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ ఎం) నుంచి ఏరోనాటికల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ పుచ్చుకున్నారు. పట్టభద్రుడైన తర్వాత ఆయన భారతదేశపు రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డి.ఆర్.డి.ఒ)లో ఒక విఫలమైన హోవర్ క్రాఫ్ట్ ప్రాజెక్టు మీద పనిచేయడానికి చేరారు. 1962లో భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రోలో చేరారు. అక్కడ ఆయన ఇతర శాస్త్రవేత్తలతో కలసి అనేక కృత్రిమ ఉపగ్రహాలను విజయవంతంగా ప్రయోగించారు. రోహిణి ఉపగ్రహాన్ని జూలై 1980లో విజయవంతంగా భూమి సమీప కక్ష్యలోకి వదిలిన భారతదేశపు తొలి స్వదేశీ ఉపగ్రహ ప్రయోగ వాహనం (ఎస్ఎల్ వి-ఎఎఎ)ని అభివృద్ధి చేయడంలో ప్రాజెక్టు డైరెక్టరుగా ఆయన కృషి ఎంతో ఉంది. 1982లో, ఆయన డీఆర్డీవో డైరక్టరుగా తిరిగి బాధ్యతలు చేపట్టి గైడెడ్ మిస్సైల్స్‌పై దృష్టి కేంద్రీకరించారు. అగ్ని, పృథ్వి క్షిపణి మిస్సైళ్ళ అభివృద్ధి చేసి ప్రయోగించడంలో కీలక పాత్ర పోషించారు. అంటే దేశానికి తొలి మిస్సైల్‌ను అందించిన ఘనత ఆయనదే. అందుకే ఆయనకు "మిస్సైల్ మాన్" అనే పేరు కూడా వచ్చింది. ఆ తర్వాత జూలై 1992లో దేశ రక్షణ మంత్రికి సాంకేతిక సలహాదారుగా నియమితులయ్యారు. అలాగే, భారత ప్రభుత్వానికి ప్రధాన సాంకేతిక సలహాదారుగా కేబినెట్ హోదాలో కొనసాగారు. అబ్దుల్ కలాం కృషి ఫలితంగా 1998లో పోఖ్రాన్-ఎఎ అణుపరీక్షలు విజయవంతంగా పూర్తి చేయడంజరిగింది. ఈ అణు పరీక్షతో భారతదేశాన్ని అణ్వస్త్రరాజ్యాల సరసన చేర్చిన ఘనత ఆయనకే దక్కుతుంది. ఈయనకు భారతదేశ అత్యున్నత పురస్కారాలైన పద్మ భూషణ్ (1981), పద్మ విభూషణ్ (1990), భారతరత్న (1997)లు వరించాయి. అలాగే, దేశంలో ఉన్న విశ్వవిద్యాలయాల్లో కనీసం 30వరకు యూనివర్శిటీలు గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేశాయి. గత ఎన్డీయే ప్రభుత్వ హయాంలో వాజ్‌పేయి ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో అంటే 2002 జూలై 18వ తేదీన భారత రాష్ట్రపతిగా ఎన్నిక కాగా, జూలై 25న రాష్ట్రపతి భవన్‌లో అడుగుపెట్టారు. ఈయనకు నాటి ఎన్డీయే మిత్రపక్షాలతో పాటు ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ కూడా మద్దతు ఇవ్వడంతో 90 శాతానికి పైగా ఓట్ల మెజార్టీతో రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. అబ్దుల్ కలాంపై వామపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా 87-ఏళ్ళ లక్ష్మీ సెహగల్ పోటీ చేశారు. అబ్దుల్ కలాం పూర్తిగా శాకాహారి. మద్యపాన వ్యతిరేకి. బ్రహ్మచారి. ఖచ్చితమైన వ్యక్తిగత క్రమశిక్షణను పాటిస్తారు. "ప్రజలు.. తమ భార్యాపిల్లలకు తమ పిల్లల పిల్లలకూ ఆస్తులు సంపాదించి పెట్టడం కోసమే అవినీతిపరులౌతారు" అంటూ ఆయన బ్రహ్మచర్యాన్ని స్వీకరించారు. ఇస్లాం ప్రకారమైతే ప్రతి ముస్లిమూ పెళ్ళి చేసుకోవాలి. కానీ, కలాం ఖురాన్‌తో పాటు, భగవద్గీతను కూడా చదువుతారు. మతఘర్షణలను నిరసించే



శాంతికాముకుడిగా పేరుగడించారు. ఈయన వింగ్స్ ఆఫ్ ఫైర్, సైంటిస్ట్ టు ప్రెసిడెంట్ వంటి అనేక పుస్తకాలను రచించారు. రాష్ట్రపతిగా కూడా సేవలందించిన మహనీయుడు ఏపీజే అబ్దుల్ కలాం జూలై 27, 2015 సోమవారం సాయంత్రం హఠాన్మరణానికి గురయ్యారు. షిల్లాంగ్‌లోని ఐఐఎంలో సోమవారం విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ అబ్దుల్ కలాం హఠాత్తుగా ప్రసంగం మధ్యలో కుప్పకూలిపోయారు. గుండెపోటుతో కుప్పకూలిన అబ్దుల్ కలాంను స్థానిక బెథాని ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఐసీయూలో ఉంచి చికిత్స అందించే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత 45 నిమిషాల వ్యవధిలోనే కలాం కన్నుమూశారు. అప్పటికి ఆయన వయస్సు 84 సంవత్సరాలు.

## 22 ఏ కిందకు ఎకరాల భూమి అమ్మకోలేరు..వాడుకోలేరు

ఏలూరు, అక్టోబరు 14,కొరందరికీ ఎకరాల కొద్దీ భూమి ఉంది. కానీ ఏదైనా అత్యవసం అయితేనో.. ఆడబిడ్డకో ఇవ్వలేరు.. వారసులకు పంచలేరు. చుట్టూ నీరున్నా.. తాగడానికి పనికి రాదు అన్న చందంగా ఉంది వారి పరిస్థితి. ఎకరాల కొద్దీ భూములున్నా అవన్నీ 22ఎ(నిషేధిత ఆస్తుల) జాబితాలో ఉండటంతో.. ఇటు అమ్ముకోలేక.. అటు వారసులకు పంచలేక భూ యజమానులు నరకం చూస్తున్నారు. అసైన్డ్ భూములు, స్వాతంత్ర్య సమరయోధుల భూములు చేతులు మారినా.. గత ప్రభుత్వం ఫ్రీహోల్డ్‌లో పెట్టి అమ్మకాలు ఆపేసింది. సుమారు 15 వేల ఎకరాల భూములు ఇదే సమస్యను ఎదుర్కొంటున్నాయి.భూమి ఉంటే మనిషికి కొండంత భరోసా. ఎంత పెద్ద కష్టం వచ్చినా సరే.. తీర్చుకోవచ్చు అనే ధీమా ఉంటంది. చిన్న చిన్న అక్కర్లకు అయితే భూమిని తాకట్టు పెట్టి రుణం పొందవచ్చు. పెద్ద సమస్య వస్తే.. భూమిని అమ్ముకుని కష్టం నుంచి బయపడవచ్చు. ఆడబిడ్డ పెళ్లికి కట్నంగా కూడా ఇవ్వొచ్చు. భూమి ఉంటే మనిషికి తల్లి దగ్గర ఉన్నంత భరోసా ఉంటుంది. కానీ ఇప్పుడు మనం చెప్పుకోబోయే రైతులది విచిత్రమైన పరిస్థితి.

వారందరి పేరు మీద వేల ఎకరాల భూములున్నా.. వారికి అక్కరకు రాకుండా పోతున్నాయి. పోని వారసులకు పంచుదామా అంటే దానికి వీలు లేకుండా ఉంది. అసలేంటి సమస్య అంటే..పశ్చిమ గోదావరి జిల్లాలోని చాలా మంది రైతులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. వారి పేరు మీద ఎకరాల కొద్దీ భూములున్నా.. ఇటు ఆర్థిక అవసరాలకు అమ్ముకోలేక.. అటు వారసులకు పంచలేని దుస్థితిలో ఉన్నారు. కారణం వారి భూములు 22ఎ జాబితాలో ఉండటం. అదేలా జరిగింది అంటే.. ప్రభుత్వం అసైన్డ్ ల్యాండ్స్ ఈ జాబితాలోకి వస్తాయి. ఈ భూములను అమ్ముకోలేరు.. వారసులకు పంచలేరు.మండలంలో అత్యధికంగా 15 వేల ఎకరాల భూమి ఈ సమస్యను ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. గతంలో పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములు, స్వాతంత్ర్య సమరయోధులు, సైనికులకు కేటాయించిన భూములను కొందరు అమ్ముకున్నారు. ఈ భూములు పలుమార్లు చేతులు మారాయి. అయితే గతంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ఈ భూములను ఫ్రీహోల్డ్‌లో పెట్టింది. వాటి అమ్మకాలు, కొనుగోళ్లను నిలిపివేసింది

ఈ భూములకు సరైన రిజిస్ట్రేషన్ పత్రాలు, అడంగల్ పత్రాలు, పాస్‌పుస్తకాలు వంటివి ఉన్నా సరే.. పాలకుల నిర్ణయాల వల్ల సంవత్సరాల తరబడి ఇబ్బంది పడుతున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అయినా తమ సమస్యను పరిష్కరిస్తుందని వారు ఆశించారు. కానీ రోజులు గడుస్తున్నా సమస్య పరిష్కారం కాలేదు. ఈక్రమంలో తాజాగా పెదవేగి మండలానికి చెందిన కొందరు.. కోర్టు అనుమతితో భూములను రిజిస్టర్ చేయించుకున్నారు.

అయితే ఈ సమస్య ఎదుర్కొంటున్న అందరూ ఇలా కోర్టుకు వెళ్లడం సాధ్యం కాదు. కనుక ప్రభుత్వమే ఈ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.పెదవేగి మండలంలోనే అత్యధికంగా 15 వేల ఎకరాల భూమి ఈ సమస్యను ఎదుర్కొంటుంది. ఈ భూముల సమస్యలను పరిష్కరించాలని బాధితులు పీజీఆర్ఎస్‌లోనూ విన్నవించుకున్నారు. అయినా ప్రయోజనం లేదని తెలుస్తోంది. ఈ భూములపై ప్రతి వారం కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్షలు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. సరైన పత్రాలు ఉన్న భూములను ఈ జాబితా నుంచి తొలగిస్తామని వెల్లడించారు. వాటి క్రయ, విక్రయాలకు అవకాశం కల్పిస్తున్నామని.. ఈ మేరకు తహసీల్దార్లకు ఆదేశాలు ఇచ్చామని వారు పేర్కొన్నారు

## తెనాలి చెంచుపేటలో దారుణం

### పట్టపగలే నడిరోడ్డుపై వ్యక్తి దారుణ హత్య

గుంటూరు అక్టోబరు 14,
తెనాలి చెంచుపేటలో ని కైలాష్ భవన్ రోడ్డులో టిఫిన్ సెంటర్ వద్ద జ్యూటూరి బుజ్జి(50) అనే వ్యక్తిని దుండగుడు కొబ్బరికాయల కత్తితో నరికి చంపివేసాడు. త్రీటౌన్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. దుండగుడు స్కూటీపై మస్క్ వేసుకొని వచ్చి హత్య చేసి పరార్ అయినట్టు స్థానికులు చెబుతున్నారు. మృతుడు అమర్తలూరు మండలం, కోడితాడిపర్రు గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. చెంచుపేట లో కూతురిని ఇంటికి వచ్చి టిఫిన్ చెయ్యటానికి బయటకు వెళ్లినప్పుడు ఘటన జరిగింది.

## చిన్నారిని రైల్వే స్టేషన్ లో వదిలేసిన మహిళ

ఇచ్ఛాపురం అక్టోబరు 14,
ఒక చిన్నారి ని ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ లో గుర్తు తెలియని వ్యక్తులు విడిచిపెట్టి వెళ్ళిపోయారు. వివరాల్లోకి వెళ్తే ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ ఫ్లాట్ ఫామ్ పై మంగళ వారం ఉదయం ఓ వెండర్ కి పాపని చూడమని టాయిలెట్ కి వెళ్లి వస్తామని ఓ మహిళ అప్పగించి వెళ్ళి పోయారు.
అనంతరం మరో వెండర్ సహకారంతో పలాస రైల్వే స్టేషన్ లో చైల్డ్ హెల్ప్ డెస్క్ కు రైల్లో తీసుకొచ్చి అప్పగించారు. ప్రస్తుతం చైల్డ్ లైన్ సూపర్వైజర్లు బాల సరస్వతి భాగ్యలక్ష్మి గల వద్ద సురక్షితంగా ఉండగా శ్రీకాకుళం శిశు గృహానికి తరలించనున్నారు.

# నేడు ప్రపంచ విద్యార్థుల దినోత్సవం




( పెండ్యాల రామ్ కుమార్, మంథని )

ప్రపంచ విద్యార్థుల దినోత్సవం ప్రతి సంవత్సరం అబ్దుల్ కలాం జయంతి రోజైన అక్టోబర్ 15న నిర్వహిస్తారు. 2015లో ఐక్యరాజ్య సమితి అబ్దుల్ కలాం జయంతిని ప్రపంచ విద్యార్థుల దినోత్సవంగా ప్రకటించింది. భారతదేశపు క్షిపణి శాస్త్రవేత్త, 11వ భారత రాష్ట్రపతి అయిన ఏ.పి.జె. అబ్దుల్ కలామ్ 2015, జులై 27న మరణించాడు. ఆ సందర్భంగా ఐక్యరాజ్యసమితి అబ్దుల్ కలామ్ కు ఘన నివాళి అర్పించింది. అత్యున్నత రాష్ట్రపతి పదవిలో ఉన్నప్పుడు కలాం విద్యార్థుల్లో విజ్ఞానాన్ని నింపడానికి ప్రయత్నం చేశాడనీ, భారత రాష్ట్రపతిగా ప్రపంచ శాంతి కోసం పరితపించారని ఐక్యరాజ్యసమితి కొనియాడుతూ అబ్దుల్ కలాం జయంతి రోజైన అక్టోబర్ 15ను ప్రపంచ విద్యార్థుల దినోత్సవంగా నిర్ణయించింది.

==========================

# ముంచుకొస్తున్న మరో మహమ్మారి

టోక్యో, అక్టోబరు 14,

కరోనా మహమ్మారి తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఒక పెద్ద సంక్షోభం పొంచి ఉంది. జపాన్ ఇన్ఫ్లుఎంజా మహమ్మారిని ప్రకటించింది. వాస్తవానికి ఆ దేశంలో ఫ్లూ కేసుల సంఖ్య అకస్మాత్తుగా పెరిగింది. అందువల్ల ఈ వ్యాధిని ఎదుర్కోవడానికి మొదటి నుండి చర్యలు ప్రకటించారు. జపాన్‌లో 4,000 మందికి పైగా ఆసుపత్రి పాలయ్యారు. చాలా చోట్ల పాఠశాలలు మూసివేశారు. జపాన్‌లో ఫ్లూ రోగులు కొత్త కాదు, కానీ ఈ సంవత్సరం వారు పెరిగే సీజన్ కంటే చాలా ముందుగానే సమస్య తలెత్తింది. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. వ్యాప్తి సాధారణం కంటే ఐదు వారాల ముందుగానే వచ్చింది, ఇది ఆసియా అంతటా వైరస్ వ్యాప్తి నమూనాలో మార్పును సూచిస్తుంది. ముందు జాగ్రత్త చర్యగా వీలైనంత త్వరగా టీకాలు వేయించుకోవాలని ఆ దేశ ఆరోగ్య మంత్రిత్వ శాఖ పౌరులను కోరింది. ఈ కేసుల ప్రారంభ పెరుగుదల ఆసుపత్రి వ్యవస్థలపై ఒత్తిడిని కలిగిస్తుందని వైద్యులు హెచ్చరించారు. దీనిని కాలానుగుణ ఫ్లూ వ్యాప్తి అని పిలుస్తున్నప్పటికీ, దాని తీవ్రత, సమయం భారతదేశంతో సహా ఇతర దేశాలకు హెచ్చరిక గంటలు లేవనెత్తాయి. ఎందుకంటే శీతాకాలం సమీపిస్తోంది, శ్వాసకోశ సమస్యలు పెరుగుతున్నాయి. అధికారుల ప్రకారం జపాన్‌లోని 47 ప్రిఫెక్చర్లలో 28 చోట్ల కేసుల సంఖ్య పెరిగింది. ముఖ్యంగా టోక్యో, ఒకినావా, కగోషిమాలో మరిన్ని కేసులు కనుగొన్నారు. అక్కడ 130కి పైగా పాఠశాలలు, పిల్లల సంరక్షణ కేంద్రాలు తాత్కాలికంగా మూసివేశారు. వైద్యుల ప్రకారం ఈ సంవత్సరం వ్యాప్తి అనేక కారణాల వల్ల మరింత తీవ్రంగా మారింది. ఇందులో ఫ్లూ వైరస్ విభిన్న జాతి కూడా ఉంది, ఇది మునుపటి కంటే శక్తివంతమైనదని చెబుతారు. అలాగే కోవిడ్-19 మహమ్మారి సమయంలో సంవత్సరాల తరబడి తక్కువ సంపర్కం కారణంగా రోగనిరోధక శక్తిలో హెచ్చుతగ్గులు కూడా కేసుల సంఖ్య పెరగడానికి ఒక కారణం. అదనంగా క్రమరహిత వాతావరణం కూడా వైరస్ వ్యాప్తిని పెంచుతోంది. వైద్యులు కూడా దీనికి కారణం ఫ్లూకు వ్యతిరేకంగా టీకాలు వేయడం తగ్గడమేనని ఆపాదించారు. మహమ్మారి తర్వాత చాలా మంది నిర్లక్ష్యంగా మారారు, వార్షిక ఫ్లూ వ్యాక్సిన్ తీసుకోవడానికి సమయం తీసుకోరు, దీనివల్ల వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతోంది.

నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ప్రస్తుతానికి ఇది జరిగే అవకాశం లేదు. ఎందుకంటే ఇది సీజనల్ ఇన్ఫ్లుఎంజా మహమ్మారి ఇది ప్రధానంగా ఊ3ఔ2 అనే జాతి వల్ల వస్తుంది, దీనిని అధ్యయనం చేశారు. అలాగే శాస్త్రవేత్తలు ఇది కచ్చితంగా ఒక హెచ్చరిక అని అంటున్నారు. అందువల్ల నిరంతర పర్యవేక్షణ, టీకాలు వేయడం చాలా అవసరం. వృద్ధులు, పిల్లలు, ఇప్పటికే అనారోగ్యంతో ఉన్న వ్యక్తులు టీకాలు వేయించుకోవాలని వైద్యులు పదే పదే విజ్ఞప్తి చేస్తున్నారు.

================

# మధుయాష్కీని పరామర్శించిన మీనాక్షి నటరాజన్

## ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్న మీనాక్షి

హైదరాబాద్ అక్టోబరు 14,



ఏఐసీసీ తెలంగాణ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ మంగళవారం నాడు బంజారాహిల్స్ లోని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ నివాసానికి వచ్చారు. ఇటీవల సెక్రటరియేట్ లో స్వల్ప అస్వస్థతకు గురైన మధుయాష్కీ ని పరామర్శించారు. ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తాజా రాజకీయ పరిణామాలపై వారు చర్చించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనపై కోర్టు తీర్పు, ప్రభుత్వ పరంగా చేపడుతున్న చర్యలు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

# ఇంటి గుమ్మం ముందు మనిషి పుర్రె కలకలం

విజయనగరం అక్టోబరు 14,

డెంకాడ మండలంలోని ఊడికలపేట గ్రామంలో ఓ ఇంటి ముందు మనిషి పుర్రెకు పూజలు చేసిన ఘటన కలకలం రేపింది. స్థానిక ఎస్సై సన్యాసినాయుడు తెలిపిన వివరాల ప్రకారం, వ్యవసాయ కూలీ పొంతపల్లి పైడమ్మ ఇంటి గుమ్మం వద్ద సోమవారం తెల్లవారుజామున పసుపు, కుంకుమతో పూజ చేసిన పుర్రెను గుర్తించారు.

# బాలయ్యకు మంత్రి పదవి...?

అనంతపురం, అక్టోబరు 14, (న్యూస్ పల్స్)

తెలుగుదేశం పార్టీలో చంద్రబాబు, లోకేష్ తర్వాత ఎవరూ అంటే.. తప్పకుండా బాలకృష్ణ అని సమాధానం వస్తుంది. ప్రస్తుతం నందమూరి కుటుంబం నుంచి రాజకీయంగా యాక్టివ్ గా ఉన్నది ఆయనే. ఒక విధంగా చెప్పాలంటే పదవులు ఆశించకుండా పార్టీలో ఉంటూ వస్తున్నారు బాలయ్య. నందమూరి కుటుంబాన్ని జనాలు గుర్తించుకునే విధంగా ఉండడం కోసమే ఆయన ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వరుసగా హిందూపురం నుంచి మూడుసార్లు గెలిచారు. 2019 జగన్ ప్రభంజనంలో సైతం గట్టిగానే నిలబడ్డారు బాలకృష్ణ. అందుకే 2024 ఎన్నికల్లో గెలిచేసరికి ఆయనకు మంత్రి పదవి దక్కుతుందని భావించారు. కానీ ఒకవైపు సీఎం గా చంద్రబాబు ఉండగా.. లోకేష్ మంత్రిగా ఉన్నారు. సమీకరణల దృష్ట్యా బాలకృష్ణకు చాన్స్ లేదు. అలాగని తనకు మంత్రి పదవి కావాలని బాలకృష్ణ ఎన్నడూ కోరలేదు. కనీసం ఒక్క పని కోసం గురించి కానీ.. పదవి కోసం కానీ పట్టుబట్టే గుణం కాదు నందమూరి బాలకృష్ణ ది. అయితే ఇటీవల జరిగిన పరిణామాల క్రమంలో నందమూరి బాలకృష్ణ మంత్రిగా చూడాలనుకుంటున్నారు అభిమానులు. అందుకే తమ మనసులో ఉన్న మాటను బయట పెడుతున్నారు. తాజాగా హిందూపురంలో సైతం అభిమానులు ఇదే డిమాండ్ చేశారు. కానీ బాలకృష్ణ మాత్రం సున్నితంగా స్పందించారు. 2014లో ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేశారు నందమూరి బాలకృష్ణ. అనంతపురం జిల్లా హిందూపురం నియోజకవర్గాన్ని ఎంచుకున్నారు. ఆ నియోజకవర్గంలో నందమూరి తారక రామారావు, అటు తరువాత నందమూరి హరికృష్ణ ప్రాతినిధ్యం వహించిన పరిస్థితి ఉంది. అక్కడ నందమూరి కుటుంబానికి ప్రత్యేక అభిమానులు ఉన్నారు. అందుకే బాలకృష్ణ ఆ నియోజకవర్గాన్ని ఎంచుకున్నారు. 2014లో నందమూరి బాలకృష్ణ గెలవడం.. టిడిపి అధికారంలోకి రావడంతో తప్పకుండా మంత్రి పదవి లభిస్తుందని అంచనా వేశారు. కానీ తనకు రాజకీయాల కంటే సినిమాలే మొదటి ప్రయారిటీ అన్నట్టు బాలకృష్ణ వ్యవహరించారు. పైగా నారా లోకేష్ అప్పుడే మంత్రి అయ్యారు. ఒకే కుటుంబంలో మూడు పదవులు సరికాదని భావించి బాలకృష్ణ కూడా మంత్రి పదవి కోసం డిమాండ్ చేయలేదు. ఒక విధంగా చెప్పాలంటే లోకేష్ రాజకీయ ఎదుగుదల కోసమే బాలకృష్ణ వెనక్కి తగ్గారన్న టాక్ అప్పట్లో ఉండేది. ఇప్పుడు కడా బాలకృష్ణ పార్టీ కోసం ఉన్నారే తప్ప పదవుల కోసం కాదన్నట్టు ఉంటారు. సినీ పరిశ్రమలో మెగా కుటుంబం వర్సెస్ నందమూరి కుటుంబం అన్నట్టు ఉండేది. అభిమానుల మధ్య వైరుధ్యం ఉండేది. ఈ క్రమంలో 2024 ఎన్నికల్లో పవన్ నేతృత్వంలోని జనసేన కీలకపాత్ర పోషించింది. పవన్ టిడిపి తో కలిసి పని చేశారు. కష్టకాలంలో కూడా చంద్రబాబు కుటుంబానికి అండగా నిలిచారు. టిడిపి కూటమి అధికారంలోకి రావడంతో పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎం అయ్యారు. అయితే పవన్ కళ్యాణ్ కంటే చిత్ర పరిశ్రమలో బాలకృష్ణ



సీనియర్. రాజకీయంగా కూడా ఒకరకంగా సీనియర్. అయితే అదే సమయంలో పవన్ పట్ల గౌరవభావంతో ఉన్నారు బాలకృష్ణ. కానీ బాలకృష్ణ అభిమానులు మాత్రం ఆయనను మంత్రి పదవిలో చూడాలనుకుంటున్నారు. ఒక అడుగు ముందుకేసి పవన్ కళ్యాణ్ కు మంత్రి ఇచ్చారు.. తమ అభిమాన నాయకుడికి ఎందుకు ఇవ్వరన్న ప్రశ్న కూడా వినిపించింది. కానీ పదవి కోసం ఎన్నడు బాలకృష్ణ రియాక్ట్ కాలేదు. పార్టీ కోసం ఆయన పని చేస్తూ వచ్చారు.

సింహభాగం సినిమాలకు కేటాయిస్తూ.. హిందూపురం శాసనసభ్యుడిగా కొనసాగుతున్నారు. తాజాగా తన సొంత నియోజకవర్గం హిందూపురంలో పర్యటించారు నందమూరి బాలకృష్ణ. సోమవారం ఉదయం బాలయ్య స్థానికులతో ముచ్చటించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో ఓ పాఠశాలలో విద్యార్థులను కలిసేందుకు బాలయ్య కారులో వెళ్తుండగా కొంతమంది అభిమానులు రోడ్డుకు అడ్డంగా నిల్చున్నారు. బాలయ్యను మంత్రిగా చూడాలని ఉందంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. వారిని చూసి కారు దిగిన బాలయ్య ఏది మాట్లాడకుండా నవ్వుతూ సముదాయించే ప్రయత్నం చేయబోయారు. దేనికైనా సమయం వస్తుందని కార్యకర్తలకు నచ్చజెప్పి అందరికీ. అనంతరం అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఈ ఘటన ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

--------------------------------

## 2061 నాటి ఒత్తిడికి తగ్గట్టుగా

# రెడీ అవుతున్న బెజవాడ రైల్వేస్టేషన్

విజయవాడ, అక్టోబరు 14,

విజయవాడ రైల్వేస్టేషన్‌కు మహర్దశ పట్టనుంది. ఇక మీదట ఈ స్టేషన్‌లో విమానాశ్రయం తరహా సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. రానున్న 30 ఏళ్ల ప్రయాణికుల అవసరాలకు తగ్గట్టుగా స్టేషన్‌ని అభివృద్ధి చేయబోతున్నారు. నీతి ఆయోగ్ ఈ రైల్వే స్టేషన్ ఆధునికీకరణకు ఆమోదం తెలిపింది. పీపీపీ పద్ధతిలో చేపట్టే ఈ ప్రాజెక్టుతో స్టేషన్ రూపురేఖలే మారిపోనున్నాయి. స్టేషన్‌లో ప్లాట్‌ఫారాల సంఖ్య పెరగడమే కాక.. లిఫ్టులు, ఎస్కలెటర్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించబోతున్నారు. భారత్ స్టేషన్ పథకంలో భాగంగా.. కేంద్ర ప్రభుత్వం.. దేశవ్యాప్తంగా ఉన్న ప్రధానమైన రైల్వే స్టేషన్ల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోంది. దీనిలో భాగంగా విజయవాడ రైల్వే స్టేషన్ రూపు రేఖలు మార్చేందుకు సిద్ధమయ్యింది. వందల కోట్లరూపాయల నిధులు వెచ్చించి స్టేషన్‌ను అభివృద్ధి చేయనున్నారు. రానున్న 30 ఏళ్ల పాటు ప్రయాణికులు అవసరాలు తీర్చేలా స్టేషన్‌ను అభివృద్ధి చేయనున్నారు. పీపీపీ విధానంలో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈక్రమంలో రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫారాల సంఖ్య పెంచనున్నారు. ఆ వివరాలు..కేంద్రం ప్రభుత్వం చొరవతో.. విజయవాడ రైల్వేస్టేషన్‌ను విమానాశ్రయానికి ధీటుగా అభివృద్ధి చేయనున్నారు. వచ్చే 30 ఏళ్లలో ప్రయాణికుల అవసరాలకు తగ్గట్టుగా స్టేషన్‌ను ఆధునికీకరించనున్నారు. ఈ అభివృద్ధి పనులకు తాజాగా నీతి ఆయోగ్ ఆమోదం తెలిపింది. ప్రైవేట్ పబ్లిక్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) పద్ధతిలో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఈమేరకు రైల్ ల్యాండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఈ పనుల టెండర్లకు సంబంధించి తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది. డిసెంబర్ 31 లోపు టెండర్లు దాఖలు చేయాలని తెలిపింది. ప్రస్తుతం విజయవాడ రైల్వే స్టేషన్‌లో రోజుకు లక్ష నుంచి 2 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే మరో 30 ఏళ్లలో అనగా 2061 నాటికి ప్రయాణికుల సంఖ్య 4-5 లక్షలకు చేరుకుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందుకు తగ్గట్టుగా స్టేషన్‌ను



తీర్చిదిద్దనున్నారు. ప్రస్తుతం రైల్వే స్టేషన్ ప్రధాన ద్వారం వైపు మాత్రమే అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. త్వరలోనే పశ్చిమ వైపు కూడా రైల్వే స్టేషన్‌ను విస్తరించనున్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా వన్‌టౌన్ వైపు 2, 3 అదనపు ప్లాట్‌ఫారాలు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. దీంతో పాటు.. ప్రస్తుతం ఆర్ఈ కాలనీలో ఉన్న రైల్వే క్వార్టర్స్‌ను తొలగించి.. ఆ స్థలాన్ని కూడా అభివృద్ధికి వాడుకోనున్నారు. విజయవాడ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనుల్లో భాగంగా.. ఇక్కడ విమానాశ్రయంతో సమానమైన సౌకర్యాలు కల్పించనున్నారు. విజయవాడ స్టేషన్ 84 వేల చదరపు మీటర్లలో ఉంటుంది. ఆధునీకికరణలో భాగంగా రైల్లే స్టేషన్లో కొత్తగా 2, 3 ప్లాట్‌పారాలు రానున్నాయి. లిఫ్టుల సంఖ్య 20కి పెరగనుండగా.. ఎస్కలెటర్ల సంఖ్య 15కు పెరగనుంది. 3 ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించనున్నారు. ఇందుకు గాను సుమారు రూ. 661.11 కోట్లు ఖర్చు అవుతుందని భావిస్తున్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే ఈ ఆధునికీకరణ ముఖ్య ఉద్దేశ్యం అంటున్నారు అధితకారులు. స్టేషన్‌ను మరింత విశాలంగా, ఆధునికంగా మార్చడం ద్వారా ప్రయాణ అనుభవాన్ని మెరుగుపరచాలని రైల్వే అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మార్పులతో విజయవాడ రైల్వేస్టేషన్ ఒక ప్రధాన రవాణా కేంద్రంగా రూపుదిద్దుకోనుంది.

# గులాబీ పార్టీలో గ్రూపుల లొల్లి

మెదక్, అక్టోబరు 14,

మెదక్ అసెంబ్లీ నియోజకవర్గంలో గులాబీ పార్టీలో గ్రూపు విబేధాలు తారా స్థాయికి చేరుకుంటున్నాయి. ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షురాలు పద్మాదేవేందర్రెడ్డి, కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్రెడ్డి మూడు గ్రూపులుగా విడిపోయారు. ఏదైనా పార్టీ పెద్దలు హాజరయ్యే కార్యక్రమానికి మినహా ఇతరత్ర కార్యక్రమాల్లో ఎడమొహం పెడమొహంలా వ్యవహరిస్తుండడంతో బీఆర్ఎస్ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ బాకీ కార్డు పంపిణీ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్రెడ్డి



నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్రెడ్డి హాజరయ్యారు. కంఠారెడ్డి తిరుపతిరెడ్డి మాత్రం కనిపించలేదు. ఏమిటని ఆరా తీస్తే తనకు ఆహ్వానం లేదని అందుకే హాజరుకాలేదని తెలిసింది. కాగా ఆదివారం కంఠారెడ్డి తిరుపతిరెడ్డి తన సొంత మండలం నిజాంపేటలో కాంగ్రెస్ బాకీ కార్డు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పద్మాదేవేందర్రెడ్డి, శేరి సుభాష్రెడ్డి హాజరుకాలేదు. ఈ కార్యక్రమం అనంతరం మీడియాతో మాట్లాడుతున్న సమయంలో రానున్న ఎన్నికల్లో మెదక్ నుండి పోటీ చేస్తారా అన్న ప్రశ్నకు కంఠారెడ్డి స్పష్టంగా సమాధానం ఇచ్చారు. రానున్న రోజుల్లో మెదక్ అసెంబ్లీ సీటు తనకేనని, అధిష్టానంపై తనకు నమ్మకం ఉందని, కచ్చితంగా తాను పోటీ చేస్తానని స్పష్టం చేశారు. ఈ ప్రకటనతో ఒక్కసారిగా పద్మాదేవేందర్రెడ్డి వర్గీ యులతో పాటు ఇతరులకు మింగుడు పడకుండా అయిందని ప్రచారం. మెదక్ అసెంబ్లీ సీటుపై గులాబీ పార్టీలో ఇప్పటి నుండే పోటీ నెలకొంది. ఇప్పటికే నియోజకవర్గంలో మూడు వర్గాలుగా విడిపోయి కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో సైతం పద్మాదేవేందర్రెడ్డి వ్యవహార శైలితో కార్యకర్తలు దూరం పెట్టడంతోనే ఓటమి పాలయ్యారు. తిరుపతిరెడ్డి బీఆర్ఎస్లో చేరకముందు నియోజక వర్గంలో పద్మకు, శేరి సుభాష్రెడ్డి మధ్య విబేధాలు పొడచూపాయి. రెండు గ్రూపులుగా పార్టీ కార్యకర్తలు వ్యవహరించా రు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీలో టికెట్టు దక్కకపోవడంతో కంఠారెడ్డి తిరుపతిరెడ్డి బీఆర్ఎస్లో చేరారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవడం, కంఠారెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు కొనసాగించిన వ్యవహార శైలితో పద్మాదేవేందర్రెడ్డి వర్గీయులకు మింగుడు పడలేదు. నియోజకవర్గంలో పార్టీలకతీతంగా కంఠారెడ్డి కార్యకర్తలను ఆదుకోవడం, ఆర్థిక సహాయం చేయడంతో మంచి గుర్తింపు రావడంతో అసెంబ్లీ సీటుకు పోటీ పెరిగినట్లు భావిస్తున్నారు. పద్మదేవేందర్రెడ్డి, తిరుపతిరెడ్డి మధ్య దూరం పెరిగిపోయినట్లు తెలుస్తోంది. పలుమార్లు పార్టీ కార్యక్రమాలకు తిరుపతిరెడ్డికి ఆహ్వానం లేకపోవడంతో ఆయన కూడా తన మద్దతును పెంచుకుంటూ వెళ్తున్నారు. మరోవైపు శేరి సుభాష్రెడ్డి మౌనంగా పరిశీలి స్తున్నట్లు తెలిసింది. అయితే కంఠారెడ్డి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తనకే సీటు ఇస్తారని, అధిష్టానం మాట ఇచ్చిందని మీడియా ముఖంగా స్పష్టం చేస్తుండడం పట్ల పద్మ వర్గీయుల్లో ఆందోళన మొదలైంది. ఓవైపు అధికారం కోల్పోయి బీఆర్ఎస్ పోరాటం సాగిస్తున్న నేపథ్యంలో సొంత పార్టీలోనే గ్రూపు విబేధాల తలనొప్పి ఎక్కువవుతుందని భావిస్తు న్నారు. మాజీ మంత్రి హరీష్రావు ఈ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో, గ్రూపు విబేధాలు సద్దుమణిగేలా చేస్తారా అనేది వేచిచూడాల్సిందే.

================

# గేమ్ ఛేంజర్‌గా విజయ్..

.చెన్నై, అక్టోబరు 14,

తమిళనాడులో త్వరలో ఎన్నికలు జరగబోతున్నాయి. ఈసారి తమిళ సుప్రసిద్ధ నటుడు తమిళనాడు రాజకీయాలను శాసించే పరిస్థితి కనిపిస్తోంది. ఆయన ఏర్పాటు చేసిన టీవీకే కు అక్కడి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. మధురై నుంచి మొదలు పెడితే చెన్నై వరకు ఆయన నిర్వహించిన సభలకు భారీగా జనం వచ్చారు. దీంతో అక్కడ అధికార పార్టీలో ప్రకంపనలు మొదలయ్యాయి. దీనికి తోడు వారంతా కూడా విజయ్ పార్టీ మీద విమర్శలు చేయడం మొదలుపెట్టారు. ఇది ఇలా ఉండగానే కరూర్ ఘటన జరిగింది. దీంతో విజయ్ మీద అధికార పార్టీ విమర్శలు చేయడం మొదలుపెట్టింది. రాజకీయంగా తొక్కే ప్రయత్నాన్ని విజయవంతంగా చేసింది. ఎప్పటికైనా నిజమే గెలుస్తుంది అనే సిద్ధాంతాన్ని నమ్మిన విజయ్.. తనమీద జరుగుతున్న కుట్రలకు వ్యతిరేకంగా పోరాడాలని నిర్ణయించుకున్నారు. కరూర్ ఘటనలో తన ప్రమేయం లేకపోయినప్పటికీ ఇబ్బంది పెడుతున్నారని.. పార్టీని అనవసరంగా విమర్శిస్తున్నారని అతడేకంగా సుప్రీంకోర్టు మెట్లు ఎక్కారు. దీంతో సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది.. కరూర్ ఘటనపై తమిళనాడు ప్రభుత్వంపై ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని తప్పు పట్టింది. ఇదంతా కూడా రాజకీయ కక్షతో చేస్తున్నారని ప్రశ్నించింది. కరూర్ ఘటనపై నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని కేంద్ర దర్యాప్తు బృందాన్ని ఆదేశించింది. అంతేకాదు ఈ వ్యవహారం మొత్తాన్ని కూడా



సిబిఐ మాత్రమే చేయాలని సోమవారం ఆదేశాలు జారీ చేసింది. దీంతో టీవీకే పార్టీ అధినేత విజయ్ కి కాస్త ఉపశమనం లభించింది. గత నెల 27న కరూర్ ప్రాంతంలో తమిళ వెట్రి కట్చి అధినేత విజయ్ కరూర్ ప్రాంతంలో స్ట్రీట్ కార్నర్ మీటింగ్ పెట్టారు. ఈ మీటింగ్ కు భారీగా జనం వచ్చారు. ఆ సమయంలో తొక్కిసలాట జరిగింది. ఆ ప్రమాదంలో 41 మంది చనిపోయారు. ఇంతమంది చనిపోయిన నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించింది. తమిళనాడు అధికారులు దర్యాప్తు చేయడం పట్ల విజయ్, ఇతర నేతలు అభ్యంతర వ్యక్తం చేశారు. ఏకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టులో జస్టిస్ మహేశ్వరి, జస్టిస్ ఆంజరియా తో కూడిన ధర్మసనం తమిళనాడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పు చెప్పింది. విజయ్ కోరినట్టుగానే సిబిఐతో ఈ కేసును విచారించాలని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటివరకు ఈ కేసులో తమిళనాడు రాష్ట్ర ప్రత్యేక దర్యాప్తు బృందం సేకరించిన ఆధారాలను సిబిఐ కి అప్పగించాలని పేర్కొంది.. ఈ ఘటనలో నిజాలను వెలికి తీసి.. ప్రజల ముందు ఉంచాలని.. సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. సుప్రీంకోర్టు దాకా ఈ కేసును తీసుకువెళ్లడంలో టీ వీ కే కార్యదర్శి బుస్సి ఆనంద్ కీలక పాత్ర పోషించారు. ఆయన విజయ్ కి నమ్మినబంటు లాగా ఉన్నారు. పార్టీ కార్యకలాపాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విజయవంతమవుతున్నారు. ఆయన సీనియర్ రాజకీయ నాయకుడు కావడంతో.. రాజకీయ అనుభవాన్ని ఉపయోగించుకుంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఇంతటి కష్టకాలంలో విజయ్ అంతటి ధైర్యంతో ఉన్నారంటే దానికి ప్రధాన కారణం ఆనంద్ అనడంలో ఎటువంటి సందేహం లేదు. సుప్రీంకోర్టు టీవీ కేకు అనుకూలంగా తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఆనంద్ హర్షం వ్యక్తం చేశారు. త్వరలోనే నిజం బయటపడుతుందని.. డీఎంకే పార్టీ చేసిన దారుణం వెలుగులోకి వస్తుందని ఆనంద్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలి: జాయింట్ కలెక్టర్ అధితి సింగ్



వైయస్సార్ కడప జిల్లా, అక్టోబర్ 14: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలని జాయింట్ కలెక్టర్ అధితి సింగ్ అధికారులను ఆదేశించారు.

కలెక్టరేట్లోని సభా భవన్ సమావేశ హాలు నందు.. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ తోపాటు డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అధితి సింగ్ మాట్లాడుతూ... ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు .. క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. అర్జీలు పెండింగ్ లేకుండా రీఓపెన్ కాకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు.క్రింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారే వెళ్లాలని అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. ఎండార్స్ ఇచ్చిన అర్జీలకు జిల్లా అధికారులు ఖచ్చితంగా పరిశీలించాలన్నారు.పిజిఆర్ఎస్ లో రీ ఓపెన్ అయిన అర్జీలను మరింత నాణ్యతతో పరిష్కరించాలి. జిల్లా అధికారులు మీకు వచ్చిన అర్జీలను సమయం కేటాయించి రివ్యూ చేయాలన్నారు. ఎవరైనా అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని అధికారులను హెచ్చరించారు.అలాగే అర్జీలు బియాండ్ ఎస్ ఎల్ ఏ లేకుండా చూడాలన్నారు.అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు.

లిలిప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా.. ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు..

1) చక్రాయిపేట మండలం కుప్పం తాండకు చెందిన ఉపేంద్ర నాయక్ దాదాపు 300 మంది గిరిజనులు ఈ తాండలో నివసిస్తున్నామని మా గ్రామం నందు నెట్వర్క్ సరిగా పని చేయడం లేదని సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం అర్జీని సమర్పించారు.

2) కడప బాలాజీ నగర్ కు చెందిన నరసింహరావు ఎం ఓ సి కొరకు అర్జీ సమర్పించానని, త్వరితగతన ఎన్ఓసి ఇప్పించాలని కోరుతూ సోమవారం ప్రజా సమస్యల పరిష్కారక వేదికలో అర్జీని సమర్పించారు.

3) వేంపల్లి మండలం దూపాడు గ్రామానికి చెందిన పార్వతి తమ వ్యవసాయ భూమిని సర్వే చేయించి ఆన్లైన్ ఎక్కించాలని కోరుతూ అర్జీని సమర్పించారు.

ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## క్వాలిటీ, క్వాంటిటీ తో ప్రజలకు ఇంధన సేవలు:జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

ప్రొద్దుటూరు, అక్టోబర్ 14(భారత శక్తి) : క్వాలిటీ, క్వాంటిటీలో ఎక్కడా



రాజీ లేకుండా ప్రజలకు పారదర్శకంగా మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో రెవెన్యూ శాఖ నిర్వహణలో పెట్రోల్ స్టేషన్ ఏర్పాటు చేయడం హర్షణీయం అని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు.

మంగళవారం ప్రొద్దుటూరు పట్టణంలోని ఎమ్మార్వో కార్యాలయ సమీపంలో ప్రధాన రహదారిలో నూతనంగా ఏర్పాటు చేసిన రెవెన్యూ సంక్షేమ ఫిల్లింగ్ స్టేషన్ ను జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులు రెడ్డితో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇంధన సేవా రంగంలో ప్రజలకు మెరుగైన.సేవలు అందించే లక్ష్యంతో రెవెన్యూ సంక్షేమ ఫిల్లింగ్ స్టేషన్ ను భారత్ పెట్రోలియం సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

రాయలసీమలో ఇది మూడవ రెవెన్యూ పెట్రోల్ బంక్ అని, అలాగే జిల్లాలో కూడా మూడు పెట్రోల్ బంక్ లు నిర్వహణలో ఉన్నాయన్నారు. భవిషత్తులో ప్రొద్దుటూరు పట్టణంలో సీఎన్జీ ఫిల్లింగ్ స్టేషన్ కూడా క్ స్థాపించడానికి చర్యలు చేపడుతామన్నారు.

ఆర్థికంగా అత్యంత వేగవంతంగా జిఎస్టీ ఆదాయంలో ప్రొద్దుటూరు పట్టణంలో 20% భాగస్వామ్యాన్ని కలిగివుందన్నారు. ప్రొద్దుటూరు పట్టణంలో వినియోగదారులు అధికంగా ఉన్నారని.. రెవెన్యూ శాఖ ఆద్వర్యంలో నడిచే ఈ ఫిల్లింగ్ స్టేషన్ కు మంచి ఆదరణ లభిస్తుందన్నారు. భవిష్యత్తులో పొగలేని సిఎన్జీ ఇంధనాన్ని ప్రాచుర్యంలోకి తీసుకు వచేందుకు చర్యలు చేపడతామన్నారు. రైతులు పండించే పంట ఉత్పత్తుల ద్వారా ఉత్పత్తయ్యే ఇథనాల్ ను కాలుష్య రహిత ఇందనంగా వినియోగదారులకు అందివ్వడం జరుగుతోందన్నారు.

ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ సంస్థల నిర్వహణలో సేవలందించే పెట్రోల్ బ్యాంకుల్లో స్వచ్ఛమైన, నాణ్యమైన, కొలత పరంగా కూడా కచ్చితమైన పరిమాణంలో సరఫరా చేయడం జరుగుతుందన్నారు. రెవెన్యూ పెట్రోల్ బంక్ సర్వీసు లాభదాయకంగా జరిగేలా ప్రొద్దుటూరు ప్రజలు సహకరించాలని కోరారు.

అనంతరం ఫిల్లింగ్ స్టేషన్ ఆవరణలో "హరిత ప్రొద్దుటూరు" లో భాగంగా జిల్లా కలెక్టర్ మొక్కలను నాటారు.

ఈ కార్యక్రమంలో ఎంపిపి కొనిరెడ్డి శివచంద్రా రెడ్డి, భారత్ పెట్రోలియం లిమిటెడ్ టెర్రిటరీ మేనేజర్ (నెల్లూరు) వేణుగోపాల్, తహశీల్దార్ గంగయ్య, రెవెన్యూ అధికారులు, భారత్ పెట్రోలియం సంస్థ ప్రతినిధులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## డైసెల్ ల్యాబొరేటరీస్ ను సందర్శించిన గీతం విద్యార్థులు

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 14:
అనుభవపూర్వక అభ్యాసం, పరిశ్రమ సందర్శన కార్యక్రమాలలో భాగంగా, హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ (జీఎస్పీ) ఎం.ఫార్మా, పరిశోధక విద్యార్థులు ప్రముఖ పరిశోధన ఆధారిత ఔషధ సంస్థ డైసెల్ లాబొరేటరీస్ ను సందర్శించారు.డైసెల్ చిరల్ టెక్నాలజీస్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్ తల్లూరి గీతం విద్యార్థులను స్వాగతించగా, అధ్యాపకులు డాక్టర్ గటాడి శ్రీకాంత్, డాక్టర్ ప్రియా సింగ్ ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. ఈ సందర్శనలో భాగంగా, విద్యార్థులు క్రోమాటోగ్రఫీ, స్పెక్ట్రోస్కోపీ, సూపర్ క్రిటికల్ ఫ్లూయిడ్ క్రోమాటోగ్రఫీ యూనిట్లతో సహా వివిధ విశ్లేషణాత్మక విభాగాలను పర్యటించారు. పరిశ్రమ నిపుణులు వారికి డేటా సమగ్రత, సిస్టమ్ అనుకూలత, నాణ్యత నిర్వహణ వ్యవస్థల గురించి వివరించారు. పారిశ్రామిక ప్రమాణాలు, ఉత్తమ పద్ధతులపై వారికి అవగాహన కల్పించారు. విశ్లేషణాత్మక పద్ధతి అభివృద్ధి, ధ్రువీకరణ, నాణ్యత నియంత్రణ, నియంత్రణలపై విద్యార్థులు లోతైన అవగాహనను ఏర్పరచుకున్నారు.ఈ సందర్శన తరగతి గది అభ్యాసాన్ని వాస్తవ-ప్రపంచ అనువర్తనాలతో సమర్థవంతంగా



అనుసంధానించడమే గాక గీతం యొక్క ఫలిత-ఆధారిత విద్య (ఓబీఈ) ఫ్రేమ్ వర్క్ తో అనుసంధానించి, పరిశ్రమ-విద్యా సహకారాన్ని బలోపేతం చేసింది. ఇంత మంచి పర్యటనను ఏర్పాటు చేసినందుకు స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. శివకుమార్, అధ్యాపకులు డాక్టర్ బి.దుర్గాప్రసాద్, డాక్టర్ పి.ప్రతీక్, డాక్టర్ సి.బప్పాదిత్య, డాక్టర్ గటాడి శ్రీకాంత్, డాక్టర్ ప్రియాసింగ్ లకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## జిల్లా రిజిస్ట్రార్ గా శగుఫ్తా ఫిర్దోస్
### శుభాకాంక్షలు తెలిపిన యునైటెడ్ టీం.రాష్ట్ర అధ్యక్షులు నిస్సార్ అహ్మద్.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా,అక్టోబర్ 14 (భారత శక్తి) :టిజిపిఎస్ సి గ్రూప్ %-×% సర్వీసెస్ లో డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్గా మంగళవారం శగుఫ్తా ఫిర్దోస్ ఎంపికయ్యారు.ఈ సందర్భంగా యునైటెడ్ టీం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు షేక్ నిసార్ అహ్మద్ హర్షం వ్యక్తం చేసి,శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మీ విజయం కృషి, ప్రతిభ, శక్తివంతమైన స్ఫూర్తికి అద్దం పడుతున్నట్లు నిలుస్తుందన్నారు. ఈ గొప్ప సాధనతో మీరు మైనారిటీ ఉద్యోగుల సమాజానికి గర్వకారణమయ్యారని,మీ ప్రయాణం ఎందరికో మార్గదర్శకంగా నిలవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో యునైటెడ్ టీమ్ బషీర్ హుస్సేన్,



మొహమ్మద్ జావీద్, ఆయేషా ముంతాజ్, షారుఖ్ ఖాన్, ముజీబ్ అయ్యూబ్, ఎహ్తెశాం ఉల్ హక్ సామాజిక కార్యకర్తలు, తదితర సభ్యులు పాల్గొన్నారు.

## ఎన్నికలు జరిగితే... ఎవ్వరికి ఛాన్స్...

హైదరాబాద్, అక్టోబరు 14,)ళ్ల తర్వాత అధికారంలోకి వచ్చింది. అధికారంలోకి వచ్చి 22 నెలలు అయింది. అయితే గత బీఆర్ఎస్ పాలనతో పోలిస్తే.. కాంగ్రెస్ పాలనలో కొత్తదనం కనిపించడం లేదు. హామీలు చాలా వరకు పెండింగ్లో ఉన్నాయి. పంచాయతీ ఎన్నికలు నిర్వహించడానికి కూడా అధికార కాంగ్రెస్ భయపడుతుందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి తరుణంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. సిట్టింగ్ సీటు నిలబెట్టుకోవాలని బీఆర్ఎస్ చూస్తోంది. గెలిచి కాంగ్రెస్పై వ్యతిరేకత లేదని నిరూపించుకోవాలని అధికార పార్టీ ప్రయత్నిస్తోంది. తమ ఖాతాలో వేసుకోవాలని కమలనాథులు పావులు కదుపుతున్నారు. ఈ క్రమంలో తెలంగాణ, ముఖ్యంగా జూబ్లీహిల్స్ ప్రజల నాడి భిన్నందగా ఉంది,జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయన్న ప్రచారం నేపథ్యంలో రాష్ట్ర రాజకీయ పరిణామాలు మళ్లీ వేడెక్కుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజా ప్రజాభిప్రాయం ప్రకారం తెలంగాణలో ఇప్పుడే ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్ పార్టీ సుమారు 85 స్థానాలు గెలుచుకునే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ అంచనాలు ముఖ్యంగా పట్టణాల్లోనూ, గ్రామీణ ప్రాంతాల్లోనూ కనిపిస్తున్న మూడ్ను ప్రతిబింబిస్తున్నాయి.జూబ్లీహిల్స్ వంటి ప్రాధాన్య ప్రాంతాల్లోని ఓటర్లు స్పష్టంగా చెబుతున్నది "కేసీఆర్ పాలనలో కనిపించిన అభివృద్ధి స్థాయిలను ప్రస్తుత ప్రభుత్వం చేరుకోలేకపోతోంది."

రోడ్ల విస్తరణ, కాలువ వ్యవస్థ, స్మార్ట్లైటింగ్ వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధి పని దిశలో స్థానికంగా మాగంటి గోపీనాథ్ పేరు వినిపిస్తోంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం శ్రద్ధ పెట్టకపోవడం వల్ల ఈ ప్రాంతంలో కాంగ్రెస్పై నిరుత్సాహం పెరుగుతోందని పౌరులు పేర్కొంటున్నారు.ప్రజల అభిప్రాయాల ప్రకారం కేసీఆర్ పాలన పద్ధతి స్థిరత్వం, ప్రణాళికాబద్ధతకు కేరాఫ్గా ఉండగా, రేవంత్ వైఖరి ఎక్కువగా ప్రతిస్పందనాత్మకంగా, ప్రచారాధారితమైందని భావిస్తున్నారు. పథకాల నిరంతరత, బహుళ కార్యక్రమాల రూపకల్పన, శక్తివంతమైన బ్యూరోక్రసీ నియంత్రణ వంటి అంశాలలో కేసీఆర్ రికార్డు గుర్తు చేస్తున్నారు. కొత్త ప్రభుత్వంపై ఆశలు ఉన్నప్పటికీ, నిర్ణయాలు ఆలస్యం అవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.2023లో కేసీఆర్ ఇచ్చిన హామీలను మించి అమలుచేస్తామని పార్టీ వర్గాలు ప్రకటించడం గ్రామీణ ప్రజల్లో విశ్వాసం కలిగించింది. రైతు బంధు, దళిత బంధు, మిషన్ భగీరథ వంటి కార్యక్రమాలు ఇంకా గుర్తుండే స్థాయిలో ఉన్నాయి. ఇక కాంగ్రెస్ 2023 ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ పాలను మించి పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామీణ ఓటర్లు కాంగ్రెస్ను విశ్వసించారు.

## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా తీర్చిదిద్దాలి: హనుమకొండ జిల్లా కలెక్టర్

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)అక్టోబర్14:
లినడికుడ మండలం రాయపర్తి లోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను సందర్శించిన జిల్లా కలెక్టర్లి
ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచి, ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ సూచించారు.

మంగళవారం హనుమకొండ జిల్లా నడికుడ మండలం రాయపర్తి లోని ప్రభుత్వ ఉన్నత , ప్రాథమిక పాఠశాలలు, రెండు అంగన్వాడీ కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు.

ఈ సందర్భంగా ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. పాఠ్యాంశాలకు సంబంధించి విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి అభ్యసన స్థాయిలను పరీక్షించారు. పాఠశాలల్లో అమలు చేస్తున్న కార్యక్రమాల గురించి ఉపాధ్యాయులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. లెర్నింగ్ ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రాం అమలు తీరు గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం గురించి కలెక్టర్ అడిగి తెలుసుకుని వంట గదులను పరిశీలించి మెనూ గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రగతిని మరింత మెరుగుపరచాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని



ఆదేశించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఉన్న రెండు అంగన్వాడి కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. అంగన్వాడి కేంద్రాలలో చిన్నారులకు అందిస్తున్న మెనూ చార్ట్ ను జిల్లా కలెక్టర్ అంగన్వాడీ టీచర్లను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు అందిస్తున్న కార్యక్రమాలను గురించి ఆరా తీశారు. అంగన్వాడి కేంద్రాలలోని వంట గదులను కలెక్టర్ పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, తహసీల్దార్ రాణి, మండల విద్యాశాఖ అధికారి హనుమంతరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల స్వామి, భరత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## డిసిసి అధ్యక్ష పదవి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డికి ఇవ్వాలి

**ఏఐసీసీ పరిశీలకులు శ్రీనివాస్ కు యువజన కాంగ్రెస్ వినతి**

కరీంనగర్, అక్టోబర్ 14 (భారతశక్తి):



కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవిని ప్రముఖ విద్యావేత్త, కార్యకర్తలకు భరోసా అల్ఫోర్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డికి అవకాశం ఇవ్వాలని ఏఐసిసి పరిశీలకులు, కర్ణాటక రాష్ట్ర హంగళ్ ఎమ్మెల్యే శ్రీనివాస్ మనెకు జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కిమ్ ఫహద్ మంగళవారం డిసిసి కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పహద్ మాట్లాడుతూ నరేందర్ రెడ్డికి కరీంనగర్ లోని వివిధ విభాగాల కార్యకర్తలతో అవినాభావ, సన్నిహిత సంబంధాలు ఉన్నాయని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో చేరినప్పటి నుండి నరేందర్ రెడ్డి పార్టీకి అంకితభావంతో పని చేస్తున్నారని, పార్టీ సూచనల ప్రకారంమే పాల్గొనడమే జరుగుతుందన్నారు. పార్టీలకి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారని, బడకు బలహీన వెనుకబడిన వర్గాలకు సైతం చేయుతనిస్తున్నారని, కార్యకర్తలకు భరోసా ఇస్తున్నానడానికి ఎటువంటి సందేహం లేదన్నారు. కరీంనగర్ జిల్లాలోని వివిధ వర్గాల ప్రజలతో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బిసి, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సంబంధాలను ఉన్నాయని చెప్పారు. అదే విధంగా పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలలో స్వల్ప ఓట్లతో ఓటమి పాలైనప్పటికీ ప్రజల మధ్యనే ఉంటూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లడానికి చొరవ తీసుకుంటున్నారని వారు తెలిపారు. ప్రజాభిమానం చూరగొన్న నరేందర్ రెడ్డికి డిసిసి అధ్యక్ష పదవి ఇవ్వడం వలన కరీంనగర్ జిల్లాలో రానున్నటువంటి ఎన్నికలలో విజయఢంకా మోగించడం ఖచ్చితమని తెలిపారు. నరేందర్ రెడ్డి పదవి ఇచ్చినట్లయితే మేమందరం అంకితభావంతో కృషిచేసి కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను గడపగడపకు తలిపి కాంగ్రెస్ పార్టీకి పునర్ వైభవం తీసుకురావడానికి కలిసి పని చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎండి అజీమ్, నాయకులు రాచర్ల శ్రీనివాస్, నయీముద్దీన్, ఆసిఫ్, సిద్ధూ, రవి, శ్రీకాంత్,అనిల్, రవితేజ, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

**-విద్యార్థుల ప్రవర్తనను నిత్యం గమనించాలి**

**-జిల్లా కలెక్టర్, సిపి**




కరీంనగర్, అక్టోబర్ 14 (భారతశక్తి):
యువత, విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసే మత్తు పదార్థాల నిర్మూలనకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చి దిద్దాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో పోలీస్, ఎక్సైజ్ శాఖ, శిశు సంక్షేమ శాఖ, వైద్య, తదితర శాఖల అధికారులతో జిల్లాస్థాయి నార్కో కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు మత్తు పదార్థాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై పాఠశాలలు, కళాశాలల్లో, బహిరంగ ప్రదేశాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. పోలీస్, ఎక్సైజ్, విద్యాధికారులు కలిసి రోడ్ల పక్కన పాఠశాలలు, పాన్ షాపుల్లో తనిఖీలు చేయాలని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రవర్తనను నిత్యం గమనించాలని ఉపాధ్యాయులు , తల్లిదండ్రులకు సూచించారు. అవగాహన కార్యక్రమాల్లో విద్యార్థులను భాగస్వాములను చేస్తూ మత్తు పదార్థాలతో కలిగే దుష్పరిణామాలపై ఉపన్యాసం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించాలని పేర్కొన్నారు. కరీంనగర్ సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ మత్తు పదార్థాల నిర్మూలనకు నిత్యం గస్తీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రభుత్వ, ప్రైవేటు హాస్టళ్ళు, ఆర్టీసీ కార్గో, ప్రైవేట్ పార్సిల్ సంస్థలతోపాటు ఆన్లైన్ సంస్థలకు సంబంధించి గోదాములను తనిఖీ చేస్తున్నట్లు వివరించారు. డ్రగ్ డిడక్షన్ కిట్లు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల కేసులను వివరించారు. మాదక ద్రవ్యాలు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అనంతరం నశా ముక్త భారత్ అభియాన్ క్యూ ఆర్ కోడ్ పోస్టర్ ఆవిష్కరించారు. నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రమేష్ బాబు, డీడబ్ల్యూఓ సరస్వతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పల్వంచ జడ్పిహెచ్ఎస్ హై స్కూల్లో ఇంటర్నేషనల్ గర్ల్ చైల్డ్ డే నిర్వహణ

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 14: మంగళవారం మహిళా శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా సాధికారత కేంద్రం వారి ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ గర్ల్ చైల్డ్ డే ను పాల్వంచ జడ్పీహెచ్ఎస్ స్కూల్లో నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా బాలిక పేరు మీద వచ్చిన ముఖ్య అతిథులు ఒక్కొక్క మొక్కను నాటడం జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ టి. నాగరాణి మేడం మాట్లాడుతూ, బాలికలకు ఉన్న హక్కులు చట్టాలను గురించి వివరించడం జరిగినది. అదే విధంగా న్యాయ పరంగ ఉన్న ఏ అనుమానలు వారు తిరుస్తాం అని చెప్పడము జరిగినది. ట్రైని డిప్యూటీ కలెక్టర్ రవితేజ మాట్లాడుతూ, బాల బాలికల మధ్య జెండర్ ఈక్వాలిటీ సంబంధించి అవగాహన ఇవ్వాలని ఆడ పిల్లలను అన్ని రంగాలలో సమాన అవకాశాలు ఉండాలని అన్నారు. జిల్లా మహిళా సంక్షేమ అధికారి మాట్లాడుతూ, బాలికలు ఉన్నత చదువులతో పాటు భయం లేకుండా ఉన్నత శికరాలు అధిరోహించాలని కల్పన చావ్లా, సునీత విలియమ్స్ లాంటి ఎంతో మంది అంతరిక్ష ప్రయాణం వరకు సాగాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో బాగంగా జిల్లా మహిల సాదికరత



కేంద్రము వారు బేటీ బచావో, బేటీ పడావో పథకము లో బాగంగా విద్యార్థులకు స్యానిటరి ప్యాడ్ లు ముఖ్య అథితుల చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఋతు స్రావం సంబంధించిన అంశాలు విధ్యార్థులకు సూచించారు. అనంతరము ఇంటర్నేషనల్ గర్ల్ చైల్డ్ డే ను పురస్కరించుకొని నిర్వహించిన గేమ్స్ లో విజేతలకు బహుమతులు అందించి , బృన హత్యలకు వ్యతిరేకం అనే పోస్టర్ ఆవిష్కరణ జరిగినది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఎంఈఓ, ముఖ్య అతిథులుగా దోమకొండ సి డి పి ఓ రోచిశ్మ పాల్వంచ ఎమ్ ఆర్ ఓ హిమ బిందు, యం పి డి ఓ శ్రీనివాస్ మండల ప్రత్యేక అధికారి శ్రీపతి, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది, సఖి బాల రక్ష భవన్ సిబ్బంది, జిల్లా న్యాయ సేవ సమితి సిబ్బంది, పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు మొదలగు వారు పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్రాల్లో పోషణ మాసం కార్యక్రమం



సూర్యాపేట,భారత శక్తి ప్రతినిధి,అక్టోబర్ 14:చంటి పిల్లలు,గర్భిణీ స్త్రీలు, బాలింతలు,అంగన్వాడీలో ఇస్తున్న పోషక విలువలతో కూడిన పదార్థాలను తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని సిడిపిఓ సుబ్బలక్ష్మి తెలిపారు.సూర్యాపేట జిల్లా సూర్యాపేట మండల పరిధి యండ్లపల్లి సెక్టార్ లో సోమవారం పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సీడీపీఓ సుబ్బలక్ష్మి,సూపెర్వైజర్ జ్యోతి, పాల్గొని పలు సూచనలు చేశారు. పలువురు అంగన్వాడీ టీచర్స్ పాల్గొని తల్లులకు పోషక ఆహారం పై అవగాహన కల్పించారు.

# సూర్యాపేట టపాసులు మొగట్లేదు

-దసరాలో మోసపోయాం అంటున్న యువత



సూర్యాపేట,భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 14:
సూర్యాపేట జిల్లా కేంద్రంలో విక్రయిస్తున్న టపాసులు సరిగా మోగట్లేదని ఇటీవల దసరా పండుగ లో కొనుగోలు చేసిన యువత మోసపోయామని వాపోతున్నారు.వేళల్లో డబ్బులు ఖర్చు అవుతున్నాయి గానీ అవి అనుకున్నంత శబ్దం రాకపోవడంతో నిరుత్సాహ పడుతున్నామని అంటున్నారు. సూర్యాపేట హోల్సేల్ వ్యాపారస్తులు కొందరు హైదరాబాద్ విజయవాడ లాంటి మహానగరాలలో నుండి పెద్ద మొత్తంలో శబ్దం రాణి టపాసులను తక్కువ ధరకు తెచ్చి సూర్యాపేట లో అడ్డు అదుపు లేని ధరలు నిర్ణయించి ఇష్టానుసారంగా తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారని ఆరోపణలు వినపడుతున్నాయి. ఇలాంటి పరిస్థితులు గతంలో ఎన్నోసార్లు యువతకు ఎదురైనప్పటికీ ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక మౌనంగా ఉన్నారు కాగా ప్రస్తుతం మీడియా ముఖంగా వారు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి ఇటువంటి వారికి లైసెన్సులు ఇవ్వకూడదని కోరుతున్నారు. ఎక్స్పైరీ అయిన టపాసులలో కావాల్సినంత పేలుడు పదార్థాలు ఉండకపోవడం మెత్తబడిపోవడం రకరకాల కారణాలవల్ల అవి శబ్దం రాకపోవచ్చు.అటువంటివి దీపాలి పండుగలో జరగకుండా చూడాలని యువత కోరుతున్నారు.

# "ఆరోగ్య మహిళ" పరీక్షలు సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



కరీంనగర్, అక్టోబర్ 14 (భారతశక్తి):
జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో ఆరోగ్య మహిళ కార్యక్రమం ద్వారా నిర్వహిస్తున్న ఉచిత వైద్య పరీక్షలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. మంగళవారం నగరంలోని సప్తగిరి కాలనీ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆరోగ్య మహిళ పరీక్షలు చేయించుకుంటున్న మహిళలతో మాట్లాడి ఉచిత పరీక్షల గురించి మరింత మందికి తెలియజేయాలన్నారు.
ఆరోగ్య మహిళ పరీక్షల రికార్డు పరిశీలించారు. రక్తపోటు, షుగర్ వ్యాధిగ్రస్తుల వివరాలను పక్కాగా నమోదు చేసి వారికి ప్రతి నెలా మందులు అందజేయాలనీ అన్నారు.
ప్రయివేటు స్టోర్స్ లభించే అన్ని మందులు ప్రభుత్వ ఆసుపత్రి లో ఉచితంగా అందజేస్తారనే విషయం ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.ఆరోగ్య మహిళ హెల్త్ క్యాంపులలో రీస్క్రీనింగ్ పూర్తి చేయాలన్నారు. గర్భిణీలకు సిజేరియన్ కాన్పు వల్ల కలిగే సమస్యలను వివరించి సాధారణ డెలివరీలకు ప్రోత్సహించాలన్నారు. గర్భిణీలకు క్రమం తప్పకుండా బరువు తూస్తూ హిమోగ్లోబిన్ పరీక్ష చేయాలన్నారు. హెచ్ బి తక్కువ ఉన్న మహిళలకు ఐరన్ మాత్రలు అందజేయడంతో పాటు పోషకాహారం సూచించాలని తెలిపారు. అనంతరం ఆరోగ్య మహిళ పరీక్షల్లో భాగంగా ఈ ఆరోగ్య కేంద్రం ఆవరణలో ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొబైల్ వాహనంలో 2డి ఎకో, ఎక్సరే, మమ్మోగ్రఫీ పరీక్షల తీరును కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్య శాఖ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సనా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర 4వ మహాసభలు నవంబర్ 25న ప్రారంభం: టిఎంకేఎంకేఎస్ రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ



కరీంనగర్, అక్టోబర్ 14(భారత శక్తి):
మత్స్య వృత్తి రక్షణ మత్స్యకారుల సంక్షేమం సామాజిక భద్రత ఆశయంగా గత 25 సంవత్సరాల నుండి రాజీలేని పోరాటాల నిర్వహిస్తున్నమని తెలంగాణ మత్స్యకారులు మత్స్య కార్మిక రాష్ట్ర కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ తెలిపారు. మంగళవారం కరీంనగర్ లోనీ కోతిరాంపూర్ ముకుందలాల్ మిశ్రాభవన్ జిల్లా కమిటీ సమావేశం పిట్టల వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ నవంబర్ 25, 26,27 తేదీలలో కరీంనగర్ లో రాష్ట్ర మత్స్య కార్మిక సంఘం మహాసభలు నిర్వహిస్తున్నామని, కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. మహాసభలకు రాష్ట్రవ్యాప్తంగా 500 మంది ప్రతినిధులు పాల్గొంటారని, మత్స్య పరిశ్రమ అభివృద్ధి, సంక్షేమంపై భవిష్యత్తు ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.122 కోట్ల నిధులతో పంపిణీ చేయబోయే చేప, రొయ్య పిల్లల పంపిణీలో అవినీతి అవకతవకలు లేకుండా మత్స్య సోసైటిలు, మత్స్యకార పాలకవర్గాలు, మత్స్యకార సంఘాల నాయకుల సమక్షంలో పంపిణీ చేయాలన్నారు. మత్స్యకార సొసైటీకి 10 లక్షలు, ప్రతి మార్కెటింగ్ కో-ఆపరేటివ్ సొసైటీకి, మహిళా మత్స్య సొసైటీకి 5లక్షల రూపాయల చొప్పున ఆర్థిక సహకారం అందించాలని కోరారు. మత్స్యకారుడు, మహిళా మరణిస్తే తక్షణ ఆర్థిక సహాయం వారం రోజుల్లో లక్ష రూపాయలు అందజేయాలన్నారు. శిథిలావస్థస్థితిలో ఉంటు కబ్జాలకు గురవుతున్న ప్రభుత్వ చేప పిల్లల విత్తన క్షేత్రాలకు 100 కోట్ల రూపాయలు కేటాయించి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. సాటిలైట్ ద్వారా సర్వేలు చేయించి కంపచెట్లు తొలగించి పుడికలు తీయించి ఫెన్సింగ్ వేయాలనీ, కబ్జాలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఫిష్ ఫుడ్ కోర్టులు స్టాల్స్ ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలనీ, గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చెరువులు కుంటలు జలవనరులలో ఉన్న గుర్రపుడెక్క ఆకు, కంపచెట్లను తొలగించాలన్నారు. మత్స్య సహకార సంఘాల పరిధిలో ఉన్న జల వనరులు,చెరువు, కుంటలల్లో ప్రకృతి వైపరీత్యాలతో చేపలు చనిపోతే ఇన్సూరెన్స్ , ఎక్స్గ్రేషియా అమలు చేసి నష్ట పరిహారం చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు పిట్టల వెంకటేష్, ప్రధాన కార్యదర్శి జునగరి గణేష్, జిల్లా కోశాధికారి పప్పు సదానందం, జిల్లా ఉపాధ్యక్షులు నాగుల అరుణ, కార్యదర్శి, నునే శేకర్, మర్రి శశికళ, జిల్లా నాయకులు గణవేని లచ్చన్న, జంకుటి రాణి, ఎర్రవెల్లి మానస, కంటే లత, ఉప్పుల చింతామ చింతామణి, గోస్కుల కనక లక్ష్మీ ఘనవేని రాము పిట్టల ఎల్లయ్య ఏర్రవేని యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# కష్టపడ్డ వారికే పదవులు

## పకడ్బందిగా కరీంనగర్ డిసిసి ఎన్నిక

పార్టీలో సమన్వయకర్తకే అవకాశాలు
ఏఐసీసీ పరిశీలకులు, ఎమ్మెల్యే శ్రీనివాస్



కరీంనగర్, అక్టోబర్ 14 (భారతశక్తి):
జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష నియామక ప్రక్రియలో కార్యకర్తల ప్రజాభిప్రాయ సేకరణ కీలకమైనదనీ ఏఐసీసీ పరిశీలకులు, ఎమ్మెల్యే శ్రీనివాస్ మనే ప్రకటించారు. పార్టీకి, ప్రజలకు సమన్వయకర్తగా పనిచేసే అర్హత కోణంతోపాటు, పార్టీని సంస్థాగతంగా కష్టపడుతూ నడిపించే వారికి పదవులు వరిస్తాయని స్పష్టం చేశారు.మంగళవారం పద్మనగర్ లోని డిసిసి కార్యాలయం లో టీపీసీసీ ఉపాధ్యక్షులు ఆత్రం సుగుణ, చిట్ల సత్యనారాయణ, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ లతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పరిశీలకులు శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి ఎన్నిక పకడ్బందీగా నూతన ఒరవడితో జరుగుతుందని చెప్పారు. దేశం మొత్తంలో కాంగ్రెస్ పార్టీ నూతన ఒరవడిని సృష్టించిందనీ జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకత్వం వరకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుని నామినేటెడ్ పద్ధతిన నియమించకుండా క్షేత్రస్థాయిలో బ్లాక్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాలు విభాగాల అధ్యక్షులు, పార్టీ కార్యకర్తల అభిప్రాయ సేకరణ తర్వాతే ఎన్నిక జరుగుతుందని చెప్పారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షునిగా నియమిస్తే ప్రజలకు, ప్రజాపాలనలో భాగస్వాములై సమన్వయకర్తగా పనిచేయగలుగుతారో వారికే అవకాశం దక్కుతుందన్నారు. అలాంటి వారికోసం పార్టీ నూతన పద్ధతికి శ్రీకారం చుట్టిందనీ పిలునిచ్చారు. ఈ నియామక ప్రక్రియ ఐదు రాష్ట్రాలలో విజయవంతం అయిందనీ, ఆరో రాష్ట్రంగా తెలంగాణలో ప్రారంభించడం జరిగిందనీ చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా 22 మంది ఏఐసీసీ, పిసిసి పరిశీలకులతోపాటు దేశం మొత్తంలో కాంగ్రెస్ పార్టీ నూతన ఒరవడిని సృష్టించిందన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఆశిస్తూ ఎవరైనా దరఖాస్తు చేసుకునే అవకాశం ఇంకా కొనసాగుతుందని, ప్రజా అభిప్రాయ సేకరణ ముగిసిన తర్వాత ఆ నివేదికను పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్ గాంధీలకు అందజేయడం జరుగుతుందని చెప్పారు. ఇప్పటివరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష స్థానానికి దరఖాస్తుల స్వీకరణ చేపట్టగా మొదటి రోజు 32 మంది చేసుకున్నారని చెప్పారు. నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష స్థానానికి 22 మంది చేసుకున్నారని వివరించారు. ఆశావహులు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ సత్తు మల్లేశం, నాయకులు వెలిచాల రాజేందర్ రావు, అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, కర్ర సత్య ప్రసన్న రెడ్డి, బొమ్మ ఈశ్వర్ లు పాల్గొన్నారు.

# వేములవాడ రాజన్న కోడెల పంపిణీ: కలెక్టర్ ఎం. హరిత.



వేములవాడ, అక్టోబర్ 14 (భారత శక్తి ): ఈ నెల 17వ తేదీన వేములవాడ తిప్పాపూర్ లోని గోశాలలో కోడెలను పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.హరిత ఒక ప్రకటనలో తెలిపారు. వేములవాడ తిప్పాపూర్ గోశాలలోని 200 కోడెల జతలను శుక్రవారం పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లా రైతులు అర్హులని స్పష్టం చేశారు.కోడెల కోసం అర్హత కలిగిన రైతులు జిల్లా : వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.అర్హులైన రైతులు పట్టాదారు పాస్ బుక్ ఆధార్ కార్డ్ మొదలగు సంబంధిత ధ్రువ పత్రాలతో ఈ ఎ ా బ ా ై స ట ్ %ఫ్త్రజూం://ఖ్రుయిఖఅఖుంఅతీఎఅశ్రీశ్రీఖ్.వశ్రీఖఅస్త్రుఖు.ప్రశీజ.అఅ %/ లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.కోడెలు పంపిణీ చేసే రోజున రైతులు ఆన్లైన్లో నమోదు చేసిన ఆయా సర్టిఫికెట్లు పత్రాలు వెంట తీసుకురావాలని తెలిపారు. అర్హులైన రైతులకు మాత్రమే జియో ట్యాగింగ్ కలిగి ఉన్న కోడెలను పంపిణీ చేయనున్నామని స్పష్టం చేశారు.గురువారం ఉదయం వరకూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గతంలో ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకుని కోడెలు తీసుకు వెళ్లని వారు పత్రాలతో రావాలని కలెక్టర్ తెలిపారు.జియో ట్యాగింగ్ ఉన్న కోడెలు, వెబ్సైట్ లో రైతుల వివరాలు నమోదు చేయడంతో జీవాలు పక్కదారి పట్టే అవకాశం ఉండదని, భవిష్యత్తులో వాటి సంరక్షణను పరిశీలించవచ్చని స్పష్టం చేశారు.కోడెలను పక్కదారి పట్టిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. కోడెలను తీసుకువెళ్లే రైతులు వాటి సంరక్షణ బాధ్యతను సక్రమంగా పక్కాగా చూసుకోవాలని సూచించారు.

# విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు.

హాజరైన కలెక్టర్ ఎం. హరిత.



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 14 (భారత శక్తి) : బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు.బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం పై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి,ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు, సంక్షేమ శాఖ మంత్రివర్యులు లక్ష్మణ్ కుమార్ , ఇతర ఉన్నతాధికారులతో కలిసి మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించగా, జిల్లా కలెక్టర్ ఎం. హరిత హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద ప్రైవేటు పాఠశాల యాజమాన్యం వారి బడులలో చదివే విద్యార్థులను ఎటువంటి ఇబ్బందులకు గురి చేయడానికి వీలు లేదని స్పష్టం చేశారు. విద్యార్థులకు సంబంధించిన ఫీజు ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. కలెక్టర్లు వెంటనే బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ యాజమాన్యులతో సమావేశమై విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.సామాజిక బాధ్యతగా భావించి విద్యా రంగం పై ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు రావాల్సిన బకాయిలు ప్రభుత్వం క్రమ పద్ధతిలో విడుదల చేస్తుందని స్పష్టం చేశారు. అనంతరం సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ కలెక్టర్లు జిల్లా విద్యాశాఖ అధికారులు, సంబంధిత అధికారులు సమన్వయం చేసుకుంటూ పాఠశాల యాజమాన్యులతో చర్చించి విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.
తదనాంతరం కలెక్టర్ ఎం. హరిత మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ 7 ఉండగా, 338 మంది చదువుతున్నారని, అలాగే ఎస్టీ విద్యార్థులకు ఒక స్కూల్ ఉండగా 35 మంది విద్యార్థులు చదువుతున్నారని కలెక్టర్ ఎం. హరిత తెలిపారు. ఆయా విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా ఇంచార్జి విద్యాధికారి వినోద్ కుమార్, డీఎస్ సీడీఓ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పారమితలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఇన్వెస్టిచర్ వేడుకలు



కరీంనగర్, అక్టోబర్ 14(భారతశక్తి):
పారమిత ఉన్నత పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఇన్వెస్టిచర్ వేడుకలను పాఠశా ల ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్ ఘనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ అనేది ప్రపంచంలోనే అతి పెద్ద సేవా సంస్థ అని సమాజ సేవ కొరకు సిద్ధంగా ఉంటాము అనే నినాదంతో ప్రజలకు సేవ చేస్తుందన్నారు. ప్రతీ విద్యార్థి ఈ కార్యక్రమంలో పాల్గొని 4 సంవత్సరాల శిక్షణ తీసుకుని గవర్నర్, రాష్ట్రపతి అవార్డులు పొంది క్రమశిక్షణ విలువలతో కూడిన జీవితాన్ని గడుపుతూ దేశసేవ చేయాలని ఆయన తెలిపారు. అనంతరం పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు డైరెక్టర్లు ప్రసూన, అనుకర్ రావు, వినోద రావు లు నూతనంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ లో చేరిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పారమిత ఉపాధ్యాయులు బాలాజీ కవిత, సమన్వయకర్తలు,గైడ్ కెప్టెన్ రజిత, స్కౌట్స్ మాస్టర్ జిలాని లు పాల్గొన్నారు.

# లక్ష్మీ నాయుడు మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి : రాష్ట్రకాపు జేపీసీ అధ్యక్షులు చందు జనార్దన్

విజయ వాడ,అక్టోబర్ 14(భారత శక్తి):
లక్ష్మీ నాయుడు హత్య ను రాష్ట్ర కాపు జే ఏ సి తీవ్రం గా ఖండించింది. విజయవాడ ప్రెస్ క్లబ్ లో రాష్ట్ర కాపు జే ఏ సి ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో జే ఏ సీ అధ్యక్షుడు చందు జనార్దన్



మాట్లాడుతూ లక్ష్మీ నాయుడి హత్య పై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు.లక్ష్మి నాయుడు హత్య బలిజ కాపు వర్గాలపై జరిపిన దాడిగా భావిస్తున్నామని,హత్య అనంతరం జరిగిన పరిణామాలు ఆవిధానాన్ని సూచిస్తున్నాయని చందు జనార్దన్ అవేదన వ్యక్తం చేశారు.బలిజ కుటుంబాన్ని హత మార్చే ప్రయత్నం వెనుక అన్నిరకాల వనరులను సమకూర్చినవారిని ,ప్రోత్సహించినేవారిని,హత్యా స్థలం లో స్వైర విహారం చేసి ప్రోత్సహించారని వదంతులు ఉన్న నేపద్యం లో కుట్ర దారులపై చట్ట రీత్యా చర్యలు తీసుకొని అరెస్ట్ చేయాలని నాయకత్వం డిమాండ్ చేసింది.లక్ష్మీ నాయుడి హత్య అనంతరం నిందితుల అరెస్ట్ నేపద్యం,వారికి లభించిన అండ దండలు,రాష్ట్ర,జిల్లా,నియోజక వర్గ స్థాయి సామాజిక వర్గ నేతలు జోక్యం పై ప్రభుత్వం నివేదిక తెప్పించుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.లక్ష్మీ నాయుడు కుటుంబాన్ని పరామర్శించి సంఘటన వివరాలను తెలుసుకొనేందుకు రాష్ట్ర కాపు జే ఏ సీ బృందం ప్రకాశం జిల్లా కాపు సంఘ నాయకులు కొక్కిరాల సంజీవ్ కుమార్ తో కలసి పర్యటించిందని ఈ సందర్భం గా లక్ష్మీ నాయుడు భార్య సుజాత ధరకాని పాడు లో దారుణా ల విషయాలు చెప్తూ రోదించారని రాష్ట్ర కాపు జే ఏ సి అధ్యక్షులు చందు జనార్ధన్ తెలిపారు.తన భర్త హత్యకు ముందు కూడా తనను కొన్నిరోజులుగా నిందితులువేధించారని బెదిరించారని ,తన భర్త ను చంపుతానని,కుటుంబాన్ని హతమారుస్తామని అనేకమార్లు బెదిరించారని నిందితుల నుండి కుటుంబం మొత్తానికి ప్రాణహాని ఉందని కాపాడాలని సుజాత రోదించిందని తెలిపారు. లక్ష్మీనాయుడు,వారి కుటుంబం ఎదుర్కొన్న ఇబ్బందులను గ్రామ బలిజ పెద్దలు వివరించారని తెలిపారు హత్యాకాండలో కోమా లోకి వెళ్లిన లక్ష్మీ నాయుడు సోదరులు తిరుమలశెట్టి పవన్,భార్గవ్ లు గుంటూరు లో ఉదయ హాస్పిటల్ లో వైద్యం జరుగుతుందని వారి పరిస్థితి దయనీయంగా గాయాలతో ఉన్నారని వారికి ప్రాణ హాని ఉందని కుటుంబ సభ్యులు వాపోయారని తెలిపారు.కూటమి ప్రభుత్వం,పెద్దలు చంద్రబాబు నాయుడు గారు,పవన్ కళ్యాణ్గారు,నారాలోకేష్ గారు లక్ష్మీ నాయుడు హత్య పై జరిగిన దమనకాండ పై పూర్తి గా విచారణ జరిపి నివేదిక తెప్పించి కుట్ర దారులపై చర్యలు తీసుకోవాలని చందు జనార్ధన్ కోరారు.
రాయలసేన ఈశ్వర్ ,భావనారాయణ హత్య కాండను ఖండించి మాట్లాడారు.అల్లుడు సాంబశివరావు,రాజనాల బాబ్జీ.తోట సాంబశివరావు, అల్లం రాజేష్,పులిగడ్డ సత్యనారాయణ,కటకం ధర్మారావు,పేర్ని దామోదర్,ఓతులోలు మార్కండేయులు, కుటుంబ రావు,రంగా, లంక రాంబాబు,పేర్ని దామోదర్,అడబాల సత్యనారాయణ ,బోగి రెడ్డి శశిభూషణ్ ,రామాయణపు సాంబయ్య లు పాల్గొన్నారు.

# ఖమ్మం నగరంలో కళ్యాణ లక్ష్మీ చెక్కులు పంపిణీ

ఖమ్మం బ్యూరో, భారత శక్తి, సెప్టెంబర్ 14: స్థానిక 52 మరియు 58 వ డివిజన్ల నందు వ్యవసాయ శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ చెక్కులు



నగర మేయర్ శ్రీమతి పునుకొల్లు నీరజ , పాలనాధికారి శ్రీనివాసరావు చేతుల మీదుగా అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టూ టౌన్ ఇన్ చార్జ్ జిల్లా కాంగ్రెస్ నాయకులు శెట్టి రంగారావు, డివిజన్ నాయకులు సోమిరెడ్డి ఉపెందర్ రెడ్డి,నల్లమల్ల వేణు, కుంచెపు ఆశయ్య, గడ్డం వెంకటయ్య,బాబు సీతమ్మ,మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# మనసాక తోట

మనసు మనిషికున్న
గొప్ప వరం
మనసే ఒక పూలతోట
మనసే ఒక పూల బాట
ఆతోటలో ఆబాటలో
ఆలోచనల
పంట పండేనులే
ప్రేమ ఆప్యాయతలు
వికసించేనులే
మనప్రతికూల ఆలోచనలే
అందులోని కలుపు
మొక్కలుబి
సానుకూల అలవాట్లే
మేలిమి విత్తనాలు
క్రమశిక్షణే నీరు
మన జీవనశైలియే
ప్రధాన వనరు
మన అవసరాలను
తీర్చుకోవడానికిబి
ఏపంట
సాగుచేస్తామన్నదిబి
మన ఇష్టాన్నిబట్టి
ఉంటుంది
సహనం ఓర్పు
మార్పుతో
ఎదుగుదల.
సాధ్యమౌతదిబి
పట్టుదలేబి
పెట్టుబడి అవుతే
సంకల్పం
ఆయుధమైతె
ప్రగతి పురోగతి
ప్రవాహమై
నిలకడ
పట్టుదలబి
సానుకూలబి
ఆలోచన ధోరిణి

జీవితానికి చుక్కాని
అవుతుంది
అర్థవంతమైన
లక్ష్యాలను సాధించి
జీవిత సాఫల్యతను
సాధించాలి
మంచిని పెంచి
మంచిని పంచి
మనసున్న
మా రాజుగా నిలుద్దాం

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు
తెలంగాణ ఎకనామిక్ ఫోరం
కరీంనగర్9440245771



## బి ఎల్ టి యు రాష్ట్ర మహా సభలో, రాష్ట్ర అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎస్. సిద్దిరాములు

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 14: బి ఎల్ టి యు రాష్ట్ర మహా సభలో ఎస్.సిద్దిరాములునురాష్ట్ర అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నకార్మిక వర్గానికి హృదయ పూర్వక ధన్యవాదములు తెలియజేశారు.బీడీ రంగంలో గత 35 సంవత్సరాలుగా సుదీర్ఘ అనుభవం ఉన్న వ్యక్తిని ఎన్నుకోవడం హర్షనీయమని తెలిపారు. కార్మికులకు ఏ సమస్య వచ్చిన, వారికి ఎక్కడ కూడా తలవంచకుండా న్యాయం చేస్తున్నారు.

# పరిరక్షణ లోపమా ? లేక అవగాహన పాపమా?

- భైంసా మండల బోర్గావ్ గ్రామంలో ఆరోగ్య శాఖ నిర్లక్ష్యం

ఆంగన్‌వాడీ సెంటర్‌లో గడువు – ముగిసిన మందులు నిల్వ ప్రజల్లో ఆందోళన

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 14 (భారత శక్తి): నిర్మల్ జిల్లా భైంసా మండలం బోర్గావ్ గ్రామపంచాయతీలోని ఆంగన్‌వాడీ సెంటర్‌లో ప్రభుత్వ ఆరోగ్య సిబ్బంది ఏఎన్ఎం మరియు ఆశ వర్కర్ నిర్లక్ష్యం బయటపడింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం, ప్రజలకు ఉచితంగా అందించే ప్రభుత్వ మందులు సమయానికి వాడకపోవడంతో గడువు ముగిశాయి. అయితే, వాటిని బయో మెడికల్ – వేస్ట్ మేనేజ్మెంట్ ప్రకారము 2016 ప్రకారం సురక్షితంగా నిర్వీర్యం చేయాల్సింది పోయి, ఆ మందులను ఆంగన్‌వాడీ సెంటర్‌లోనే నిర్లక్ష్యంగా వదిలేశారు. ఆంగన్‌వాడీలో చిన్నపిల్లలు, దాని పక్కనే ఉన్న పాఠశాల విద్యార్థులు ఉన్నందున ఈ నిర్లక్ష్యం తీవ్రమైన ప్రమాదానికి దారితీయవచ్చని పలువురు హెచ్చరిస్తున్నారు. మందులను బహిరంగ ప్రదేశంలో కూడా పారబోసి వదిలేస్తున్నారు, దీని వల్ల పర్యావరణ కాలుష్యం మరియు మానవ ఆరోగ్యానికి ముప్పు ఏర్పడే అవకాశం ఉంది.

బోర్గావ్ గ్రామపంచాయతీలో పనిచేస్తున్న ఏఎన్ఎం సుజాత మరియు ఆశా వర్కర్ లావణ్య ఈ గడువు ముగిసిన మందులను సరిగా తొలగించకుండా వదిలేశారని. మీడియా ప్రతినిధులు స్థలాన్ని సందర్శించినప్పుడు, వివిధ రకాల గడువు ముగిసిన మందుల నిల్వ కనిపించాయి. విచారణలో ఆంగన్‌వాడీ టీచర్ తెలిపిన ప్రకారం “ఈ మందులను ఏఎన్ఎం మరియు ఆశా వర్కర్లు సేకరించి ఇక్కడే ఉంచారు” అని చెప్పారు.

ఈ ఘటనపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాషా అభినవ్ తక్షణమే ఈ ఘటనపై దర్యాప్తు చేయాలని, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజేందర్ మరియు డిప్యూటీ డిఎంహెచ్ఓ భైంసా డివిజన్ డాక్టర్ ఆకాష్ మరియు డ్రగ్ కంట్రోల్ శాఖ ద్వారా పూర్తి నివేదిక సిద్ధం చేయించాలని కోరారు. అలాగే మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో కూడా గడువు ముగిసిన మందుల వివరాలు, బ్యాచ్ నంబర్లు, నిల్వ పరిమాణం లాంటి వివరాలను సేకరించి నివేదిక సమర్పించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ ఆసుపత్రులలో గడువు ముగిసిన (ఎక్స్పైర్)



మందులను లేదా గోలీలను సురక్షితంగా నిర్వహించడానికి ప్రత్యేక నిబంధనలు ఉన్నాయి. క్లుప్తంగా వివరాలు ఇలా ఉన్నాయి.

1. తక్షణ వేరు చేయడం (సేగ్రిగేషన్):
గడువు ముగిసిన మందులను ఇతర ఉపయోగించే మందుల నుండి వెంటనే వేరు చేయాలి.
వాటిపై “ఎక్స్పైర్ డ్రగ్స్ నాట్ ఫర్ యూస్” అనే లేబుల్ అతికించాలి.

2. రికార్డు నిర్వహణ
గడువు ముగిసిన ప్రతి ఔషధానికి సంబంధించిన వివరాలు (పేరు, లాట్ నంబర్, పరిమాణం, గడువు తేది) రికార్డు బుక్‌లో నమోదు చేయాలి.
ఫార్మసిస్ట్ మరియు మెడికల్ ఆఫీసర్ సంతకాలు తీసుకోవాలి.

3. డిస్పోజల్ కమిటీ ఆమోదం (అప్రూవల్ ఫర్ డిస్పోసల్)
ఆసుపత్రి “డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ” ద్వారా ఆమోదం తీసుకోవాలి.
ఈ కమిటీలో సాధారణంగా మెడికల్ ఆఫీసర్, ఫార్మసిస్ట్, స్టోర్ ఇన్‌ఛార్జ్ సభ్యులుగా ఉంటారు.

4. సురక్షిత విధానం ద్వారా నిర్మూలన:–
(ఇన్సినరేషన్): హై టెంపరేచర్‌లో దహనం చేయడం ు ఇది అత్యంత సురక్షిత పద్ధతి.
డీప్ బురియల్: అవసరమైనప్పుడు, పర్యావరణ ప్రమాణాలు (బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్ 2016)
ప్రకారం లోతైన గుంతల్లో పూడ్చడం.
లిక్విడ్ డ్రగ్స్:–
వీటిని నీటి వనరులలో కాకుండా ప్రత్యేక రసాయన పద్ధతిలో నిర్వీర్యం చేయాలి.

5.( పర్యావరణ నియంత్రణ):–
పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ నియమాల ప్రకారం మందులు నిర్వీర్యం చేయాలి.
రసాయన లేదా ఔషధ వ్యర్థాలను సాధారణ చెత్తతో కలపకూడదు.

6. డాక్యుమెంటేషన్ %ు% రిపోర్ట్:
నిర్వీర్యం చేసిన తరువాత రిపోర్ట్ తయారు చేసి సంబంధిత జిల్లా అధికారి ( డి ఎం హెచ్ ఓ/డ్రగ్ ఇన్స్పెక్టర్) కి సమర్పించాలి.

సారాంశం:
గడువు ముగిసిన మందులు ు వేరు చేయాలి, రికార్డు ఉంచాలి, కమిటీ అనుమతితో ఇన్సినరేషన్ లేదా డీప్ బరియల్ ద్వారా సురక్షితంగా నిర్వీర్యం చేయాలి.
మీకు కావాలంటే, నేను దీని కోసం ఒక సంక్షిప్త అధికారిక ప్రొసీజర్ ఫార్మాట్ (ఎస్ ఓ పి) కూడా తయారు చేసి ఇవ్వగలను ు కావాలా?
ఇది ప్రభుత్వ ఆసుపత్రులలో గడువు ముగిసిన మందులు / గోలీలను నిర్వహించడానికి సంక్షిప్త అధికారిక ప్రొసీజర్ (ఎస్ ఓ పి) ు తెలుగు మరియు అవసరమైన చోట ఇంగ్లీష్ పదాలతో కలిపి:
ప్రభుత్వ ఆసుపత్రులలో గడువు ముగిసిన ఔషధాల నిర్వీర్యణకు ప్రామాణిక విధానం (ఎస్ ఓ పి)

1 ఉద్దేశ్యం:
ఆసుపత్రిలో గడువు ముగిసిన మందులను సురక్షితంగా, చట్టబద్ధంగా మరియు పర్యావరణానికి హాని కలగకుండా నిర్వీర్యం చేయడం.

2 వర్తించే పరిధి(ఎస్ ఓ పి):
ఈ విధానం అన్ని ఫార్మసీ స్టోర్లు, సెంట్రల్ మెడికల్ స్టోర్‌లు మరియు వార్డు స్టాక్ రూమ్‌లకు వర్తిస్తుంది.

3 బాధ్యత:
ఫార్మసిస్ట్ /ఇస్టోర్ ఇంచార్జ్: గడువు ముగిసిన మందులను గుర్తించడం, వేరు చేయడం.
మెడికల్ ఆఫీసర్/సూపరింటెండెంట్: డిస్పోసల్ కి ఆమోదం ఇవ్వడం.
డిస్పోసల్ కమిటీ: సక్రమ పద్ధతిలో నిర్వీర్యణ పర్యవేక్షణ.

4 విధానం :
(a) గుర్తింపు :
ప్రతి నెల ఒకసారి స్టాక్ పరిశీలన చేసి గడువు ముగిసిన మందులను గుర్తించాలి.
వాటిని “ఎక్స్పైర్–నాట్ ఫర్ యూస్” అని లేబుల్ చేయాలి.
(b) వేరు చేయడం: (సేగ్రిగేషన్)
గడువు ముగిసిన మందులను వేరు పెట్టిన బిన్ / బాక్స్‌లో నిల్వ చేయాలి.
ఇతర వినియోగించే మందులతో కలపకూడదు.
(c) రికార్డు నిర్వహణ:
ప్రత్యేక ఎక్స్పైర్ డ్రగ్ రెజిస్టర్
లో ఈ వివరాలు నమోదు చేయాలి:
డ్రగ్ పేరు. బ్యాచ్/లార్ద్ నెంబర్ క్వాలిటీ.
ఎక్స్పై డేట్.
డేట్ ఆఫ్ సేగ్రిగేషన్ఆఫీసర్ సిగ్నేచర్
(d) కమిటీ అనుమతి: డ్రగ్ డిస్పోసల్ కమిటీ
ఈ జాబితాను పరిశీలించి ఆమోదం ఇస్తుంది.
(e) నిర్వీర్యణ :సాలిడ్ డ్రగ్ : (ఇన్సినరేటర్) లో హై టెంపరేచర్ వద్ద దహనం చేయాలి.
లిక్విడ్ డ్రగ్స్ :–పర్యావరణ అనుమతి పొందిన సదుపాయంలో నిర్వీర్యం చేయాలి.
నాన్ – హజార్డస్ టాబ్లెట్/క్యాప్సూల్:–అవసరమైతే బయో మెడికల్ వేస్ట్ రూల్స్ ప్రకారం డీప్ బూరియల్:–
(f) రిపోర్టింగ్ :నిర్వీర్యం చేసిన తరువాత డిస్పోజల్ సర్టిఫికెట్ తయారు చేసి ( డి ఎం హెచ్ ఓ/డ్రగ్ ఇన్స్పెక్టర్) కు సమర్పించాలి.
రికార్డు 3 సంవత్సరాలపాటు భద్రపరచాలి.

5 సురక్షిత నియమాలు : గ్లోవ్స్, మాస్క్ వాడాలి.
నీటి వనరుల దగ్గర నిర్వీర్యం చేయకూడదు.
సాధారణ చెత్తతో కలపకూడదు.

6 సంబంధిత నిబంధనలు:
బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్ 2016. ( ఎం ఓ ఈ ఎఫ్ సి సి, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా)
డ్రగ్స్ అండ్ కాస్మేటిక్ యాక్ట్ 1940
స్టేట్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ గైడ్ లైన్

సామాజిక సంస్థలు, పర్యావరణ సంస్థలు అభిప్రాయపడ్డాయి “ప్రభుత్వం ప్రజల ఆరోగ్య రక్షణ కోసం కోట్ల రూపాయల మందులు అందిస్తుంది. వాటిని ఈ విధంగా నిర్లక్ష్యంగా వదిలేయడం తీవ్రమైన నేరం. అధికారులు తక్షణ చర్య తీసుకోకపోతే ఈ అంశాన్ని రాష్ట్ర ఆరోగ్య మరియు పర్యావరణ శాఖలకు తీసుకెళ్తామని” హెచ్చరించారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఎంతైనా ఉంది.

# చట్టసభలు ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలి

బ్రిటిష్ వారి పాలన అంతమైన తర్వాత స్వపరిపాలన కొరకు దేశ పరిస్తితులకనుకూలంగా జాతీయ నాయకులు అధ్యక్ష తరహా ప్రజాస్వామ్యానికి బదులుగా పార్లమెంటరీ ప్రజా ప్రాతినిధ్య వ్యవస్థను ఎంపిక చేసుకొని ప్రజా పాలనకు శ్రీకారం చుట్టారు .ప్రజా సమస్యల పరిష్కారానికి సమగ్రమైన చర్చలు జరుగాలని ప్రశ్నలు సరైన జవాబులతో కార్యనిర్వహక వర్గాన్ని ప్రభుత్వ యంత్రాంగాన్ని చట్టసభలకు జవాబుదారీ తనం చెయ్యాలనే ఉద్దేశంతో పార్లమెంటరీ ప్రజాస్వామ్య పద్ధతిని ప్రవేశ పెట్టడం జరిగింది. రాజ్యాంగ లక్ష్యాలు నెరవేరాలంటే పార్లమెంట్ రాష్ట్రాలచట్టసభలు(అసెంబ్లీలు) ఎక్కువ కాలం సమావేశం కావాలి. ప్రభుత్వం

సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో చూయించే శ్రద్ధ

చట్టసభల సమావేశాలు నిర్వహించడంలో చిత్త శుద్ధి కొరవడింది.దేశంలోచట్టసభల సమావేశాలు మొక్కుబడిగా జరుగుతున్నాయి. దేశంలో నెలకొన్న సమకాలీన రాజకీయ ‘ఆర్థిక పరిస్థితులు రాజ్యాంగ లక్ష్యాలకు భిన్నంగా ఉన్నాయి. అధికార పక్షం ప్రజా సమస్యల పరిష్కారానికి కాకుండా సమస్యలను పక్కదారి పట్టించే డైవర్షన్ రాజకీయాలకు పెద్దపీట వేస్తున్నాయి.ప్రతిపక్షాలను నిర్వీర్యం చేసే రాజకీయాలకు ప్రాధాన్యత ఇస్తున్నాయి.

లోక్ సభాపతి బిఓం బిర్లా ఆవేదన

చట్ట సభలు తరచుగా సమావేశాలు కావాలన్న నిభందనలు పాటించకుండ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తున్నాయని

తాజాగా అఖిల భారత స్పీకర్ల సదస్సులో లోక సభాపతి ఓం బిర్లా ఆవేదన వ్యక్తం చేశారు. చట్టసభలు సమావేశమయ్యే రోజులు తగ్గిపోతున్నాయి. చట్ట సభల్లో సభామర్యాదలు తగ్గాయి.వ్యక్తిగత విమర్శల్లో అధికార పక్షం ప్రతిపక్ష సభ్యుల మధ్య పోటీ నెలకొంది. నిర్మాణాత్మక చర్చలు జరుగడం లేదు. నిర్మాణాత్మక విమర్శల స్థానములో పరస్పర ఆరోపణలు ‘వ్యంగ్యాస్త్రాలు’ రాజకీయ ప్రసంగాలు చోటు చేసుకుంటున్నాయి.సభా సాంప్రదాయాలు ప్రజాస్వామిక విలువలు తగ్గిపోతున్నాయి. అధికార పక్షం’ ప్రతిపక్షం మధ్య స్వాగతించదగిన చర్చలు ఆచరణకు నోచుకోవడం లేదు. జాతీయ ప్రయోజనాల కొరకు అధికార పక్షం ప్రవేశ పెట్టిన బిల్లులపై సమగ్రమైన చర్చ జరుగకుండాప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయి.

చట్టసభలు బిప్రజల ఆకాంక్షలు

పార్లమెంట్ ‘రాష్ట్రాల అసెంబ్లీ సమావేశాలు ప్రజల ఆకాంక్షల కనుకులంగాప్రజాసమస్యలపై చర్చకు వేదికలుగా వర్ధిల్లాలి . చట్ట సభలు సమావేశమయ్యే రోజుకు తగ్గిపోతున్న పరిస్థితులపై లోకసభ స్పీకర్ ఓం బిర్లా ఆవేదన వ్యక్తం చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

రాచరికం బిప్రజాస్వామ్యం

బ్రిటిష్ పాలన అంతరించిన తర్వాత మన జాతీయ నాయకులు ప్రజాస్వామ్య వ్యవస్థను ఎంపిక చేసుకొని ప్రజలస్వేచ్ఛ’ స్వాతంత్రం సౌభ్రాతృత్వం ‘ సమానత్వం ప్రాతిపదికన రాజ్యాంగం బద్ధమైన పార్లమెంటరీ పాలన విధానాన్ని అనుసరిస్తున్నాం.

అందరికి సమాన అవకాశాలు

రాజ్యాధికారంలో అందరికి సమాన అవకాశాలు కల్పించే ప్రజాస్వామ్య వ్యవస్థ పురుడు పోసుకుంది. దేశ ప్రజల సంక్షేమానికి ఉజ్వల భవిష్యత్తు కోసం పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాం.

ప్రజా సంక్షేమంబిఅభివృద్ధి

మన దేశంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమానికి’ అభివృద్ధికి పెద్దపీట వేయడం గమనార్హం. మానవ వనరుల సంక్షేమానికి దోహదపడే చట్టాలను రూపొందించడంలో చట్టసభల్లో ‘ప్రజాస్వామ్య పార్లమెంటరీ విధానాలను అనుసరిస్తున్నాం.వనరుల సేకరణ ‘వనరుల వినియోగం’ పెట్టుబడుల సమీకరణ’విదేశీ వాణిజ్యం ‘ఉత్పత్తి విధానాలు వ్యవసాయ’ పారిశ్రామిక’ సేవా రంగాల్లో శీఘ్రతర అభివృద్ధికి ప్రణాళికలను అమలు చేస్తున్నాం.

సుపరిపాలనకు బిపెద్ద పీట

పార్లమెంటరీ పాలన వ్యవస్థలో ప్రజలందరికీ సమాన అవకాశాల కల్పన ‘లింగ సమానత్వం ‘ప్రాంతీయ సమానత్వం ‘మైనార్టీ రక్షణ మానవ హక్కుల రక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది.

సాధికారిత బిభాగస్వామ్యం

యువజన ‘మహిళా సాధికారిత ‘పాలనలో యువతకు భాగస్వామ్యం కల్పించడం జరిగింది . దివ్యాంగుల సంక్షేమం. పాలనలో జవాబుదారీతనం సుపరిపాలన’ పాలనలో పారదర్శకత’ జవాబుదారీతనానికి పెద్దపీట వేయడం జరిగింది.

ప్రజా విశ్వాసాన్ని కోల్పోతున్న పార్లమెంటు

సార్వత్రిక ఎన్నికల్లో పార్లమెంటరీ విధానం ద్వారా ఎంపికైన ప్రభుత్వాలు పార్లమెంటరీ విలువలకు తిలోదకాలివ్వడం. ఎన్నికైన ప్రభుత్వాలు అహంకారం’ నియంతృత్వం ‘అవినీతి’ అరాచక ‘ఏకపక్ష పాలనా విధానాలకు పెద్దపీట వేయడం ద్వారా ప్రజాస్వామ్యం ఆశించిన స్వేచ్ఛ’ సమానత్వం’ సౌభ్రాతృత్వం ఎండమావి గానే మారిపోయింది.

చట్టసభలు తిట్లకు వేదికలు కాకూడదు

ప్రజలు ఎదుర్కొనే మౌలిక సమస్యలను పక్కనపెట్టి రాజకీయ ప్రయోజనాల కొరకు వ్యక్తిగత రాగద్వేషాలకు తిట్లకు చట్టసభలు వేదికలు కావడం శోచనీయం. చట్ట సభలు అప్రజాస్వామిక పద ప్రయోగ శాలలుగా మారిపోయినాయి.ప్రజా ప్రయోజనాలు కాకుండా జనస్వామ్యం స్థానంలో ప్రమాదకర నేత స్వామ్యంగా మారే పరిస్థితులు ధాపురించే అవకాశం వుంది.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో పార్లమెంటు’ రాష్ట్రాల అసెంబ్లీలు తరుచుగా భేటీ కావాలి. రాజ్యాంగ విలువలే గీటురాళ్ళుగా ప్రభుత్వాల పనితీరును నిష్పాక్షికంగా సమీక్షించాలి. పాలకుల తప్పులను తూర్పారపడుతూ పౌరసేవల్లో నాణ్యత పెంచడానికి మెరుగైన సూచనలు అందించాలి. అందుకు విరుద్ధంగా సమావేశాలు మొక్కుబడి తంతులవుతున్నాయి. సమకాలీన భారతంలో ఈ ఆదర్శాలు చెల్లని కాసులైనాయి. అఖిలభారత స్పీకర్ల సదస్సులో లోకసభాపతి ఆవేదన వ్యక్తం చేస్తూ చట్టసభల సమావేశాలుతగ్గిపోతున్నాయి. సభా కార్యక్రమాలకు ఉద్దేశపూర్వకంగా అంతరాయం కల్పించే పెడపోకడలు పెరిగిపోతున్నాయి. వీటన్నింటి మూలంగా మన చట్టసభల గౌరవ మర్యాదలు మంట కలుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

రాజకీయ ప్రయోజనాలకు పెద్ద పీట

అధికారంలో ఉన్న పార్టీకి నాయకులకు కార్యకర్తలకు లబ్ది చేకూరే విధానాలకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల సామాన్యుల సాధికారిత నినాదంగానే మిగిలిపోయింది. పెట్టుబడిదారులకు కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చే ఒంటెద్దు పోకడలు ఆధిపత్యం

అహంభావ ధోరణులు ప్రభుత్వాల్లో నెలకొన్నాయి. ప్రముఖ ఆర్థిక వేత్త అమర్త్యసేన్ సూచించినట్లు ప్రజలకు కనీస అవసరాలైన విద్య ‘వైద్యం’ మౌలిక వసతులు కల్పన పట్ల చట్టసభల్లో ఆశించిన మేరకు పనిచేయని స్థితిలో వున్నాయి.

ఆర్థిక అసమానతలు

ఆర్థికశక్తి కేంద్రీకరణ జరిగి ఆర్థిక అసమానతలు ఏర్పడ్డాయి. కార్పొరేట్ ‘ప్రైవేటీకరణకు ప్రాధాన్యత ఇచ్చే విధానాలను కొనసాగించడం వల్ల దేశంలో అభివృద్ధి కొన్ని ప్రాంతాలకే కేంద్రీకృతమై మిగతా ప్రాంతాలు ఆర్థికంగా’ సామాజికంగా ‘వెనుకబడి పోయి ‘దారిద్ర్యం తాండవిస్తోంది. అనేక ప్రాంతాలు వ్యవసాయ’ పారిశ్రామిక ‘ సేవా రంగాల్లో వెనుకబడిపోయినాయి.

పేదరికంబి అల్ప జీవన ప్రమాణాలు

ప్రజలు తీవ్ర ఆర్థిక అసమానతలతో ‘అల్ప జీవన ప్రమాణాలతో కూడు’ గూడు గుడ్డ’ లేని గడ్డు పరిస్థితిలో పేదరికంలోకి వెయబడే విచిత్ర పరిస్థితులు నెలకొనడం విచారకరం.

సమగ్ర చర్చలు జరగాలి

పార్లమెంట్లో జాతీయ సమస్యల మీద ప్రతిపక్షం అధికారపక్షం సమగ్రంగా చర్చించకపోవడం వల్ల రూపొందించే చట్టాలు అమలులో అనేకసవాళ్లు ఎదురౌతున్నాయి. ఆధునిక సాంకేతిక యుగంలో సంభవించిన మార్పులు పేదలకు అండగా నిలువడంలేదు. ప్రభుత్వాలు ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించడంలో ఆశించిన మేరకు పనిచేయడం లేదు. రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్ర ‘ప్రభుత్వం ‘రాష్ట్ర’ ప్రభుత్వాలను కూల్చడం అధికారంలో ఉన్న పార్టీలను చీల్చడం రాజకీయ చదరంగంలో ప్రజలను పావులుగా వాడుకునే సంస్కృతికి అలవాటు పడిన రాజకీయ పార్టీలకు ఇటీవల దేశంలో జరిగిన 18 వ సార్వత్రిక ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పిప్రజలు ప్రజాస్వామ్య స్ఫూర్తిని చా టడం స్వాగతించదగిన పరిణామం.

స్వార్థ రాజకీయాలు మానాలి

అధికార పార్టీ స్వార్థపర రాజకీయాలు మానుకోవాలి. ప్రజల హక్కులకు రక్షణ’ భద్రత కరువైంది .ఉపాధి కల్పన ఊసే లేదు. మహిళా సాధికారిత’ యువజన సాధికారిక’ గ్రామీణ అభివృద్ధి చేతివృత్తుల రక్షణ

స్వదేశీ పరిశ్రమల స్థాపన ఖాదీ గ్రామీణ పరిశ్రమల నిర్లక్ష్యం కొనసాగుతూనే వుంది.

ప్రజాస్వామ్య పరిపుష్టి

మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుచేయడానికి పాలన చట్టపరమైన చర్యల తీసుకోవాలి. చట్టసభల్లో బీసీ లకు రిజర్వేషన్లు మాటలకే పరిమితమైనాయి. మెజారిటీ ప్రజలకు రాజ్యాధికారం లో వాటా లభిస్తే ప్రజాస్వామ్యం పరిపుష్టమౌతుంది . జనాభాలో సగభాగం ఉన్న మహిళలు’ బీసీలు రాజ్యాధికారానికి దూరంగా నెట్టి వేయబడి రెండవ తరగతి పౌరులుగా పరిగణించ బడుతున్నారు.

మహిళా’ ఎం ‘పీల సంఖ్య తక్కువ

పార్లమెంటరీ ఎన్నికల్లో ఎం’పీలుగా చట్టసభల్లో మహిళలు 15 శాతం మించి ఎన్నిక కాని దుస్థితి కనబడుతుంది. చట్టసభల్లో బలహీన వర్గాలకు మహిళలకు సముచిత ప్రాతినిధ్యం లేదు. బలహీన వర్గా లమహిళల సమస్యలపై గొంతుకలు పార్లమెంటు లేకపోవడం విచారకరం.

యువత జనాభాకు తగిన ప్రాతినిధ్యం లేదు

ప్రపంచ జనాభాలో 40 ఏండ్ల వయసున్న యువత 40 శాతం లోపు యువత ఉన్నప్పటికీ పార్లమెంటరీ వ్యవస్థలో చట్టసభల్లో యువత ప్రాతినిధ్యం 15% మాత్రమే వుంది. ప్రపంచ దేశాల్లోని 33 శాతం పార్లమెంట్లో 30 లోపు వయసు వున్న యువతకు ప్రాతినిధ్యం లేదు .ప్రపంచ దేశాలలో మహిళలు జనాభాలో సగభాగం ఉండి శాస్త్ర ‘సాంకేతిక రంగంలో పురుషులతో సమానంగా పోటీ పడుతూ ఉన్నప్పటికీ చట్టసభల్లో సభ్యులుగా 20 నుంచి 30 శాతం పార్లమెంటుకు ఎన్నిక కాని దుస్థితి దాపురించింది. భారతదేశంలో యువతకు అధికారంలో ప్రాతినిధ్యం ఇవ్వాలని అభివృద్ధిలో వారిని సంపూర్ణ భాగంగా చేయాలన్న వాదనలు రోజు రోజుకు బలపడుతున్నాయి.

లియువత రాజకీయాల్లోకి రావాలి ప్రధాని పిలుపులి

ఎలాంటి రాజకీయ అనుభవం లేని లక్ష మంది యువకులు క్రియా శీల రాజకీయాల్లోకి రావాలని అప్పుడు మాత్రమే వికసిత్ భారత్ లక్ష్యం నెరవేరుతుంది అన్నదేశ ప్రధాని మోడీ గారి పిలుపు యువతకు మేలుకొలుపు కావాలి. యువతతో మెరుగైన రాజకీయాలు సాధ్యమని మనకి బాత్ కార్యక్రమంలో దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పేర్కోవడం గమనార్హం.

లిప్రజా సేవకులుబి చట్ట సభలకు ఎన్నిక కావాలిలి

ప్రజా సేవకులు చట్టసభలకు ఎన్నికకావాలి. (పార్లమెంటుకు) చట్టసభలకు ఎన్నికైన సభ్యులు ప్రజాసేవకులుగా ఉండాలని ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాలనా విధానాలు రూపొందించాలని ‘పౌరుల యొక్క సంక్షేమమే చట్టసభల సభ్యుల లక్ష్యం కావాలని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిర్ణిత కాలంలో అమలు చేసే క్రియాశీలక కార్యాచరణకు పెద్దపీట వేసే ప్రగతిశీల ప్రజాస్వామ్య పాలన విధానాలను ప్రజలు కోరుకుంటున్నారు.

లిదేశ సమస్యలుబి పరిష్కారం బిసమగ్ర చట్టాలులి

భారతదేశం ఎదుర్కొంటున్న పేదరికం నిరోద్యోగం ‘ఆర్థిక సామాజిక అసమానతలు’ బాల కార్మిక నిర్మూలన ‘వెట్టి చాకిరి’ లైంగిక హింస ‘స్త్రీ ‘ పురుష సమానత్వం ‘ ప్రాంతీయ అసమానతలు’ ఉచితంగా అందరికీ విద్య’ వైద్యం ప్రజలకు అందించాలి. ఆదునిక సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులను ప్రజల ముంగిట్లోకి చేర్చాలి. కులతత్వం’ మతతత్వం ప్రాంతీయతత్వం ‘ఉగ్రవాదం అగ్రవాదం ‘ సంఘ విద్రోహ చర్యలను అరికట్టడానికి సమగ్రమైన చట్టాలు రూపొందించాలి.

చట్ట సభల్లో నిర్మాణాత్మక చర్చలు జరగాలి

చట్ట సభల్లో నిర్మాణాత్మక చర్చలు జరగాలని దీర్ఘకాలికంగాఅపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం ప్రతిపక్షాలతో ప్రభుత్వాలు సమన్వయ సహకారాన్ని తీసుకోవాలి.

ప్రజా సమస్యలపై పార్లమెంట్లో’ అసెంబ్లీలో సభ్యులు గళమెత్తాలి. వాటి పరిష్కారానికి కృషి చేయడం చట్టసభల సభ్యుల కర్తవ్యం. చట్టసభలు నామమాత్రంగా సమావేశమవుతే ప్రజాప్రతి నిధులుతమ బాధ్యతలు ఎలా నిర్వహించగలరు,? మొదటి లోకసభ వార్షిక పనిదినాలు 135 అయితే 17వ లోకసభ ( 2019 –2024 )కు వచ్చేసరికి 55 దినాలకు పడిపోయాయి. కాలం గడుస్తున్న కొద్ది చట్టసభల భేటీ సంఖ్య తగ్గిపోతుండడం ఆందోళన కలిగించే అంశం. స్పీకర్ల సదస్సు (ఏ’ఐ’పీ’వోసీ) 30 ఏళ్ళ క్రితం ఆదోళనన వ్యక్తం చేసింది. చట్టసభలు సాలీన ఎన్ని రోజులు సమావేశం కావాలో నిర్దేశిస్తూ రాజ్యాంగంలో నిబంధనలు రూపొందించారు. 1993 (ఏఐపీవోసీ) తీర్మానించింది. 70 మంది కంటె తక్కువ సభ్యులు ఉన్న అసెంబ్లీలు ఏడాది కనీసం 50 రోజులు కొలువు తీరాలని. మిగతా రాష్ట్రాల శాసన సభలు 90 రోజులు సమావేశం కావాలని సంవిధాన సమీక్ష సంఘం జస్టిస్ వేంకట చెల్లయ్య కమిషన్ సిఫారసు చేసింది. రాజ్యసభ ‘లోకసభలు సంవత్సరానికి కనీసం 100 120 రోజులు కావాలని కమిషన్ సూచించింది.వాస్తవంగా కొన్ని రాష్ట్రాల అసెంబ్లీల్లో ప్రతిపక్షనేత సభకు హాజరు కాని పరిస్థితి నెలనడం అసెంబ్లీకి హాజరు కాక పోవడం పట్ల వారి ప్రజాస్వామ్య నిబద్ధత అనేక సందేహాలకు తావిస్తుంది.ఇలాంటి పరిస్థితిభారత ప్రజాస్వామ్యం యొక్క దుస్థితికి దర్పణం పడుతుంది.

రాష్ట్రాల అసెంబ్లీలు బి సమావేశాలు

దేశంలో 2017బి2023సం” రాల మధ్యకాలంలో హరియాన అసెంబ్లీ 13దినాలు ‘పంజాబ్ అసెంబ్లీ 14 వార్షిక పనిదినాలు మాత్రమే సమావేశాలు జరిగాయి.ఉత్తరాఖండ్’ ‘సిక్కిం అసెంబ్లీలో ఏడాదికి 12 రోజు ల పాటు సమావేశాలై చర్చలు జరిగాయి.మధ్యప్రదేశ్’ తెలంగాణ అసెంబ్లీలో సంవత్సరానికి సగటున 18 రోజులు కొలువు తీరితే ఆంధ్రప్రదేశ్ ‘ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో 19రోజుల పాటు పనిచేశాయి. చట్టసభలు ప్రజా సమస్యలపై సమగ్రమైన చర్చలు జరుపకుండ పరస్పర దూషణాలకే ప్రాధాన్యత ఇస్తున్నాయి . ప్రభుత్వాలపై చట్టసభల పర్యవేక్షణ లోపిస్తుంది. పాలనలో పారదర్శకత తగ్గిపోతుంది.

అభివృద్ధి చెందిన దేశాలుబి చట్టసభల సమావేశాలు

అమెరికా లాంటి అభివృద్ధి చెందిన దేశాల్లో చట్ట సభల సమావేశాలు ఏడాదికి సగటున 146.7 రోజులు సమావేశమై దేశ ప్రజల స్థితి గతులపై చర్చిస్తుంది. ఫ్రాన్స్ లో120 రోజులు సమావేశాలు జరుపాలనే నిబంధన వుంది.జపాన్ చట్ట సభ ప్రతి ఏడాది150రోజులు తప్పక సమావేశమవుతుంది. 2023లో బ్రిటన్లో హౌస్ ఆఫ్ కామన్స్ 143 రోజులు పనిచేసిన ఆధారాలు ఉన్నాయి.

భారత దేశంలో చట్టసభలు సమావేశమవుతున్న రోజులు అతి తక్కువ రోజులు ఉండడం. ఆ కొద్ది రోజుల్లో అనవసర వాగ్యుద్ధాలతో సభా సమయం వృధా అవుతుంది.సమగ్రమైన చర్చలు జరగకుండానే చట్టాలు రూపొందించ బడుతున్నాయి. సమగ్రమైన చర్చలు లేకుండ చేసిన చట్టాలు లోప భూయిష్టంగా ఉండడం వల్ల అమలులో అనేక అవాంతరాలు ఎదురవుతున్నాయి. కొన్ని చట్టాల అమలులో కోర్టులు జోక్యం చేసుకుంటున్నాయి.

ప్రజాపాలనలో ప్రతిష్టంభన నెలకొని ప్రగతి పురోగతి ఆశించిన మేరకు జరగడం లేదు.

చట్ట సభలు బితిట్ల సభలు కాకూడదు

చట్టసభలు తిట్ల సభలు కాకూడదు. పార్లమెంట్’ రాష్ట్రాల అసెంబ్లీల సమావేశాలు రాజకీయ
ప్రతీకార వేదికలు కాకూడదు.

వ్యక్తిగత రాజకీయాలకు అతీతంగా ప్రజాసంక్షేమమే ఎజెండాగా చర్చలు జరగాలి.

ధనవంతులు ఎన్నిక

18వ ‘భారత పార్లమెంటుకు జరిగిన ఎన్నికలలో ధనవంతులు ఎన్నికైనారు.

ఎం’పి సగటు ఆస్తి విలువ 38రూ” కొట్లు కాగా 53 మంది ఎం’పి లు (7శాతం) బిలియనీర్లు ఉన్నారని ఒక అధ్యయనంలో వెల్లడైంది.

చట్టసభలు బి నేరఛరితులు

దేశంలోని 543 మంది ఎంపీల్లో 251 మంది(46 శాతం) మీధ తీవ్రమైన క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. నేరచరిత్ర ఉన్న వారే పార్లమెంటుకు’ అసెంబ్లీలకు ఎన్నిక కావడానికి అదనపు అర్హత కావడం విచారకరం.

ధనస్వామ్యంగా మారిన ప్రజాస్వామ్యం

ధన బలం ‘కుల బలం ప్రాంతీయ బలం ‘కండ బలం రియల్ ఎస్టేట్ ‘సాండ్ మాఫియాలు మనదేశ పార్లమెంటరీ వ్యవస్థను శాసిస్తున్నాయి.

ప్రజల ఆశలు ‘ఆకాంక్షలు తీర్చే ప్రజాప్రతినిధులు’ చట్ట సభలకు సభ్యులుగా ఎన్నుకోబడాలి .

చట్టసభలు ఉచిత వైద్యం సామాజిక న్యాయం సమానత్వం అంతరాలు లేని వ్యవస్థ పేదరిక నిర్మూలనా ఉపాధి కల్పన గృహ వసతి మౌలిక సదుపాయాల కల్పన ఆదాయ మార్గాల పెంపుమున్నగు అంశాలపై

చర్చించి సమగ్రచట్టాలు రూపొందించి దేశ మానవ వనరుల అభివృద్ధికి కృషి చెయ్యాలి.

ఓటర్లు నీతి నిజాయితీ పరులను ఎం’పీ’లుగా శాసన సభ్యులుగిఎన్నుకొని ప్రజాస్వామ్య పరిరక్షకులుగా ప్రజలు ఎదగాలి.

నేదునూరి కనకయ్య
ఛైర్మెన్ తెలంగాణ ఎకనామిక్ ఫోరం
సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక
తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరం
కరీంనగర్9440245771





# టిల్లుని మరిచిపోయేలా 'తెలుసు కదా'

ప్రేక్షకులపై ఎంతో ప్రభావం చూపించిన టిల్లులాంటి పాత్ర నుంచి బయటికి రావాలంటే ఇలాంటి సినిమా అవసరం అని నమ్మి చేసిందే 'తెలుసు కదా' అన్నారు సిద్ధు జొన్నలగడ్డ. ఆయన హీరోగా... నీరజ కోన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి కథానాయికలు. టి.జి.విశ్వప్రసాద్, కృతిప్రసాద్ సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రం దీపావళి సందర్భంగా ఈ నెల 17న ప్రేక్షకుల ముందుకొస్తోంది. సోమవారం హైదరాబాద్‌లో ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. మూడు పాత్రల మధ్య... గాఢమైన భావోద్వేగాలతో రూపొందిన ప్రేమకథా చిత్రమని ట్రైలర్ స్పష్టం చేస్తోంది. వేడుకని ఉద్దేశించి కథానాయకుడు మాట్లాడుతూ "యువతరంతోపాటు, కుటుంబ ప్రేక్షకులకూ నచ్చే సినిమా ఇది. ప్రేమకథతో తెరకెక్కింది. అందుకు తగ్గట్టే సన్నివేశాలు ఉంటాయి తప్ప, ముద్దు సన్నివేశాలు ఉండవు. ఒక్క ముద్దు కూడా ఉండకూడదని ముందే దర్శకురాలు నీరజకి చెప్పా. టిల్లు పాత్రకీ, దీనికీ ఏమాత్రం సంబంధం ఉండదు. టిల్లు చాలా అమాయకుడు. కానీ ఇందులో నేను పోషించిన వరుణ్ మాత్రం చాలా తెలివైనవాడు. ట్రైలర్‌లో చూసినట్టుగా అదే టోన్‌లోనే ఉంటుంది పాత్ర. ఈ సినిమా సెట్లో దర్శకురాలితో కలిపి ఎప్పుడూ 16 మంది మహిళలు ఉండేవారు. నేను ఒక్కడినే అబ్బాయిని. వీళ్లందరితో కలిసి సినిమా చేయడం చాలా సరదాగా అనిపించింది" అన్నారు. సినిమా కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నానని చెప్పింది శ్రీనిధి శెట్టి. "నా తొలి సినిమా ఇది. ఎంతో ప్రత్యేకమైనది. ట్రైలర్‌తో పోలిస్తే పది రెట్లు బాగుంటుందీ చిత్రం" అన్నారు నీరజ కోన. "వినగానే నచ్చి చేసిన సినిమా ఇది. ఇలాంటి సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్న మా బృందాన్ని చూసి గర్వపడుతున్నా" అన్నారు నిర్మాత కృతిప్రసాద్.

# దక్షిణాదిపై ఆసక్తిచూపుతోన్న బ్రిటిష్ సింగర్





బ్రిటీష్ పాప్ సింగర్ ఎడ్వర్డ్ క్రిస్టోఫర్ షీరన్ దక్షిణాదిపై ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే మన పాటలను తన కాన్సర్ట్‌లలో పాడి అలరించిన ఆయన తాజాగా ఓ కోలీవుడ్ ఆల్బమ్‌లో పాట పాడనున్నారు. ఈ విషయాన్ని తమిళ సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్ అధికారికంగా ప్రకటించారు. తాను సంగీత దర్శకత్వం వహించనున్న ఓ ఆల్బమ్‌లో షీరన్ పాట పాడనున్నట్లు తెలుపుతూ సంతోష్ నారాయణన్ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. ఈ ఆల్బమ్‌లో తన కుమార్తె 'ధీ'తో పాటు కేరళకు చెందిన రాపర్ హనుమాన్‌కైండ్ కూడా భాగం కానున్నట్లు సంతోష్ తెలిపారు. ఇది ఓ అంతర్జాతీయ ఆల్బమ్ అని వెల్లడించారు. దీన్ని రూపొందిస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. షీరన్ గతంలో పలు కాన్సర్ట్‌లలో మన తెలుగు పాటలు పాడి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇటీవల బెంగళూర్‌లో జరిగిన ఈవెంట్‌లో ఆయన 'దేవర'లో 'చుట్టమల్లే' పాటను కూడా పాడగా ఆ వీడియో ఎంతో వైరలైంది. "సంగీతానికి హద్దులు ఉండవు. మీరు ఈ విషయాన్ని మరోసారి నిరూపించారు. మీ గొంతులో చుట్టమల్లే పాట వినడం నిజంగా ప్రత్యేకం" అంటూ ఆ పాప్ సింగర్‌కు ఎన్టీఆర్ ధన్యవాదాలు తెలిపిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఏకంగా కోలీవుడ్ ఆల్బమ్‌లో భాగం కావడంతో ఆయన దక్షిణాదిపై ఆసక్తిగా ఉన్నట్లు తెలుస్తోంది.

# తెలుగు దర్శకుడితో సల్మాన్‌ఖాన్?



టాలీవుడ్‌లో సంగతులు వినిపిస్తున్నాయి. అందులో అగ్ర కథానాయకుల సినిమాలే ఎక్కువ. ఆ సినిమాలన్నీ. అందులో ఒక ఆసక్తికరమైన వెలుగులోకి వచ్చింది. అదే సల్మాన్‌ఖాన్‌తో ఒక తెలుగు సినిమా. ఆ దర్శకుడు ఎవరో కాదు... వంశీ పైడిపల్లి. తమిళ కథానాయకుడు విజయ్‌తో 'వారసుడు' తర్వాత ఆయన్నుంచి సినిమాలేవీ రాలేదు. తదుపరి బాలీవుడ్ తార సల్మాన్‌ఖాన్‌తో సినిమా చేయడానికి స్క్రిప్ట్‌ని సిద్ధం చేశారని, ఈ కలయికలో దిల్‌రాజు ఈ చిత్రాన్ని నిర్మించనున్నట్టు సమాచారం. స్పష్టత రావాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.

# అలాంటి మాటలు వింటే గుండె పగిలిపోతుంది



అవార్డులు ప్రకటించినప్పుడు ఎవరైనా ప్రశ్నిస్తే వాటి విలువ తగ్గిపోతుందని అంటున్నారు బాలీవుడ్ సీనియర్ కథానాయిక రాణీ ముఖర్జీ. ఎన్నో వైవిధ్యమైన చిత్రాలతో మూడు దశాబ్దాలుగా అలరిస్తున్న ఈమె.. ఇటీవలే ఉత్తమ నటిగా జాతీయ పురస్కారం అందుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రాణి.. నేషనల్ అవార్డు, సినీరంగంలో తన తొలి రోజుల గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకున్నారు."సినీరంగంలోకి అడుగుపెట్టడానికి చాలా పోరాటాలు చేయాల్సి వచ్చింది. మొదట్లో నా తండ్రి రామ్ ముఖర్జీ నేను చిత్రపరిశ్రమలోకి వస్తానంటే ఆసక్తి చూపలేదు. ఎందుకంటే అప్పట్లో సినిమా నేపథ్య కుటుంబాల పిల్లలు, ముఖ్యంగా అమ్మాయిలు నటనను వృత్తిగా స్వీకరించడం సాధారణమైన విషయం కాదు. నేను పెరుగుతున్నప్పుడు కూడా సినిమా కుటుంబం నుంచి వచ్చానని స్కూల్లో చెప్పుకోకపోయేదాన్ని. నా తల్లి కూడా నన్ను సినిమా నుంచి తొలగించమని నిర్మాతను కోరింది. స్క్రీన్ టెస్ట్ తర్వాత నటించడానికి ఒప్పుకున్నారు. కానీ ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఎక్కువ మంది యువకులు నటులుగా మారడానికే ఆసక్తి చూపిస్తున్నారు"."నేషనల్ అవార్డు ప్రకటించినప్పుడు ప్రేక్షకులు కూడా మనం దానికి అర్హులమని భావిస్తే వచ్చే ఆనందాన్ని మాటల్లో చెప్పలేం. అలా కాకుండా 'ఆమె నటనకు పురస్కారం వచ్చిందా? ఆమె కంటే గొప్పవారు చాలా మంది ఉన్నారు' లాంటి విమర్శలు వినిపించాయంటే దాన్ని అందుకున్నప్పటికీ సంతోషం ఉండదు. ఇటీవలే నాకు జాతీయ పురస్కారం వచ్చినప్పుడు అందరూ అంగీకరించారు. వారి అంగీకారం నాకు అవార్డు కంటే గొప్పగా అనిపించింది. నటీనటులకు చిన్న పురస్కారం కూడా ముఖ్యమే. ప్రేక్షకులను అలరించడమే మా ప్రధాన లక్ష్యం. మాకు గౌరవం, గుర్తింపు వచ్చాయంటే అభిమానులు కూడా ఆనందిస్తారు"."నేను నటించిన 'హిచ్‌కీ' సినిమా చేస్తున్నప్పుడు.. నా కుమార్తె అదిరాకి 14 నెలల వయసు. అప్పటికీ తనకు పాలు పడుతున్నా. నేను ఉదయం ఆరున్నరకి పాలు పట్టి, షూటింగ్‌కి వెళితే.. పన్నెండు-ఒంటి గంట వరకు నా పార్ట్ పూర్తి చేసుకొని తిరిగి నా బిడ్డకు పాలు ఇవ్వడానికి ఇంటికి వెళ్లేదాన్ని. రోజూ 6-7గంటలు షూటింగ్ చేసేలా, ట్రాఫిక్ పెరగక ముందే ఇంటికి వెళ్లేలా నా యూనిట్, మా దర్శకుడు అంతా కలిసి ప్లాన్ చేసుకున్నాం. ఈ సినిమా మొత్తం ఇలాగే పూర్తి చేశా. ఈ డిస్కర్షన్ అంతా నాకు, నా టీమ్‌కి, దర్శకుడికి మధ్య జరిగింది. ఇప్పుడీ విషయం గురించి పెద్ద చర్చలే జరుగుతున్నాయి. నిర్మాతకు, దర్శకుడికి ఒకే అయితే సినిమా చేయాలి. ఒకవేళ నిర్మాత ఒప్పుకోకపోతే.. ఆ సినిమా మానేయాలి. అది మన చేతుల్లోనే ఉంటుంది. కచ్చితంగా చేయాల్సిందేనని ఎవరూ చెప్పరు"."దశాబ్దాలు గడిచినా చిత్రపరిశ్రమలో నేను నిత్యవిద్యార్థిగానే ఉంటా. ప్రతి సినిమాతోనూ ఏదో ఒక కొత్త విషయం నేర్చుకుంటుంటా. సెట్‌లో లేనప్పుడు.. సెలవుల్లో బయటికి వెళ్లినప్పుడు కూడా అక్కడి ప్రజలను గమనిస్తుంటా. ఎందుకంటే ప్రయాణం చేసిన అన్ని ప్రదేశాల్లోనూ ఏదో ఒక కొత్త విషయం నేర్చుకునే అవకాశం ఉంటుంది. 'ఇందులో రాణి బాగా నటించలేదు. మునుపటి పాత్రల్లో అద్భుతంగా జీవించింది' లాంటి మాటల్ని వినాలని కోరుకోవట్లేదు. ఇలాంటి వ్యాఖ్యలు వింటే నాకు గుండె పగిలిపోతుంది. అందుకే ఎప్పుడూ నన్ను నేను మెరుగుపరుచుకుంటూనే ఉంటా".

# ఒకేసారి మూడు చిత్రాలు.. సిరీస్‌లు



అదిరిపోయే కంటెంట్‌తో ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్. ఇప్పుడీ బాటలోనే సోమవారం త్వరలో రాబోయే సినిమాలు, వెబ్‌సిరీస్‌ల జాబితాను వెల్లడించింది. కథానాయకుడు ఆనంద్ దేవరకొండ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'తక్షకుడు'. వినోద్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను అధికారికంగా ప్రకటిస్తూ.. ఓ పోస్టర్‌ను పంచుకుంది ఓటీటీ సంస్థ. 'వేటగాడి చరిత్రలో జింక పిల్లలే నేరస్థులు..' అంటూ ఆ పోస్టర్‌పై ఉన్న వ్యాఖ్య ఆసక్తి రేకెత్తించేలా ఉంది. ఇది మీరు ఇప్పటి వరకు నేర్చుకోని కొత్త చాప్టర్ అంటూ 'సూపర్ సుబ్బు' సిరీస్‌తో రాబోతున్నాడు హీరో సందీప్ కిషన్. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సిరీస్‌ను మల్లిక్ రామ్ తెరకెక్కిస్తున్నారు. రైట్ సబ్జెక్ట్ రాంగ్ టీచర్ అనే ట్యాగ్‌లైన్‌తో ఉన్న ఓ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇటీవలే 'ఓజీ' చిత్రంతో అలరించిన అందాల తార ప్రియాంక మోహన్ 'మేడ్ ఇన్ కొరియా'గా అలరించడానికి సిద్ధమైంది. ఈ చిత్రానికి రా కార్తీక్ దర్శకత్వం వహిస్తున్నారు. కొరియా వెళ్లిన ఓ సౌత్ అమ్మాయికి ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయి అనే కథాంశంతో దీన్ని తీర్చిదిద్దుతున్నారు. 'ఆలస్యమైనా కూడా చివరికి పజిల్‌లా కలిసిపోవాల్సిందే' అంటూ ప్రేమ పక్షుల్లా అలరించడానికి 'చిలవ్' సిరీస్‌తో ముస్తాబవుతున్నారు అర్జున్‌దాస్, ఐశ్వర్య లక్ష్మీ. వీరిద్దరూ జంటగా నటిస్తున్న ఈ సిరీస్‌కు బాలాజీ మోహన్ దర్శకుడు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సిరీస్ ఫస్ట్‌లుక్‌ను పంచుకుంది ఓటీటీ సంస్థ.

**కిరీటాన్ని ధరించే ధైర్యం ఎవరికుంది?**

గ్యాంగ్‌స్టర్‌గా అదరగొట్టడానికి సిద్ధమవుతున్నారు ఆర్ మాధవన్.. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న సిరీస్ 'లెగసీ'. చారుకేశ్ శేఖర్ తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ ప్రాజెక్టును అధికారికంగా ప్రకటించింది నెట్‌ఫ్లిక్స్. "ఈ సామ్రాజ్యానికి అధిపతిగా కిరీటాన్ని ధరించడానికి ఎవరు ధైర్యం చేస్తారు" అనే వ్యాఖ్యను జోడించింది. తన కుటుంబాన్ని, వ్యాపారాన్ని రక్షించుకోవడానికి వారసుడి కోసం వెతుకుతున్న ఓ వృద్ధ మాఫియా నాయకుడి కథాంశంతో దీన్ని రూపొందించారని సిరీస్ వర్గాలు తెలిపాయి. నిమిషా సజయన్, గుల్షన్ దేవయ్య, అభిషేక్ బెనర్జీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మిథున్ రూపొందిస్తున్న 'స్టీఫెన్' కూడా త్వరలో రాబోతున్నట్లు ప్రకటించింది నెట్‌ఫ్లిక్స్.

# దీపావళికి తొలి సిక్సర్ మాదే



ఈసారి దీపావళి పండగ సంబరాల్ని తొందరగా థియేటర్లలోకి తీసుకొస్తున్నామని, అందరూ కుటుంబంతో కలిసి మా సినిమా చూస్తూ ఆనందంగా సమయాన్ని గడపొచ్చన్నారు ప్రియదర్శి. ఆయన కథానాయకుడిగా తెరకెక్కిన చిత్రం 'మిత్రమండలి'. నిహారిక.ఎన్.ఎమ్ కథానాయిక. రాగ్ మయూర్, విష్ణు ఓయ్, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రధారులు. విజయేందర్ దర్శకత్వం వహించారు. కల్యాణ్ మంతెన, భాను ప్రతాప, విజయేందర్ రెడ్డి తీగల నిర్మాతలు. ఈ చిత్రం ఈ నెల 16న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా సోమవారం రాత్రి హైదరాబాద్‌లో విడుదలకు ముందస్తు వేడుకని నిర్వహించారు. కథానాయకుడు శ్రీవిష్ణు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రియదర్శి మాట్లాడుతూ "ఈ సినిమా నచ్చకపోతే, తదుపరి వచ్చే నా సినిమా చూడకండి. నాకు నాని అన్న నేర్పించిన మాట ఇది. సినిమాని ఎలా ప్రేమించాలో నేర్పించిన అన్న ఆయన. సినిమాపై నాకున్న నిబద్ధతతో, ప్రేక్షకులపై నాకున్న ప్రేమతో చెబుతున్న మాట ఇది. వచ్చే నా సినిమా ఏదైనా సరే, ఇది నచ్చకపోతే మాత్రం చూడకండి. సినిమాని చూసుకున్నాక నాకు కలిగిన నమ్మకంతోనే ఈ మాట చెబుతున్నా" అన్నారు. చిత్ర సమర్పకులు బన్నీ వాస్ మాట్లాడుతూ "స్వచ్ఛమైన కుటుంబ వినోదం ఉన్న సినిమా ఇది. పిల్లలతో కలిసి సినిమా చూస్తూ హాయిగా ఆస్వాదించవచ్చు. దీపావళికి ముందు మేమే వస్తున్నాం. తొలి సిక్సర్ మాదే. ఆ తర్వాత వచ్చే సినిమాలూ సిక్స్‌లు కొట్టాలి. అందరూ ఎదగాలి, పరిశ్రమ బాగుండాలి. అంతేకానీ పక్క సినిమాని తొక్కుతూ, మనం మాత్రమే ఎదగాలని ఆశపడితే ఎవ్వరేం చేయలేం. ఇక్కడ సినిమా బాగుంటే చూస్తారు. బాగోలేకపోతే ఎవ్వరిదైనా సరే, పక్కనపెడతారు. గౌరవం ఇవ్వాల్సింది ప్రేక్షకులకు. మా సినిమాపై ఎవరెన్ని ట్రోలింగ్స్ చేసినా సరే, నేను పరుగెడుతూనే ఉంటా. పరుగెత్తడంలోనే నా విజయం ఉందని నాకు తెలుసు. ఎవ్వరైనా ఆరోగ్యకరంగా పోటీపడదాం" అన్నారు. శ్రీవిష్ణు మాట్లాడుతూ "నేను నటించిన 'తిప్పరామీసం' సినిమాకి సహాయ దర్శకుడిగా పనిచేస్తున్నప్పుడే దర్శకుడు విజయేందర్‌ని చూశా. అమాయకుడిలా ఉన్నాడు, ఏమవుతాడో అనుకున్నా. కానీ తనే అందరికంటే ముందు దర్శకుడు అయ్యాడు" అన్నారు. ఈ కార్యక్రమంలో కల్యాణ్‌శంకర్, వివేక్ ఆత్రేయ, అనుదీప్.కె.వి, ఆదిత్య హాసన్‌తోపాటు చిత్రబృందం పాల్గొంది.

# ఉద్యోగం వదిలేసి సినిమాల్లోకి వచ్చా




"కొన్ని సినిమాలు చూస్తున్నప్పుడు కేవలం నవ్వించడం కోసమే అన్నట్టుగా సన్నివేశాల కూర్పు కనిపిస్తుంది. మేం మాత్రం ఒక మంచి కథ చెబుతూనే నవ్విస్తాం" అన్నారు జైన్స్ నాని. 'కె - ర్యాంప్' సినిమాతో పరిచయం అవుతున్న దర్శకుడు ఈయన. కిరణ్ అబ్బవరం కథానాయకుడిగా తెరకెక్కిన ఈ చిత్రం దీపావళి సందర్భంగా ఈ నెల 18న ప్రేక్షకుల ముందుకొస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా జైన్స్ నాని సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు. "ఏ సినిమా అయినా ముందు థియేటర్‌కి వచ్చేది యువతరమే. వాళ్లని ఆకర్షించాలనే ప్రయత్నంలో భాగంగానే ట్రైలర్‌ని ముస్తాబు చేసి విడుదల చేశాం. అందులో ఒకట్రెండు మాటల్నిబట్టి ఈ సినిమాని ఆ కోణంలో చూడాల్సిన అవసరం లేదు. ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యే అంశం ఇందులో ఉంది. యువతరమే కాదు, వాళ్ల తల్లిదండ్రులూ తప్పక చూడాల్సిన సినిమా. యువతరానికి నచ్చిందంటే, వాళ్లే కుటుంబ ప్రేక్షకుల్నీ తీసుకొస్తారనేదే నా నమ్మకం. కథానాయకుడు కిరణ్ అబ్బవరం నటనలోని ఉత్సాహాన్ని దృష్టిలో ఉంచుకునే పాత్రని, కథని డిజైన్ చేశా". "నేను మద్రాస్ ఐఐటీలో చదువుకున్నా. అక్కడ ఉన్నప్పుడే లఘు చిత్రాలు చేశా. వాటితో మంచి పేరొచ్చింది. అయితే చిన్నప్పటి నుంచే సినిమాపై ఆసక్తి ఉండేది. అందుకే ఉద్యోగం వచ్చినా వదిలేసి, ఇంట్లోవాళ్లని ఒప్పించి సినిమా రంగంలోకి వచ్చా. కొన్ని చిత్రాలకి సహాయ దర్శకుడిగా, రచయితగా పనిచేశా. మా హీరో కిరణ్ అబ్బవరంకు కథ చెప్పి, ఏడాదిన్నర ఆయనతో ప్రయాణం చేశా. ఆ తర్వాత ఈ సినిమాని పట్టాలెక్కించాం. కళాశాలలో చదువుకునేటప్పుడు స్నేహితులతో కలిసి మేం చేసిన అల్లరి... అక్కడే నాకు పరిచయమైన ఓ అమ్మాయి స్ఫూర్తితో అల్లుకున్న కథే 'కె - ర్యాంప్'. కథానాయకుడి పేరు కుమార్, అతని జీవితంలో అనూహ్యమైన సంఘటన జరుగుతుంది. ఆ సందర్భాన్ని దృష్టిలో ఉంచుకునే ఈ పేరు నిర్ణయించాం".

"ప్రేక్షకులకు కొత్తదనాన్ని అందించాలనే ప్రయత్నంలో భాగంగానే కేరళ నేపథ్యాన్ని ఎంచుకున్నా. కేరళలోని ఓ కళాశాలలో చిత్రీకరణ చేశాం. అనుకున్నట్టుగా 47 రోజుల్లో షూటింగ్ పూర్తి చేశాం. తొలి సినిమా కదా అనే భయాలు మొదట్లో ఉండేవి, కానీ సినిమా ప్రయాణం మొదలయ్యాక మళ్లీ వెనుదిరిగి చూసుకోలేదు. ఛాయాగ్రాహకుడు నా స్నేహితుడే. తను మంచి సహకారం అందించాడు. కిరణ్ అబ్బవరంలోనూ మంచి రచయిత ఉన్నాడు. ఆయన స్క్రిప్ట్ దశలోనే కొన్ని ఆలోచనల్ని పంచుకున్నారు, ఆ తర్వాత ఎప్పుడూ కథలో జోక్యం చేసుకోలేదు. కథానాయిక పాత్రకీ ఎంతో ప్రాధాన్యం ఉంది. ఆ పాత్రలో యుక్తి తరేజా చాలా బాగా నటించారు. కథానాయకుడికి మావయ్యగా నటించిన నరేశ్, తండ్రిగా నటించిన సాయికుమార్, కథానాయిక పెదనాన్నగా నటించిన మురళీధర్ గౌడ్, అతిథి పాత్రలో మెరిసిన కామ్నా జెఠ్మలానీ, కీలక దశలో వచ్చే వెన్నెల కిశోర్... ఇలా ప్రతి పాత్ర చాలా బాగా పండింది. నిర్మాతలు అందించిన సహకారం మరిచిపోలేనిది. స్వతహాగా నాకు హాస్య ప్రధానమైన కథలంటే ఇష్టం. కథానాయకుడి పాత్రలు హుషారుగా సాగాలి. తదుపరి నేను చేయబోయే సినిమాలు ఆ తరహాలోనే ఉంటాయి. ప్రస్తుతం నా దృష్టంతా 'కె -ర్యాంప్' విడుదలపైనే. దీని తర్వాత కొత్త సినిమా వివరాల్ని వెల్లడిస్తా".

# ఓటీటీలో 'వార్ 2' రికార్డు..

## ఇండియాలోనే అత్యధిక వీక్షణలు సొంతం




సినీ ప్రియులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూసిన భారతీయ సినిమాల్లో 'వార్ 2' ఒకటి. ప్రముఖ నిర్మాణ సంస్థ యశ్‌రాజ్ ఫిల్మ్స్‌బీ స్పై యూనివర్స్‌లో భాగంగా రూపొందిన ఈ ఫ్రాంచైజీలో ఎన్టీఆర్ హృతిక్ రోషన్‌లు నటించారు. కియారా అద్వాణీ కథానాయిక. ఆగస్టులో విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయిన విషయం తెలిసిందే. అయితే, ఓటీటీలో మాత్రం రికార్డు స్థాయిలో వ్యూస్‌ను సొంతం చేసుకుంటోంది. ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి వచ్చింది. తాజాగా ప్రముఖ మీడియా సంస్థ ఆర్మాక్స్ అత్యధిక వీక్షణలు సొంతం చేసుకున్న చిత్రాల జాబితాలో 'వార్ 2' టాప్‌లో ఉన్నట్లు తెలిపింది. అక్టోబర్ 6 నుంచి అక్టోబర్ 12 వరకూ వచ్చిన వీక్షణల ఆధారంగా వెల్లడించినట్లు చెప్పింది. 'వార్ 2'కు అత్యధికంగా 3.5 మిలియన్ల వీక్షణలు వచ్చినట్లు ప్రకటించింది. దీంతో గతవారం ఇండియాలోనే ఎక్కువమంది చూసిన సినిమాగా వార్ 2' నిలిచింది. ఇక థియేటర్‌లో వార్ 2, కూలీ ఒకేసారి విడుదలై పోటీపడ్డాయి. తాజాగా 'కూలీ' హిందీ వెర్షన్ కూడా గత వారం ఓటీటీలో విడుదలైంది. అయితే హిందీలో 'కూలీ'ని 'వార్ 2' అధిగమించింది. అక్టోబరు 9వ తేదీ నుంచి 'వార్ 2' హిందీ, తెలుగు, తమిళ భాషల్లో స్ట్రీమింగ్ కానున్నట్లు తెలిపింది. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించిన ఈ యాక్షన్ థ్రిల్లర్ బాక్సాఫీస్ వద్ద రూ.300 కోట్లు వసూలుచేసినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి.

# ముద్దు సీన్లు.. పేరెంట్స్ సలహాకు షాకయ్యా: సోనమ్ బజ్వా



'బాబు బంగారం' (ఓ పాటలో), 'ఆటాడుకుందాం.. రా' సినిమాలతో తెలుగు ప్రేక్షకులను పలకరించిన పంజాబీ నటి సోనమ్ బజ్వా తాను నటించిన హిందీ సినిమా 'ఏక్ దీవానే కీ దీవానియత్' ప్రమోషన్స్‌లో భాగంగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో.. కెరీర్ ప్రారంభ రోజుల్ని గుర్తుచేసుకున్నారు. కిస్ సీన్ల విషయంలో తన సందేహాన్ని తల్లిదండ్రులకు చెబితే.. వారిచ్చిన సలహా విని షాకయ్యానని తెలిపారు. "ముద్దు సన్నివేశాలున్న కారణంగా నేను పలు హిందీ సినిమాల్లో నటించేందుకు తిరస్కరించా. ఒకవేళ కిస్ సీన్లలో యాక్ట్ చేస్తే పంజాబీ ప్రేక్షకులు నన్ను అంగీకరిస్తారా? ఫ్యామిలీ ఆడియన్స్ ఏమనుకుంటారు? ఇది కేవలం నటనే అని నా కుటుంబం అర్థం చేసుకుంటుందా?.. బుర్ర నిండా ఇలాంటి ఆలోచనలే తిరిగేవి. నాకున్న సందేహాలన్నింటినీ ఓసారి తల్లిదండ్రులకు వివరించగా భారం తగ్గినట్టైంది. 'సినిమా కోసమే కదా అలా చేసేది. దాని వల్ల సమస్య ఏంటి?' అని వారు అనడంతో షాకయ్యా. ఇంతకాలం వీరితో ఈ టాపిక్ గురించి ఎందుకు చర్చించలేదా? అని అనిపించింది" అని సోనమ్ పేర్కొన్నారు. హర్షవర్ధన్ రాణే హీరోగా మిలప్ జవేరి తెరకెక్కించిన రొమాంటిక్ డ్రామా 'ఏక్ దీవానే కీ దీవానియత్' ఈ నెల 21న విడుదల కానుంది. 2016 తర్వాత సోనమ్ బజ్వా టాలీవుడ్‌లో మళ్లీ నటించలేదు. పంజాబీ, హిందీ సినిమాల్లో అవకాశాలు అందుకుంటున్నారు.



# అవసరమైతే నన్ను టార్గెట్ చేయండి

## హర్షిత్ రాణాపై ట్రోలింగ్.. స్పందించిన గంభీర్

త్వరలో ఆస్ట్రేలియా, భారత్ మధ్య 3 వన్డేలు, 5 టీ20ల సిరీస్ జరగనుంది. ఈ రెండు సిరీస్‌లకు టీమ్ఇండియా యువ పేసర్ హర్షిత్ రాణా ను ఎంపిక చేశారు. హర్షిత్ ప్రధాన కోచ్ గంభీర్ కావున కోచ్ తాలుకా ప్లేయర్ అని రెండు సిరీస్‌లకు ఎంపిక చేశారంటూ మాజీ క్రికెటర్ క్రిష్ణమాచారి శ్రీకాంత్ విమర్శించాడు. సోషల్ మీడియాలోనూ రాణాను ట్రోల్ చేస్తున్నారు. వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసిన అనంతరం గంభీర్ విలేకరులతో మాట్లాడాడు. ఈ క్రమంలో హర్షిత్‌పై జరుగుతున్న ట్రోలింగ్ గురించి స్పందించాడు. 23 ఏళ్ల కుర్రాడిని టార్గెట్ చేయడం సిగ్గుచేటని, అవసరమైతే తనని లక్ష్యంగా చేసుకోవాలంటూ ఫైరయ్యాడు.

'యూట్యూబ్ ఛానల్‌ని నడపాలనుకొనే ఓ వ్యక్తి 23 ఏళ్ల కుర్రాడిని టార్గెట్ చేయడం సిగ్గుచేటు. సోషల్ మీడియాలోనూ ట్రోలింగ్ జరుగుతోంది. అలాంటివారి మనస్తత్వాన్ని ఊహించుకోండి. మీరు నన్ను టార్గెట్ చేయాలనుకుంటే చేసుకోండి. నేను దానిని హ్యాండిల్ చేస్తా. కానీ, మీ యూట్యూబ్ వ్యూస్ కోసం యువ ఆటగాడిని ట్రోల్ చేయడం సిగ్గుమాలిన చర్య. అతను తన సొంత అర్హతతో క్రికెట్ ఆడుతున్నాడు. ఇలాంటి యువ క్రికెటర్లను టార్గెట్ చేయకండి' అని గంభీర్ పేర్కొన్నాడు.

రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ 2027 ప్రపంచ కప్ ఆడతారా? అని గంభీర్‌ను ప్రశ్నించగా.. "ప్రపంచ కప్‌నకు ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉంది. కాబట్టి.. ఇప్పుడేం జరుగుతుంది అనే దాని గురించి ఆలోచించాలి. కోహ్లీ, రోహిత్ నాణ్యమైన ఆటగాళ్లు. వీరిద్దరూ ఆస్ట్రేలియా పర్యటనలో రాణిస్తారని ఆశిస్తున్నాం' అని సమాధానమిచ్చాడు. ప్రస్తుతం వన్డేలు మాత్రమే ఆడుతున్న రో-కో ద్వయం ఆసీస్‌తో ఈనెల 19 నుంచి జరగనున్న మూడు వన్డేల సిరీస్‌కు ఎంపికైన సంగతి తెలిసిందే. కంగారులతో టీ20 సిరీస్ అక్టోబర్ 29 నుంచి మొదలుకానుంది.

ఆసీస్‌తో మూడు వన్డేలకు భారత జట్టు: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), అక్షర్ పటేల్, కేఎల్ రాహుల్, నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్‌దీప్ యాదవ్, హర్షిత్ రాణా, సిరాజ్, అర్ష్‌దీప్, ప్రసిద్ధ్ కృష్ణ, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), యశస్వి జైస్వాల్.

## ఆరో బౌలర్‌ను దించాల్సిందే



వరుసగా రెండు ఘనవిజయాలతో ప్రపంచకప్‌ను ఆరంభించింది భారత మహిళల జట్టు. ప్రపంచకప్ కలను నెరవేర్చుకునే దిశగా అడుగులు సరిగానే పడుతున్నాయనుకున్నారు అభిమానులు. కానీ దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా రూపంలో బలమైన జట్లు ఎదురు కాగానే భారత్ విజయాలకు దూరమైంది. ఈ రెండు జట్లపై భారత్ బాగా ఆడలేదని చెప్పలేం. కాపాడుకోదగ్గ లక్ష్యాలనే ప్రత్యర్థులకు నిర్దేశించినా.. మధ్యలో బౌలర్లు విఫలమవడంతో ఓటములు తప్పలేదు. 252 పరుగుల ఛేదనలో 85కే అయిదు వికెట్లు కోల్పోయి కూడా దక్షిణాఫ్రికా గెలిచింది. ఆస్ట్రేలియా 331 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించి పడేసింది. ఈ రెండు మ్యాచ్‌ల్లో ఆరో బౌలర్ లేని లోటు స్పష్టంగా కనిపించింది.

కెప్టెన్ హర్మన్‌ప్రీత్ తన స్పిన్‌తో ఓ చేయి వేసినా పెద్దగా ఫలితం లేకపోయింది. బ్యాటింగ్‌ను బలోపేతం చేసేందుకు బౌలర్లను అయిదుగురికే పరిమితం చేయడంతో ప్రత్యామ్నాయాలు తగ్గిపోయాయి. ప్రధాన బౌలర్లలో ఒకరిద్దరు విఫలమైనా.. ఇంకొకరికి బంతి అందించే అవకాశం లేకపోయింది. ఈ నేపథ్యంలో ఇంగ్లాండ్‌తో ఆదివారం జరిగే తర్వాతి మ్యాచ్‌కు అదనపు బౌలర్‌ను తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రపంచకప్‌లో పేసర్ల కంటే స్పిన్నర్లే ఎక్కువ ప్రభావం చూపిస్తున్నారు. భారత జట్టులోనూ స్పిన్నర్ల ఆధిపత్యమే సాగుతోంది. తెలుగమ్మాయి శ్రీచరణితో పాటు దీప్తి శర్మ, స్నేహ్ రాణా నిలకడగా వికెట్లు తీస్తున్నారు. కానీ పేసర్లు ధారాళంగా పరుగులిచ్చేస్తున్నారు. ఆస్ట్రేలియాపై క్రాంతి గౌడ్, అమన్‌జ్యోత్ కలిసి 18 ఓవర్లలో 141 పరుగులు సమర్పించుకోగా.. చరణి, దీప్తి కలిసి 20 ఓవర్లలో 93 పరుగులే ఇచ్చారు. మరో స్పిన్నర్ స్నేహ్ కూడా మెరుగ్గానే బౌలింగ్ చేసినా.. వీరితో పోలిస్తే ఎక్కువ పరుగులిచ్చింది.

ఇండోర్ కూడా స్పిన్‌కు అనుకూలించే మైదానమే కావడంతో తర్వాతి మ్యాచ్‌కు స్పిన్ ఆల్‌రౌండర్ రాధ యాదవ్‌ను తుది జట్టులోకి తీసుకునేందుకు ఆస్కారముంది. ఆమె కోసం బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ తన స్థానాన్ని త్యాగం చేయాల్సి రావచ్చు. ఆరో బౌలర్‌ను ఎంచుకోవడంపై కోచ్ అమోల్ మజుందార్ కూడా సంకేతాలు ఇచ్చాడు. "ఆస్ట్రేలియాతో మ్యాచ్ తర్వాత అయిదుగురు బౌలర్ల కూర్పుపై మేం ఒకసారి పరిశీలన జరపాలి. దీనిపై జట్టు యాజమాన్యంలో చర్చ జరుగుతుంది. తర్వాతి మ్యాచ్‌కు కూర్పు పరంగా సరైన నిర్ణయమే తీసుకుంటాం" అని మజుందార్ అన్నాడు.




## 'పారిస్' పతక విజేతలకు నజరానా అందజేత

దిల్లీ: పారిస్ ఒలింపిక్స్(2024)లో పతకాలు సాధించిన అథ్లెట్లను సోమవారం భారత ఒలింపిక్ సంఘం సన్మానించి, వారికి నగదు ప్రోత్సాహకాలు అందజేసింది. జావెలిన్ త్రోలో రజతం నెగ్గిన నీరజ్ చోప్రా విదేశాల్లో ఉండటంతో ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు. అతడి తరపున రూ. 75 లక్షల చెక్‌ను భారత అథ్లెటిక్స్ సమాఖ్య అధికారి అందుకున్నాడు. వ్యక్తిగత విభాగంలో కాంస్యం నెగ్గిన మను బాకర్‌కు రూ. 50 లక్షలు.. మిక్స్‌డ్ విభాగంలో కాంస్యం సొంతం చేసుకున్న మను, సరబ్‌జోత్‌లకు చెరో రూ. 25 లక్షలు లభించాయి. కాంస్యం నెగ్గిన అమన్ సెహ్రావత్ (రెజ్లింగ్), స్వప్నిల్ కుశాలె (షూటింగ్)లకు రూ. 50 లక్షల చొప్పున దక్కాయి. కాంస్యం సొంతం చేసుకున్న హాకీ జట్టులో ప్రతి సభ్యుడు రూ. 10 లక్షలు అందుకున్నాడు.

## కోహ్లీ మూడు మ్యాచ్‌ల్లో రెండు సెంచరీలు చేస్తాడు: హర్భజన్



టీ20లు, టెస్టులకు వీడ్కోలు పలికినస్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ రోహిత్ శర్మ త్వరలో ఆస్ట్రేలియాతో జరగనున్న మూడు వన్డేల సిరీస్‌తో రీ ఎంట్రీ ఇవ్వనున్నారు. 2027 వన్డే ప్రపంచ కప్ ఆడాలనుకుంటున్న రో-కో ద్వయానికి ఆసీస్ సిరీస్ కీలకం కానుంది. ఈ నేపథ్యంలో భారత మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ మాట్లాడాడు. రోహిత్ కోహ్లీ ఆటను చూడటానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని తెలిపాడు. ఫిట్‌నెస్ విషయంలో విరాట్‌కు తిరుగులేదన్నాడు.

'కోహ్లీ ఫిట్‌నెస్ గురించి ఎటువంటి ఆందోళన అవసరం లేదు. ఈ విషయంలో అతను ఎంతో పర్‌ఫెక్ట్. ప్రస్తుతం అతనితో కలిసి ఆడుతున్న వారిలో చాలా మంది కంటే ఫిట్‌గా ఉన్నాడు. ప్రస్తుతం అంతర్జాతీయ క్రికెట్‌లో కోహ్లీ ఫిటెస్ట్ ప్లేయర్ అని నిస్సందేహంగా చెప్పొచ్చు. అతని ఆట కోసం ఎదురుచూస్తున్నా. విరాట్ మరింత కాలం వన్డేల్లో కొనసాగాలని కోరుకుంటున్నా. ఆస్ట్రేలియా కోహ్లీకి ఇష్టమైన ప్రదేశం. అక్కడ టన్నుల కొద్దీ పరుగులు రాబట్టాడు. మరోసారి రాణిస్తాడని నమ్మకంగా ఉన్నా. మూడు మ్యాచ్‌ల్లో కనీసం రెండు సెంచరీలు చేస్తాడని ఆశిస్తున్నా. రోహిత్ కూడా మంచి ప్రదర్శన చేసి జట్టు విజయానికి తోడ్పడాలని కోరుకుంటున్నా' నని భజ్జీ పేర్కొన్నాడు.ఆస్ట్రేలియా గడ్డపై కోహ్లీ 29 వన్డేలు ఆడిన విరాట్ 51.03 సగటుతో 1,327 పరుగులు చేశాడు. ఇందులో ఐదు సెంచరీలు, ఆరు అర్ధ శతకాలున్నాయి.

## విండీస్‌పై రెండో టెస్టులో విజయం.. సిరీస్ క్లీన్‌స్వీప్ చేసిన భారత్



దిల్లీ: వెస్టిండీస్‌తో జరిగిన రెండో టెస్టులో భారత్ ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. దీంతో రెండు టెస్టుల సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. 121 పరుగుల లక్ష్యఛేదనలో 63/1తో ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన టీమ్ఇండియా మరో రెండు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. కేఎల్ రాహుల్ (58లిబీ 108 బంతుల్లో.. ఓవర్‌నైట్ స్కోరు 25) హాఫ్ సెంచరీతో మెరిశాడు. సాయి సుదర్శన్ (39బీ 76 బంతుల్లో) ఓవర్‌నైట్ స్కోరుకు మరో 9 పరుగులు జోడించి ఔటయ్యాడు. స్లిప్‌లో షై హోప్ స్టన్నింగ్ క్యాచ్ (రోస్టన్ ఛేజ్ బౌలింగ్) అందుకోవడంతో సుదర్శన్ వెనుదిరిగాడు. శుభ్‌మన్ గిల్ (13బీ 15 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) కూడా ఛేజ్ బౌలింగ్‌లోనే గ్రీవ్స్‌కు చిక్కాడు. ధ్రువ్ జురెల్ (6లి) నాటౌట్‌గా నిలిచాడు. యశస్వి జైస్వాల్ (8)ని వారికన్ నాలుగో రోజే ఔట్ చేసిన సంగతి తెలిసిందే.తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 518/5 వద్ద డిక్లేర్ చేసింది.

యశస్వి జైస్వాల్ (175), శుభ్‌మన్ గిల్ (129లి), ధ్రువ్ జురెల్ (44), నితీశ్ రెడ్డి (43) అదరగొట్టారు. కుల్‌దీప్ యాదవ్ (5/82), జడేజా (3/46) విజృంభించడంతో ఫస్ట్ ఇన్నింగ్స్‌లో విండీస్ 248 పరుగులకే కుప్పకూలి 270 పరుగుల లోటుతో ఫాలో ఆన్‌లో పడింది. రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం కరేబియన్ జట్టు గొప్పగా పోరాడింది.

కాంప్‌బెల్ (115), షై హోప్ (103) సెంచరీలకు తోడు జస్టిన్ గ్రీవ్స్ (50లి), రోస్టన్ ఛేజ్ (40), జైడెన్ సీల్స్ (32) రాణించడంతో 390 పరుగులకు ఆలౌటైంది.

వెస్టిండీస్‌పై భారత్‌కు ఇది వరుసగా పదో టెస్టు సిరీస్ విజయం. కుల్‌దీప్ యాదవ్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, రవీంద్ర జడేజా ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచారు.




## హరియాణా అయిదు మ్యాచ్‌ల తర్వాత

దిల్లీ: డిఫెండింగ్ ఛాంపియన్ హరియాణా స్టీలర్స్ ఎట్టకేలకు పరాజయ బాట వీడింది. అయిదు ఓటముల తర్వాత విజయాన్ని అందుకుంది. సోమవారం మ్యాచ్‌లోనూ ఒక దశలో ఓడేలా కనిపించిన ఆ జట్టు అసాధారణంగా పుంజుకుని 39-32తో పట్నా పైరేట్స్‌ను ఓడించింది. డిఫెండర్ జైదీప్ దహియా (6), రెయిడర్ శివమ్ పటారె (12) చెలరేగి హరియాణాకు విజయాన్ని అందించారు. ప్రథమార్ధంలో 14-20తో వెనకబడిన హరియాణా సమష్టిగా రాణించి విజయాన్ని అందుకుంది. పట్నా జట్టులో అయాన్ లోహ్‌చబ్స్ 17 పాయింట్లు సాధించినా ఆ జట్టుకు ఓటమి తప్పలేదు. మరో మ్యాచ్‌లో యూపీ యోధాస్ 40-24తో యు ముంబాను ఓడించింది. గమన్ సింగ్ (12) యూపీ జట్టును విజయపథంలో నడిపాడు.

# 15 వేలకు పైగా రోడ్లపై గుంతలు పూడ్చివేత




* నగర వ్యాప్తంగా మిషన్ మోడ్ లో రోడ్డు సేఫ్టీ డ్రైవ్
* డే, నైట్ కొనసాగుతున్న పనులు

హైదరాబాద్, అక్టోబర్ 14 (భారత శక్తి): గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా ట్రాఫిక్ జామ్ లు లేకుండా, నగర పౌరుల ప్రయాణం సజావుగా జరిగేలా చూసేందుకు ఉద్దేశించిన రోడ్డు సేఫ్టీ డ్రైవ్ ముమ్మరంగా సాగుతుంది.వర్షాలు తగ్గుముఖం పట్టడంతో జీహెచ్ఎంసీ రోడ్డు సేఫ్టీ డ్రైవ్ మరింత వేగిరం చేసింది. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ వంద శాతం గుంతలు పూడ్చడం పై ప్రత్యేక దృష్టి పెట్టారు.రోడ్డు భద్రత చర్యలలో భాగంగా గుంతల పూడ్చివేత పనులు, క్యాచ్ పిట్ రిపేర్‌లు, రోడ్ల మరమ్మత్తు పనులు, ప్యాచ్ వర్క్ పనులు, కవర్ రీప్లేస్‌మెంట్ లు, సెంట్రల్ మీడియన్ మరమ్మతులు నిరంతరంగా కొనసాగుతున్నాయి. కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఆదేశాల మేరకు మేరకు జీహెచ్ఎంసీ మెయింటెన్స్ చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్ క్షేత్ర స్థాయిలో డ్రైవ్ ను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తున్నారు.

**అక్టోబర్ 13వ తేదీ నాటికీ**

నగరంలో మొత్తం 17,348 గుంతలు గుర్తించడం జరిగింది. వాటిలో 15,074 గుంతలకు మరమ్మతులు చేయడం జరిగింది. ఇప్పటి వరకు 788 క్యాచ్ పిట్స్ రిపేర్‌లు, 382 కవర్ రీప్లేస్‌మెంట్ లు,18 సెంట్రల్ మీడియన్ మరమ్మతులు పూర్తి అయ్యాయి.

**జోన్ల వారీగా వివరాలు:**

ఎల్.బి.నగర్ జోన్‌లో 2,901 గుంతలను, చార్మినార్ జోన్‌లో 2,328 ,ఖైరతాబాద్ జోన్‌లో 2,195, శేరిలింగంపల్లి జోన్‌లో 1,661, కూకట్‌పల్లి జోన్‌లో 2,419,సికింద్రాబాద్ జోన్‌లో 3,570 మొత్తం 15,074 గుంతలను పూడ్చడం జరిగింది. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో, నగర ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా , ట్రాఫిక్ జామ్ లు కాకుండా రోడ్డు మరమ్మత్తు పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ తెలిపారు.



# కాలనీవాసుల సమస్యలు తెలుసుకున్న కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి

ఎల్బీనగర్, అక్టోబర్ 14 (భారత శక్తి): హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి డివిజన్లోని ఆటో సాయి నగర్ కాలనీలో పర్యటించి కాలనీవాసుల సమస్యలు తెలుసుకున్నారు, ఈ సందర్భంగా కాలనీవాసులు కాలనీలో ఉన్నటువంటి శానిటేషన్, భూగర్భ డ్రైనేజ్, సీసీ రోడ్ల సమస్యను కార్పొరేటర్ కి వివరించడంతో వారు స్పందించి ఆటో సాయి నగర్ కాలనీలో ఉన్నటువంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు వారు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఈ హేము నాయక్, కాలనీ అధ్యక్షులు మాధవ రెడ్డి, బిజెపి మహిళా మోర్చా సీనియర్ నాయకులు పార్వతి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు..



# జర్నలిస్టులూ... సమిష్టిగా ఉండండి– సమస్యలపై పోరాడండి

* టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య

తుంగతుర్తి, అక్టోబర్ 14 (భారత శక్తి): తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ సభ్యులంతా సమన్వయంతో సమిష్టిగా ఉండాలని, జర్నలిస్టుల సమస్యలపై పోరాడాలని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య పిలుపునిచ్చారు. టీడబ్ల్యూజేఎఫ్ సూర్యాపేట జిల్లా సంయుక్త కార్యదర్శి వంగాల వెంకన్న ఆహ్వానం మేరకు రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం, వల్లాల జగన్, బండి విజయ్ కుమార్ తదితరులు మంగళవారం తుంగతుర్తిలో జరిగిన సమావేశానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ,సూర్యాపేట జిల్లా కమిటీలలో ఉన్న బాధ్యులు, సభ్యులు యూనియన్ నియమ నిబంధనలకు లోబడి పని చేయాలని, అదే విధంగా బాధ్యతతో వ్యవరించి స్థానిక జర్నలిస్టుల సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు.



అందరు ఐక్యతతో హక్కుల సాధనకు కృషి చేయాలని కోరారు. వృత్తిలో నైపుణ్యతను, పనిలో పట్టుదలను పెంపొందించుకొని, క్రమశిక్షణతో కర్తవ్యాలను నెరవేర్చి సంఘం ప్రతిష్టలను పెంచాలని ఆయన కోరారు. సంఘం బాధ్యులెవరైనా సరే ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ, తప్పులు చేసి సంఘం పరువు తీస్తే ఉపేక్షించేది లేదని, అలాంటి వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గుండగాని జమున, గుండగాని రాము, ఇరుగు సైదులు, గుండ గాని రామకృష్ణ, ఎస్కే దస్తగిరి, అక్కినపల్లి రాములు, గుండగాని క్రాంతి, బండి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ కేసులు

## ఎన్ని రకాలు ఉంటాయో తెలుసా..?

**- ఈ రెండు రకాలుగా ఉంటాయి..**

హైదరాబాద్, అక్టోబర్ 14 (భారత శక్తి) : యాంటీ కరప్షన్ బ్యూరో కేసులు రెండు రకాలుగా ఉంటాయి.. ఒకటి లంచం తీసుకుంటుండగా అక్కడికక్కడే పట్టుకోవడం.. అంటే రెడ్ హ్యాండెడ్ గా పట్టుకోవడం .. ఈ ప్రక్రియలో లంచం ఇచ్చే వ్యక్తి సరిగ్గా డబ్బు ఇస్తున్నప్పుడు, లేదా తీసుకున్న అధికారి చేతిలో డబ్బు ఉండగానే సినిమాల్లోలా సడెన్ ఎంట్రీ ఇచ్చి అధికారులు పట్టుకుంటారు. పట్టుకున్నది లంచం డబ్బే అని గుర్తించడానికి వీలుగా, ముందుగానే ఆ కరెన్సీ అనగా నోట్లపై ఒక రసాయనం / పౌడర్ చల్లుతారు. ఆ రసాయనం చల్లిన డబ్బునే ఎరగా వేసి సదరు వ్యక్తి కి లంచంగా ఇస్తారు... సరిగ్గా లంచం తీసుకున్న వ్యక్తి డబ్బు చేతులో ఉన్నప్పుడు పట్టుకుని అరెస్టు చేసిన తరువాత రంగు నోట్లను పట్టుకున్న అతని చేతులు కడిగితే వచ్చే రంగు నీళ్లను రెండు మూడు సీసాలలో నింపి సాక్ష్యంగా న్యాయస్థానికి అప్పజెబుతారు.. ఇలా పట్టుకునే వాటిని ట్రాప్ కేసులు అంటారు. అధికారుల అవినీతితో విసిగిపోయిన వ్యక్తులు ఫిర్యాదు చేసినప్పుడు, వారి ద్వారా ఆ అధికారిని ట్రాప్ చేసి పట్టుకుంటారు కాబట్టి దీనికాపేరు వచ్చింది.. ఇక రెండో రకం ఆదాయానికి మించిన ఆస్తులపై కేసు నమోదు చేయడం.. విపరీతంగా అవినీతి చేసి ఆస్తులు కూడబెట్టిన వారి కూపీలాగుతారు ఏసీబీ అధికారులు. వాళ్ల గురించి ఆరాతీసి, అధ్యయనం చేసి, వారి ఇంటిపై, ఇంకా బంధువులు, స్నేహితులు, బినామీల ఇంటిపై ఒకేసారి తనిఖీలకు వెళ్తారు. వాళ్ల ఇళ్లల్లో దొరికిన పత్రాలు, బంగారం, డబ్బు అన్నీ స్వాధీనం చేసుకుంటారు. తరువాత వారి జీతం, ఇతర అధికారిక ఆదాయాలూ అన్నీ లెక్కవేసి, అంతకంటే ఎక్కువ ఉంటే అది ఎలా వచ్చిందో ఆరాతీసి, దానికి సరైన కారణం దొరక్కపోతే ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలతో కేసు పెడతారు.




# అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన డాక్యుమెంట్లను వెంటనే రద్దు చేయాలి

ఎల్బీనగర్, అక్టోబర్ 14 (భారత శక్తి): వినియోగంలో ఉన్న పార్కును కబ్జా చేసేందుకు చూసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరిన స్థానిక జిహెచ్ఎంసి బి.ఎన్.రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి. బి.యన్ రెడ్డి నగర్ పరిధిలోని శ్రీపురం కాలనీలో వినియోగంలో ఉన్న శ్రీ చత్రపతి శివాజీ పార్కును అక్రమంగా కొంతమంది ప్రైవేటు వ్యక్తులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని అట్టి రిజిస్ట్రేషన్ లను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని వారి కార్యాలయంలో బి.యన్. రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కాలనీవాసులతో కలసి వినతి పత్రం అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జిహెచ్ఎంసి పరిధిలోని బి.యన్.రెడ్డి నగర్ డివిజన్లో శ్రీపురం కాలనీ ఉంది. రంగారెడ్డి జిల్లా హయత్ నగర్ మండలం సాహెబ్ నగర్ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 200 లో ఈ కాలనీ ఉంది. 1967లో కాలనీ లేఅవుట్ ఏర్పాటు చేసిన సందర్భంలో సుమారు 5000 గజాల స్థలాన్ని పార్కు కోసం మరియు కొన్ని చోట్ల కమిటీ హాల్ కోసం, క్రీడా ప్రాంగణం కోసం స్థలాలను వదిలి పెట్టడం జరిగింది. అందులో భాగంగా పార్కు స్థలములో ప్రభుత్వం నుంచి లక్షల రూపాయలు వెచ్చించి పార్కు స్థలమును అభివృద్ధి చేయడం జరిగింది. అట్టి స్థలములను కొందరు వ్యక్తులు వనస్థలిపురం ఇంచార్జ్ సబ్ రిజిస్టర్ తో కలిసి అక్రమంగా తప్పుడు పత్రాలు సృష్టించి వనస్థలిపురం సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందని, కావున ఇట్టి రిజిస్ట్రేషన్ పత్రాలను వెంటనే రద్దు చేసి కాలనీ వాసులకు న్యాయం చేయాలని మరియు తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసిన ఇంచార్జ్ సబ్ రిజిస్టర్ పైన రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తుల పైన చట్టపరమైన, న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరడం జరిగింది. స్పందించిన మంత్రి త్వరలోనే సంబంధిత వ్యక్తులపై ఇంచార్జ్ సబ్ రిజిస్టర్ పైన పూర్తి విచారణ జరిపించి న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు కాల్వ శ్రీధర్ రెడ్డి, పాశం విట్టల్ రెడ్డి, కల్లు విష్ణు వర్ధన్ రెడ్డి,కండె రాజేందర్, చిగురింత శ్రీధర్ రెడ్డి, జెల్ల రాములు తదితరులు ఉన్నారు.



## కామారెడ్డి నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షునిగా

# రెండవసారి కైలాస్ శ్రీనివాసరావును ఎన్నిక చేయాలని ఏకగ్రీవ తీర్మానం

కామారెడ్డి జిల్లా, అక్టోబర్ 14(భారత శక్తి ప్రతినిధి) : కామారెడ్డి నియోజకవర్గం నుండి డిసిసి అధ్యక్షునిగా తిరిగి కైలాస్ శ్రీనివాసరావును ఎన్నిక చేయాలని కాంగ్రెస్ నాయకులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ పార్టీని ప్రక్షాళన చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుని ఎన్నిక కోసం కామారెడ్డి నియోజకవర్గ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం కామారెడ్డి పట్టణ ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో నిర్వహించారు.

* **అధ్యక్ష పదవి కోరుకునే వారి ద్వారా దరఖాస్తులకు ఆహ్వానించారు.**

ఏఐసిసి అబ్జర్వర్ రాజ్ పాల్ కరోల ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ గ పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు నియోజకవర్గ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి మండల అధ్యక్షులు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జిల్లా అనుబంధ సంఘ అధ్యక్షులు గ్రామ అధ్యక్షులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాన్ని స్వీకరించారు.

మండల అధ్యక్షులు ,జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, గ్రామ అధ్యక్షులు ఏకగ్రీవంగా కైలాస్ శ్రీనివాస్ రావు గారి పేరును తీర్మానం చేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ గారు మాట్లాడుతూ కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీని ముందుకు నడిపించిన కైలా శ్రీనివాసరావు గారికితిరిగి నియమించాలని నియోజకవర్గం మొత్తం కోరింది. కైలాస్ శ్రీనివాసరావు గారికి మార్చాలని నిర్ణయిస్తే ప్రభుత్వం ఏదైనా మంచి అవకాశం కల్పించిన తర్వాతే ఆయనను మారుస్తాం.సంఘటన్ సృజన్ అభియాన్ దేశవ్యాప్త కార్యక్రమం ఇది పార్టీని పటిష్టం చేయడానికి పార్టీ కోసం కష్టపడే వారిని గుర్తించి వారికి పదవులు ఇవ్వడానికి దేశవ్యాప్తంగా యువత, మహిళలు, అన్నగారిన వర్గాల గొంతుక వినిపించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుంది.కాంగ్రెస్ ప్రజల కోసం పోరాడుతుంది అని చెప్పారు. ఏఐసిసి అబ్జర్వర్ రాజ్ పాల్ కరోల మాట్లాడుతూ, పార్టీ సిద్ధాంతం కులం, మతం సంబంధం లేకుండా సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని అందరిని కలుపుకుని పోతుందని ఆయన చెప్పారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గము తాలూకా, మునిసిపాలిటీ, మునిసిపల్ వార్డులను సందర్శించి, అట్టడుగు స్థాయి కార్యకర్తలతో సంప్రదించి, కొత్త స్థానిక నాయకులను నియమిస్తారు. యువకులు, విద్యావంతులు, సైద్ధాంతిక నిబద్ధత కలిగిన వ్యక్తులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. అది ఒక్కరి అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకుంటాం, మా పర్యటన తర్వాత నియామకాలను ఖరారు చేయడానికి రాష్ట్ర నాయకత్వానికి నివేదికలు సమర్పించబడతాయి. రాజ్యాంగ విలువలు, రాజ్యాంగాన్ని కాపాడే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ,నాలుగు నియోజకవర్గాల అభిప్రాయాలు తీసుకుని ఎవరైనా అధ్యక్ష పదవి కావాలనుకునే వారు తమ దరఖాస్తులను సమర్పించాలని కోరారు. అందరూ పాతవారినే కోరుకుంటే తిరిగి ఆయనని ఎన్నుకునే అవకాశం కూడా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు కైలాస్ శ్రీనివాసరావు, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మహమ్మద్ ఇలియాస్, చంద్రకాంత్ రెడ్డి, జిల్లాలోని పలు మండలాధ్యక్షులు జిల్లా అనుబంధ సంఘల అధ్యక్షులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# భారత్‌లో మసకబారుతున్న సూర్యుడు.. సౌరశక్తి లక్ష్యాలకు కాలుష్యం దెబ్బ!

ఢిల్లీ, అక్టోబర్ 14 (భారత శక్తి): సౌరశక్తి రంగంలో ప్రపంచంలోనే అగ్రగామిగా నిలవాలని లక్ష్యంగా పెట్టుకున్న భారతదేశానికి ఒక కొత్త సవాలు ఎదురవుతోంది. గత మూడు దశాబ్దాలుగా దేశవ్యాప్తంగా సూర్యరశ్మి భూమిని తాకే సమయం (ఎండ గంటలు) క్రమంగా తగ్గుతున్నట్లు భారత శాస్త్రవేత్తల తాజా అధ్యయనంలో వెల్లడైంది. వాయు కాలుష్యం, మేఘాలు, స్థానిక వాతావరణ పరిస్థితులే ఈ మార్పునకు ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. ఈ పరిణామం దేశ సౌరశక్తి లక్ష్యాలతో పాటు వ్యవసాయ రంగంపైనా తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగురు భారతీయ శాస్త్రవేత్తలు కలిసి నిర్వహించిన ఈ అధ్యయన వివరాలు ప్రఖ్యాత 'సైంటిఫిక్ రిపోర్ట్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. బనారస్ హిందూ యూనివర్సిటీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియోరాలజీ, భారత వాతావరణ శాఖకు చెందిన శాస్త్రవేత్తలు 1988 నుంచి 2018 మధ్య కాలంలో దేశంలోని 20 వాతావరణ కేంద్రాల నుంచి సేకరించిన డేటాను విశ్లేషించారు. ఈశాన్య రాష్ట్రాల్లో స్వల్ప మినహాయింపులు ఉన్నప్పటికీ, దేశంలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో ఏటా సూర్యరశ్మి గంటలు తగ్గుతున్నట్లు ఈ పరిశోధనలో తేలింది. ముఖ్యంగా ఉత్తర భారతదేశంలోని అమృత్‌సర్, కోల్‌కతా వంటి నగరాలతో పాటు, హిమాలయ ప్రాంతాలు, ముంబై వంటి పశ్చిమ తీర ప్రాంతాల్లో ఈ తగ్గుదల అత్యధికంగా ఉన్నట్లు గుర్తించారు. గాలిలో తేలియాడే అతి సూక్ష్మ ధూళి కణాలు (ఏరోసోల్స్) ఈ సమస్యకు మూల కారణంగా ఉన్నాయి. పరిశ్రమలు, వాహనాల నుంచి వెలువడే పొగ, పంట వ్యర్థాలను కాల్చడం వల్ల వాతావరణంలోకి చేరే ఈ కణాలు సూర్యరశ్మిని నేరుగా భూమిని చేరకుండా అడ్డుకుంటున్నాయి. "ఈ ఏరోసోల్స్ వల్ల మేఘాలు ఎక్కువసేపు వర్షించకుండా నిలిచిపోతున్నాయి. ఫలితంగా అవి సూర్యరశ్మిని మరింతగా అడ్డుకుంటున్నాయి" అని అధ్యయన బృందంలోని బనారస్ హిందూ యూనివర్సిటీ ప్రొఫెసర్ మనోజ్ కుమార్ శ్రీవాస్తవ తెలిపారు. ఈ పరిస్థితి దేశ సౌర విద్యుత్ ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఐఐటీ కాన్పూర్ శాస్త్రవేత్త సచ్చిదానంద్ త్రిపాఠి ప్రకారం, వాయు కాలుష్యం కారణంగా సోలార్ ప్యానెళ్ల సామర్థ్యం ఇప్పటికే గరిష్ఠంగా 41% వరకు తగ్గుతోంది. దీనివల్ల ఏటా 245 మిలియన్ల నుంచి 835 మిలియన్ డాలర్ల మేర విద్యుత్ ఉత్పత్తికి నష్టం వాటిల్లుతోంది. ఇదే సమయంలో దేశంలోని అత్యంత కలుషిత ప్రాంతాల్లో వరి, గోధుమ వంటి పంటల దిగుబడి 36% నుంచి 50% వరకు పడిపోవడానికి కూడా ఈ కాలుష్యమే కారణమని ఆయన వివరించారు. 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధనాన్ని ఉత్పత్తి చేయాలన్న భారత్ లక్ష్యానికి తగ్గుతున్న సూర్యరశ్మి గంటలు పెద్ద అడ్డంకిగా మారే అవకాశం ఉంది. ప్రపంచంలోని ఇతర దేశాలైన యూరప్, చైనాలు కూడా గతంలో ఇలాంటి సమస్యను ఎదుర్కొన్నాయి. అయితే కఠినమైన కాలుష్య నియంత్రణ చట్టాల ద్వారా యూరప్ ఈ సమస్యను అధిగమించి మళ్లీ సూర్యరశ్మిని పొందగలిగింది. భారత్ కూడా కాలుష్యాన్ని నియంత్రించడంలో విఫలమైతే, సౌరశక్తి ప్రణాళికలు నీరుగారిపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## గ్రూప్2 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 18న నియామక పత్రాలు

హైదరాబాద్, అక్టోబర్ 14 (భారత శక్తి): గ్రూప్ 2 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 18న నియామకపత్రాలు ఇవ్వనున్నారు. ఈ నెల 18న సాయంత్రం శిల్పకళా వేదికలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాలు ప్రదానం చేయనున్నారు. టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్2 నియామక ప్రక్రియలో 783 మంది ఎంపికయ్యారు. సాధారణ పరిపాలన, రెవెన్యూ, వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, పంచాయతీరాజ్, తదితర 16శాఖల్లో వివిధ ఉద్యోగాలకు వీరిని ఎంపిక చేశారు. గ్రూప్ 2 ఉద్యోగాల నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం ఏర్పాట్లపై సీఎస్ రామకృష్ణరావు సమీక్ష నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను సీఎస్ ఆదేశించారు. సుమారు 30 ఏళ్ల పాటు సర్వీసులో ఉండనున్నందున.. ప్రభుత్వ ఉద్యోగం పట్ల ఉన్నత భావన కలిగేలా కార్యక్రమం నిర్వహించాలని సీఎస్ పేర్కొన్నారు. సమావేశంలో డీజీపీ శివధర్ రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు వికాస్ రాజ్, బీఎండీ ఎక్కా, రిజ్వి, సందీప్ కుమార్ సుల్తానియా, లోకేష్ కుమార్, టీకే శ్రీదేవి, ఆర్.వి.కర్ణన్, ప్రియాంక, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసు: ఐక్లౌడ్ పాస్‌వర్డ్ ఇవ్వాల్సిందే.. ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టు ఆదేశం

హైదరాబాద్, అక్టోబర్ 14 (భారత శక్తి): తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ టి. ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆయన తన ఐక్లౌడ్ సహా ఇతర క్లౌడ్ ఖాతాల ఐడీ, పాస్‌వర్డ్‌లను ప్రత్యేక దర్యాప్తు బృందానికి (సిట్) తప్పనిసరిగా అందించాలని మంగళవారం స్పష్టం చేసింది. ఈ కేసులో ఆయన అరెస్ట్‌పై మధ్యంతర రక్షణను పొడిగిస్తూనే, దర్యాప్తునకు పూర్తిగా సహకరించాలని ఆదేశించింది. తాను తన ఐక్లౌడ్ ఖాతా పాస్‌వర్డ్‌ను మర్చిపోయానని, అది చాలా పాతదని ప్రభాకర్ రావు తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దీనిపై స్పందించిన జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం, సిట్ ఎప్పుడు పిలిచినా ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో పాస్‌వర్డ్‌ను రీసెట్ చేసి, యాక్టివేట్ చేయాలని ఆదేశించింది. విచారణ బృందానికి అవసరమైన పూర్తి సమాచారాన్ని అందించాలని స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ప్రభాకర్ రావు దర్యాప్తునకు సహకరించకపోవడం వల్ల కేసులో పురోగతి లేదని తెలిపారు. ఆయన తన డివైజ్‌లను ఫార్మాట్ చేసి కీలకమైన ఎలక్ట్రానిక్ ఆధారాలను నాశనం చేశారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే, ఈ ఆరోపణలను ప్రభాకర్ రావు తరఫు న్యాయవాది డి.ఎస్. నాయుడు ఖండించారు. తన క్లయింట్ వ్యక్తిగత ఐక్లౌడ్ పాస్‌వర్డ్ మినహా అడిగిన అన్ని వివరాలనూ సిట్‌కు ఇచ్చారని, ఇప్పటికే 11 సార్లు విచారణకు హాజరై 18 గంటల పాటు ప్రశ్నలకు సమాధానమిచ్చారని తెలిపారు. భద్రతా నిబంధనల ప్రకారమే డిపార్ట్‌మెంట్ కంప్యూటర్ నిపుణులు డేటాను తొలగించారని, అందులో తన క్లయింట్ పాత్ర లేదని వివరించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభాకర్ రావు నేతృత్వంలోని ప్రత్యేక బృందం ప్రతిపక్ష నేతలు, వ్యాపారులు, జర్నలిస్టులు, చివరికి న్యాయమూర్తుల ఫోన్లను కూడా అక్రమంగా ట్యాపింగ్ చేసిందన్నది ప్రధాన ఆరోపణ. 2023 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమి తర్వాత ప్రభాకర్ రావు తన పదవికి రాజీనామా చేసి అమెరికా వెళ్లారు. ఈ కేసు వెలుగులోకి రావడంతో ఆయన పేరు నిందితుల జాబితాలో చేరింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో జూన్ 8న భారత్‌కు తిరిగి వచ్చి విచారణను ఎదుర్కొంటున్నారు.

## విశాఖలో గూగుల్ ఏఐ సెంటర్... సుందర్ పిచాయ్ పోస్టుకు బదులిచ్చిన ప్రధాని మోదీ

ఢిల్లీ, అక్టోబర్ 14 (భారత శక్తి): ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో టెక్ దిగ్గజం గూగుల్ తన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) హబ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇది 'వికసిత భారత్' నిర్మాణ దార్శనికతకు అనుగుణంగా ఉందని ఆయన అన్నారు. ఈ ప్రాజెక్టుపై గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో చేసిన పోస్టుకు ప్రధాని మోదీ మంగళవారం బదులిచ్చారు. "చైతన్యవంతమైన నగరం విశాఖపట్నంలో గూగుల్ ఏఐ హబ్ ప్రారంభించడం పట్ల చాలా సంతోషంగా ఉంది" అని ప్రధాని తన పోస్టులో పేర్కొన్నారు. గిగావాట్ స్థాయి డేటా సెంటర్ మౌలిక సదుపాయాలతో కూడిన ఈ భారీ పెట్టుబడి, సాంకేతికతను అందరికీ అందుబాటులోకి తీసుకురావడంలో శక్తివంతమైన చోదకశక్తిగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇది 'అందరికీ ఏఐ'ని అందిస్తుందని, పౌరులకు అత్యాధునిక సాధనాలను అందుబాటులోకి తెస్తుందని తెలిపారు. తద్వారా మన డిజిటల్ ఆర్థిక వ్యవస్థ బలోపేతమై, ప్రపంచ టెక్నాలజీ లీడర్‌గా భారత్ స్థానం సుస్థిరమవుతుందని ప్రధాని మోదీ అన్నారు. అంతకుముందు, ప్రధాని మోదీతో మాట్లాడటం గొప్ప అనుభూతినిచ్చిందని సుందర్ పిచాయ్ తెలిపారు. "విశాఖపట్నంలో గూగుల్ మొట్టమొదటి ఏఐ హబ్ ఏర్పాటు ప్రణాళికలను ఆయనతో పంచుకున్నాం. ఇది ఒక చరిత్రాత్మక అభివృద్ధి" అని పిచాయ్ పేర్కొన్నారు. ఈ హబ్‌లో గిగావాట్ స్థాయి కంప్యూట్ సామర్థ్యం, కొత్త అంతర్జాతీయ సబ్‌సీ గేట్‌వే, భారీ ఇంధన మౌలిక సదుపాయాలు ఉంటాయని ఆయన వివరించారు. దీని ద్వారా తమ అత్యాధునిక టెక్నాలజీని భారతీయ సంస్థలకు, వినియోగదారులకు అందించి, దేశవ్యాప్తంగా ఏఐ ఆవిష్కరణలను వేగవంతం చేస్తామని తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం గూగుల్ రాబోయే ఐదేళ్లలో (20262030) సుమారు 15 బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టనుంది. భారత్‌లో గూగుల్ పెడుతున్న అతిపెద్ద పెట్టుబడి ఇదే కావడం విశేషం. అదానీకానెక్స్, ఎయిర్‌టెల్ వంటి ప్రముఖ భాగస్వాములతో కలిసి ఈ డేటా సెంటర్ క్యాంపస్‌ను నిర్మించనున్నారు. ఢిల్లీలో జరిగిన 'భారత్ ఏఐ శక్తి' కార్యక్రమంలో ఈ ప్రకటన చేశారు. విశాఖలో ఏర్పాటు చేయబోయే ఈ ఏఐ హబ్, భారతదేశ డిజిటల్ భవిష్యత్తులో ఒక మైలురాయి లాంటిదని గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్ అన్నారు.

## తక్కువ డోస్ తో ఎక్కువ ప్రభావం చూపించే కొత్త యాంటీబయోటిక్

ఢిల్లీ, అక్టోబర్ 14 (భారత శక్తి): వైద్య శాస్త్రంలో ఒక కొత్త అధ్యయనం కీలక ఆవిష్కరణకు దారితీసింది. పేగుల్లో తీవ్రమైన ఇన్‌ఫెక్షన్‌కు కారణమయ్యే 'సి.డిఫిసిల్' అనే ప్రమాదకరమైన బ్యాక్టీరియాను అతి తక్కువ మోతాదులో యాంటీబయాటిక్ వాడి నియంత్రించవచ్చని పరిశోధకులు కనుగొన్నారు. ఈవీజీ7 (EVG7) అనే ఈ కొత్త యాంటీబయాటిక్, కేవలం చిన్న డోసుతోనే ఈ బ్యాక్టీరియాను సమర్థవంతంగా నాశనం చేయడమే కాకుండా, ఇన్‌ఫెక్షన్ మళ్లీ తిరగబెట్టకుండా నివారిస్తున్నట్లు తాజా అధ్యయనంలో తేలింది.

**ఏమిటీ సి. డిఫిసిల్ ఇన్‌ఫెక్షన్?**

'సి. డిఫిసిల్' అనేది పేగుల్లో నివసించే ఒక మొండి బ్యాక్టీరియా. ముఖ్యంగా వయసు పైబడిన వారు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో ఇది తీవ్రమైన అనారోగ్యానికి కారణమవుతుంది. ఈ బ్యాక్టీరియా విడుదల చేసే ఒక విష పదార్థం వల్ల తీవ్రమైన డయేరియా వస్తుంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న చికిత్సలతో ఇన్‌ఫెక్షన్ తగ్గినా, తరచుగా మళ్లీ తిరగబెట్టడం ఒక పెద్ద సమస్యగా ఉంది. "ప్రస్తుత యాంటీబయాటిక్స్‌తో చికిత్స చేసిన కొన్ని వారాలకే ఈ ఇన్‌ఫెక్షన్ మళ్లీ బయటపడుతుంది. ఎందుకంటే ఈ బ్యాక్టీరియా తన వెనుక 'స్పోర్'లను వదిలి వెళుతుంది. ఈ స్పోర్‌లు అనుకూల పరిస్థితుల్లో తిరిగి కొత్త బ్యాక్టీరియాగా మారి ఇన్‌ఫెక్షన్‌కు కారణమవుతాయి" అని ఈ పరిశోధన బృందానికి నేతృత్వం వహించిన ఎల్మా మాన్స్ వివరించారు.

*** కొత్త యాంటీబయాటిక్ ఎలా పనిచేస్తుంది?**

పరిశోధకులు ఎలుకలపై ఈవీజీ7 యాంటీబయాటిక్‌ను తక్కువ మోతాదులో ప్రయోగించి చూశారు. ఫలితాలు ఆశాజనకంగా ఉన్నాయి. తక్కువ డోసు ఈవీజీ7 తీసుకున్న ఎలుకలలో 'సి. డిఫిసిల్' ఇన్‌ఫెక్షన్ మళ్లీ వచ్చే అవకాశాలు గణనీయంగా తగ్గాయి. ఆశ్చర్యకరంగా, ఇదే యాంటీబయాటిక్‌ను ఎక్కువ డోసులో వాడినప్పుడు గానీ, ప్రస్తుతం వాడుకలో ఉన్న వాంకోమైసిన్‌ను తక్కువ డోసులో వాడినప్పుడు గానీ ఇలాంటి ఫలితాలు రాలేదు. దీనికి గల కారణాన్ని పరిశోధకులు విశ్లేషించారు. తక్కువ డోసు ఈవీజీ7, ప్రమాదకరమైన 'సి. డిఫిసిల్' బ్యాక్టీరియాను చంపుతూనే, మన ఆరోగ్యానికి మేలు చేసే 'లాక్నోస్పిరేసి' కుటుంబానికి చెందిన మంచి బ్యాక్టీరియాను మాత్రం కాపాడుతోంది. "ఈ మంచి బ్యాక్టీరియానే 'సి. డిఫిసిల్' నుంచి మనకు రక్షణ కల్పిస్తుంది" అని మాన్స్ తెలిపారు. ఈ మేలు చేసే బ్యాక్టీరియా పేగుల్లో ఉండటం వల్ల, మిగిలిపోయిన స్పోర్‌లు తిరిగి పెరగకుండా అడ్డుకుంటున్నాయి.

సాధారణంగా తక్కువ డోసు యాంటీబయాటిక్స్ వాడటం వల్ల బ్యాక్టీరియాలో నిరోధక శక్తి (రెసిస్టెన్స్) పెరుగుతుందని భావిస్తారు. అయితే, ఈవీజీ7 తక్కువ డోసు కూడా 'సి. డిఫిసిల్'ను పూర్తిగా చంపేస్తుండటంతో రెసిస్టెన్స్ ప్రమాదం కూడా తక్కువేనని పరిశోధకులు చెబుతున్నారు. "బ్యాక్టీరియాను పూర్తిగా చంపకుండా, కేవలం దాన్ని ఇబ్బంది పెట్టినప్పుడే అది మరింత బలంగా తయారై రెసిస్టెన్స్ పెంచుకుంటుంది" అని మాన్స్ పేర్కొన్నారు. ఈ కొత్త చికిత్సా విధానం భవిష్యత్తులో 'సి. డిఫిసిల్' వంటి మొండి ఇన్‌ఫెక్షన్ల నియంత్రణలో కీలక పాత్ర పోషించగలదని శాస్త్రవేత్తలు ఆశిస్తున్నారు

## శబరిమల బంగారం మాయం కేసులో సంచలన విషయాలు

కేరళ, అక్టోబర్ 14 (భారత శక్తి): శబరిమల ఆలయంలో బంగారం చోరీ వ్యవహారంలో సంచలన విషయాలు బయటపడుతున్నాయి. ఆలయ సన్నిధానంలో గర్భగుడి, ద్వార పాలక విగ్రహాలకు బంగారు తాపడం పనులలో ఏకంగా 4.5 కిలోల బంగారం మాయం కావడం దేశవ్యాప్తంగా అయ్యప్ప భక్తులను కలవరపరిచింది. దీంతో కేరళ హైకోర్టు స్పందించి సిట్ విచారణకు ఆదేశించింది. బంగారు తాపడం పనుల బాధ్యత తీసుకున్న దాత ఉన్నికృష్ణన్ ను విచారించిన అధికారులు.. అతడికి స్థిరమైన ఆదాయమే లేదని తేల్చారు. బెంగళూరుకు చెందిన ఉన్నికృష్ణన్ గతేడాది ఐటీ శాఖకు సమర్పించిన ఆదాయ వివరాలను పరిశీలించడంతో ఈ విషయం బయటపడింది. ఇతర దాతలు, కంపెనీలు ఆలయానికి ఇచ్చిన విరాళాలను ఉన్నికృష్ణన్ తానే ఇచ్చినట్లు ప్రచారం చేసుకున్నట్లు అధికారుల విచారణలో తేలింది. శబరిమల ఆలయ వ్యవహారాలను పర్యవేక్షించే ట్రావెన్ కోర్ దేవోసం బోర్డు (టీడీబీ) విజిలెన్స్ విభాగం నివేదికలోనూ ఇదే విషయం వెల్లడించింది. సామాజిక సేవ కోసం కామాక్షి ఎంటర్‌ప్రైజెస్ సంస్థ ఉన్నికృష్ణన్ బ్యాంకు అకౌంట్‌లో రూ.10.85 లక్షలు జమ చేసిందని అధికారులు గుర్తించారు. అదేవిధంగా, శబరిమల గుడిలో స్వర్ణ తాపడం పనులకు బళ్లారికి చెందిన వ్యాపారి గోవర్దన్ నిధులు అందజేసినట్లు విచారణలో బయటపడింది. శ్రీకోవెలకు గుమ్మం తానే ఇచ్చానని ఉన్నికృష్ణన్ చెప్పుకున్నా.. బెంగళూరుకు చెందిన వ్యాపారి అజికుమార్ దానిని అందజేయడం గమనార్హం. ఈ ఏడాది అన్నదాన మండప నిర్మాణానికి రూ.10 లక్షలు, అన్నదానం కోసం రూ.6 లక్షలు ఉన్నికృష్ణన్ అందించారు. 2017లోనూ అన్నదానం కోసం రూ.8.20 లక్షల నగదుతో పాటు 17 టన్నుల బియ్యం, 30 టన్నుల కూరగాయలు ఇచ్చినట్టు విజిలెన్స్ నివేదిక తెలిపింది. ఈ విరాళాలను పరిశీలించి గర్భగుడి స్వర్ణ తాపడం పనులను ఉన్నికృష్ణన్ కు అప్పజెప్పినట్లు తెలుస్తోంది. అయితే, స్వర్ణ తాపడం పనులు పూర్తయిన తర్వాత స్వామి వారికి చెందిన బంగారంలో 4.5 కిలోలు మాయమైనట్లు తేలడంతో గందరగోళం నెలకొంది. ఈ కేసులో ఉన్నికృష్ణన్ ను ఏ1 నిందితుడిగా పేర్కొన్న సిట్.. టీడీబీకి చెందిన పలువురు అధికారులను ఇతర నిందితులుగా చేర్చింది. 2019లో శబరిమల అయ్యప్ప గర్భగుడికి టీడీబీ స్వర్ణ తాపడం చేయించింది. స్వామి వారికి భక్తులు సమర్పించిన బంగారాన్ని ఇందుకోసం వెచ్చించింది. ఈ స్వర్ణ తాపడానికి అయ్యే ఖర్చును భరించి, పనులు చేయించే బాధ్యతను ఉన్నికృష్ణన్ కు టీడీబీ అప్పగించింది. పనులు పూర్తయ్యాక స్వర్ణ తాపడం కోసం అప్పగించిన బంగారం లెక్కల్లో తేడా వచ్చింది.

## #GoogleComesToAP... ఎక్స్ లో ఇప్పుడిదే టాప్ ట్రెండింగ్

అమరావతి, అక్టోబర్ 14 (భారత శక్తి): సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ప్రస్తుతం '#GoogleComesToAP' అనే హ్యాష్‌ట్యాగ్ దేశవ్యాప్తంగా టాప్ ట్రెండింగ్‌లో నిలిచింది. ఆంధ్రప్రదేశ్‌లో టెక్ దిగ్గజం గూగుల్ భారీ పెట్టుబడి పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకోవడమే ఈ ట్రెండింగ్‌కు ప్రధాన కారణం. ఈ పరిణామం రాష్ట్ర టెక్నాలజీ రంగంలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. వివరాల్లోకి వెళితే, విశాఖపట్నంలో అత్యాధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత డేటా సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు గూగుల్ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో ఒక కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ప్రాజెక్టు కోసం సుమారు రూ.1.33 లక్షల కోట్ల భారీ పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రాథమిక అంచనా. ఈ ఒప్పంద కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర ఐటీ, రైల్వేల శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్‌తో పాటు పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ డేటా సెంటర్ ఏర్పాటు ద్వారా గ్లోబల్ కనెక్టివిటీ గణనీయంగా మెరుగుపడటంతో పాటు, రాష్ట్రంలో టెక్నాలజీ ఆధారిత నూతన ఆవిష్కరణలకు మార్గం సుగమం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గూగుల్ వంటి ప్రపంచ స్థాయి సంస్థ రాష్ట్రానికి రావడంతో యువతకు ఉపాధి అవకాశాలు కూడా భారీగా పెరుగుతాయని భావిస్తున్నారు. ఈ చారిత్రాత్మక ఒప్పందంపై నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## చుక్కలు చూపిస్తున్న బంగారం, వెండి.. ఆల్ టైమ్ గరిష్ఠానికి ధరలు

ఢిల్లీ, అక్టోబర్ 14 (భారత శక్తి): బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు సరికొత్త చరిత్ర సృష్టించాయి. మంగళవారం ఒక్కరోజే ధరలు అమాంతం పెరిగి పెట్టుబడిదారులకు ఆనందాన్ని, కొనుగోలుదారులకు తీవ్ర షాక్‌ను ఇచ్చాయి. ముఖ్యంగా వెండి ధర చరిత్రలో తొలిసారిగా కిలోకు రూ.2 లక్షల మైలురాయిని దాటి ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయికి చేరింది. బంగారం ధరలు కూడా అదే బాటలో పయనించి భారీగా పెరిగాయి.

**రికార్డు స్థాయిలో పెరిగిన ధరలు**

మంగళవారం ఉదయం హైదరాబాద్ మార్కెట్‌లో కిలో వెండి ధర ఒక్కరోజే రూ.9,000 పెరిగి రూ.2,06,000కి చేరింది. గత పది రోజుల్లోనే వెండిపై ఏకంగా రూ.35,000కు పైగా పెరగడం గమనార్హం. మరోవైపు 22 క్యారెట్ల తులం బంగారం ధర రూ.3,000 పెరిగి రూ.1,17,950 వద్ద నిలిచింది. ఇక, 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర 10 గ్రాములకు రూ.3,280 పెరిగి రూ.1,28,680కి ఎగబాకింది.

**అంతర్జాతీయ పరిణామాలే కారణమా?**

బంగారం, వెండి ధరల పెరుగుదలకు ప్రధానంగా అంతర్జాతీయ పరిణామాలు దోహదం చేస్తున్నాయి. చైనాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 100 శాతం అదనపు సుంకాలను ప్రకటించడంతో రెండు దేశాల మధ్య వాణిజ్య యుద్ధ భయాలు తీవ్రమయ్యాయి. దీనికి తోడు అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించే అవకాశం ఉండటంతో ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితి కారణంగా పెట్టుబడిదారులు ఈక్విటీ మార్కెట్ల నుంచి వైదొలగి సురక్షితమైన పెట్టుబడి సాధనాలుగా భావించే బంగారం, వెండి వైపు భారీగా మొగ్గు చూపుతున్నారు.

# బ్రతుకు ఈడ్చలేక భోరుమంటున్న బడిపంతుళ్ళు..



**( స్పెషల్ కరస్పాండెంట్ )**

**హైదరాబాద్, అక్టోబర్ 14 (భారత శక్తి) :**

తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఏకోపాధ్యాయుల అంటే ఒకే ఉపాధ్యాయుడు బహుళ సబ్జెక్టులు బోధించడం.. ఇది ఒక సమస్య.. ఉపాధ్యాయుల సంఖ్య తగినంతగా లేకపోవడం.. సర్దుబాటులో అనాలోచిత విధానాలు.. నిర్మాణ సమస్యలు, విద్యార్థుల సంఖ్య తగ్గడం వంటి సమస్యలు ప్రధానంగా ఉన్నాయి. విద్యాశాఖ నిర్లక్ష్యం కారణంగా పాఠశాలల్లో మౌలిక వసతులు బాగున్నా, ఉపాధ్యాయుల సమస్యలపై చర్యలు తక్కువగా తీసుకుంటున్నది. ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి కనీసం ఒక ఉపాధ్యాయుని ఏర్పాటు చేయకపోవటం, విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తూ చేతులు దులుపుకోవడం వల్ల పాఠశాలల పరిస్థితి మరింత దీనంగా తయారవుతోంది.. ప్రభుత్వం ప్రదర్శిస్తున్న పనితీరు విషయమై ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన వెలిబుచ్చుతున్నాయి.. పాఠశాలల పరిస్థితులు మెరుగుపరచాలని డిమాండ్ చేస్తున్నారు.

*** ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు :**

ఏకోపాధ్యాయ పాఠశాలలలో ఉపాధ్యాయుల లోపం.. బహుళ సబ్జెక్టులు బోధించాల్సిన బాధ్యత. ప్రాథమిక పాఠశాలల్లో తరగతి గదులు, ఉపాధ్యాయులు కొరత. ఇక విద్యార్థుల సంఖ్య తగ్గడం, పాఠశాలల మూసివేతలు ఉదాహరణకు నల్లగొండ జిల్లాలో 298 పాఠశాలలు మూసివేతకు గురైయ్యాయి.. సర్దుబాటు విధానాల్లో అనాలోచిత చర్యలు, విద్యార్థులకు తీవ్ర నష్టం కలుగజేస్తున్నాయి.. విద్యాశాఖ దృష్టి పెట్టకపోవడం.. మౌలిక సదుపాయాలు లేకపోవడం..

ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఒక్కోసారి 56 సబ్జెక్టులు బోధించాల్సి వస్తుంది. ఈ కారణంగా విద్యా ప్రమాణాలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ప్రాథమిక విద్యా రంగం ఇలాంటి పరిస్థితులతో చాలా ఇబ్బందుల్లో పడింది. కాగా గత బీఆర్ఎస్ సర్కార్ సమయానికి మౌలిక సదుపాయాల పట్ల చక్కటి పథకాలు తీసుకుని వచ్చింది.. ఉదాహరణకు మన ఊరు.. మన బడి.. కానీ ఆ పథకాలను ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేసింది. అలాగే కొత్త భవనాలు నిర్మాణంలో తోడ్పాటు లేకపోవడం, పాత భవనాలు మరమ్మతులు చేయకపోవడం జరుగుతోంది..

ఉపాధ్యాయ సమస్యలపై దృష్టి పెట్టడం లేదు.. సర్దుబాటు విధానాలు ఉపాధ్యాయ, విద్యార్థుల అవసరాలకు తగినంతగా లేకపోవడం దురదృష్టం.. విద్యాప్రమాణాలు పెంచుకునేందుకు అధికారులు, ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదు.. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోకపోతే, గ్రామీణ ప్రాంతాల్లో బాలబాలికల విద్యాప్రమాణాలు ప్రమాదంలో పడతాయి..

*** ఉపాధ్యాయ అవసరాలకు తగిన పరిష్కార మార్గాలు సూచిస్తున్నారు విశ్లేషకులు :**

ఉపాధ్యాయులకు సరైన భూమిక అంటే బాధ్యతలు కేటాయించడం.. ఏకోపాధ్యాయ పాఠశాలల సమస్యను తగ్గించేందుకు ప్రతి పాఠశాలకు తగిన సంఖ్యలో ప్రత్యేక సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులను నియమించడం అవసరం. ఒక్కో ఉపాధ్యాయుడిపై ఒత్తిడి తగ్గించి, పనిభారం సమంగా పంపిణీ చేయాలి.

ఇక పాఠశాలల భవనాలు, తరగతి గదులు, విద్యా సామగ్రి వంటి మౌలిక వసతులను మెరుగుపరచడం ఖచ్చితంగా చేయాలి... మరమ్మతులు చేయడం వెంటనే చేపట్టాలి.. ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా అమలు చేయాల్సి ఉంది. ఉపాధ్యాయుల కొరకు నిరంతర వృత్తి అభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం, వారిని కొత్త బోధన పద్ధతులకు అనుగుణంగా సిద్ధం చేయడం అవసరం. ఉపాధ్యాయులకు హౌసింగ్ అలవెన్సులు, పాత పెన్షన్ విధాన పునరావృతము, బోధన వేతనాలు సమర్థవంతంగా ఉండే విధంగా ఉపాధ్యాయుల సంరక్షణ జరగాలి. ఉపాధ్యాయుల బర్న్ అవుట్ సమస్యలను తగ్గించేందుకు మానసిక, భావోద్వేగ సహాయం అందించడం, సమయం సరిపడా పని, విశ్రాంతి ఇవ్వడం ముఖ్యం. విద్యాశాఖలో ఉపాధ్యాయుల సమస్యలు ప్రతిబింబించే విధంగా మద్దతు చర్యలు, ఫిర్యాదుల పరిష్కారం, సరైన సర్దుబాటు విధానం అమలు చేయాలి. ఈ పరిష్కారాలు తీసుకుంటే ఉపాధ్యాయుల సామర్థ్యం, విద్యా ప్రమాణాలు మెరుగుపడటం మాత్రం కాకుండా విద్యార్థులకు కూడా ఎంతో మేలు జరుగుతుంది..

విద్యార్థులకు కొత్త కాన్సెప్ట్‌లు నేర్పేటప్పుడు మొదట ఎక్కువ శ్రద్ధ చూపాలి.. తర్వాత దాని స్థాయిని తగ్గిస్తూ విద్యార్థులు వారంతట వారే స్వతంత్రంగా నేర్చుకునే సామర్థ్యాన్ని పెంచడం చేయాలి..

ఇది క్లాస్‌రూమ్ బోధనలో ఒక ముఖ్యమైన పద్ధతి. విద్యార్థులను ప్రోత్సహించేలా క్విజ్ కార్యక్రమాలు.. చర్చలు.. పాత్ర పోషణ.. డిబేట్లు.. సర్వేలు వంటి ఆహ్లాదకరమైన కార్యకలాపాలు నిర్వహించడం చేయాలి అప్పుడు వారు ఎంతో చురుగ్గా తయారవుతారు..

తరగతి గది నియమాలను ఏర్పరచడం.. ఉపాధ్యాయుడు విద్యార్థుల మధ్య పరస్పర భావాలను మెరుగుపరచడం చేయాలి.. ఇక తల్లిదండ్రుల భాగస్వామ్యంతో మంచితీరును ప్రోత్సహించడం చేయాలి.. గూగుల్ క్లాస్ రూమ్స్, ఇతర ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా విద్యార్థులు తమను తాము తీర్చిదిద్దుకునేలా చేయాలి.. వీటితో ఉపాధ్యాయులు కూడా మెరుగైన పాత్ర నిర్వహణ సాధిస్తారు. నిరంతర వృత్తి శిక్షణ, ప్రగతి పర్యవేక్షణ జరగాలి..

ఇక తెలంగాణలో ఉపాధ్యాయ బదిలీల విషయంలో చాలా తప్పొప్పులు జరిగాయన్నది విదితమే.. నిర్లక్ష్య పద్ధతి, కొంతవరకు అస్పష్ట విధానాలను ప్రభుత్వం అనుసరించింది.. ఉపాధ్యాయుల బదిలీలు కొన్ని సందర్భాల్లో ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా తక్షణమే నిర్ణయించబడటంతో, ఉపాధ్యాయులకు న్యాయమైన అవకాశాలు, వాస్తవ పరిస్థితుల పూర్వపరిశీలన లేకపోవడం ఇన్నో సమస్యలు





ఎదురయ్యాయి.. కొన్ని ఉపాధ్యాయుల బదిలీలు అనూహ్యంగా, సరైన సమన్వయం లేకుండా, ప్రగతి, కుటుంబ అవసరాలు, స్థానిక పరిస్థితులు దృష్టిలో పెట్టుకోకుండా జరిగాయన్నది ఆరోపణ..

ప్రభుత్వం, విద్యాశాఖ బదిలీలకు సంబంధించిన లోతైన మార్గదర్శకాలు, పారదర్శక విధానాలు లేకుండా పోవడం వలన ఉపాధ్యాయుల్లో అసంతృప్తిని పెంపొందిస్తోంది. ఉపాధ్యాయుల సంఘాలు, వృత్తి ఒత్తిడి కారణంగా నిరసనలు, ఆందోళనలు కూడా జరుగుతున్నాయి.. ఈ పద్ధతి వల్ల ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల విద్యాభ్యాసం కూడా ప్రభావితమవుతుంది. బదిలీలలో అస్తవ్యస్తత, నమూనా లేమి కారణంగా ఉపాధ్యాయుల మధ్య అనైతికత, ప్రభుత్వ పట్ల అవగాహన లోపం పెరుగుతుంది.

*** కొన్ని పరిష్కార సూచనలు :**

బదిలీలను సమగ్ర పరిశీలన కలిగి సుసమావేశం, పారదర్శక విధానాలతో జరపాలి. ఉపాధ్యాయుల వ్యక్తిగత, కుటుంబ, వృత్తి పరిస్థితులను పరిగణలోకి తీసుకుని చర్యలు తీసుకోవాలి. శిక్షణ, ఆర్థిక, మానసిక మద్దతుతో బదిలీల నష్టాలను తగ్గించాలి. ఉపాధ్యాయుల సంఘాల సహకారంతో బదిలీల విధానాలపై శాశ్వత చర్చలు, సూచనలు తీసుకోవాలి. ఈ విధంగా బదిలీల నియంత్రణ ప్రభుత్వ విధానంగా దిశాబోధకంగా మారడం అవసరం.. పారదర్శక, న్యాయమైన బదిలీ విధానం అమలు చేసి తీరాలి.. అక్రమ బదిలీలు నిలిపివేయడం, బదిలీల ప్రక్రియలో అవినీతిని నివారించడం అవసరం అని సూచిస్తోంది " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "..

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థిగా మాగంటి సునీత

*** కేసీఆర్ చేతులమీదుగా బి-ఫారమ్, రూ.40 లక్షల చెక్కు అందజేత**

హైదరాబాద్, అక్టోబర్ 14 (భారత శక్తి): జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న శ్రీమతి మాగంటి సునీత గోపీనాథ్ కి పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్. బిఫారమ్‌ను అందజేశారు. ఎన్నికల ఖర్చుల నిమిత్తం పార్టీ తరపున రూ. 40 లక్షల రూపాయల చెక్కును కూడా కేసీఆర్ సునీత గోపీనాథ్‌కు అందజేశారు.ఈ సందర్భంగా దివంగత మాగంటి గోపీనాథ్ కుటుంబ సభ్యులు, కుమారుడు, కుమార్తెలు, అలాగే మాజీ మంత్రులు మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్, అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్,



మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్ రావు తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.




## జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నేపథ్యంలో '1950' హెల్ప్‌లైన్

### జాతీయ ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (NGRS) ఏర్పాటు

హైదరాబాద్, అక్టోబర్ 14 (భారత శక్తి) : జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికల నేపథ్యంలో, ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారం కోసం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక 1950 హెల్ప్‌లైన్ , జాతీయ ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (NGRS) ఏర్పాటు చేశారు. 1950 హెల్ప్‌లైన్ ద్వారా ప్రజలు ఓటర్ల జాబితా, పోలింగ్ సెంటర్లు, ఎపిక్ కార్డులు, మోడల్ కోడ్ ఉల్లంఘనలు, ప్రలోభాల అంశాలు మొదలైన వాటికి సంబంధించిన సమాచారం పొందడమే కాకుండా, ఫిర్యాదులు నమోదు చేయవచ్చు. 1950 హెల్ప్‌లైన్ కు ఎన్నికల షెడ్యూల్ విడుదల నుంచి ఇప్పటి వరకు 433 కాల్స్ రాగా 379 కాల్స్ కు సమాధానం ఇచ్చారు.

## బీసీ జేఏసీ చేపట్టిన 'బంద్ ఫర్ జస్టిస్' రాష్ట్ర బంద్ కు ఏఐవైఎఫ్ సంపూర్ణ మద్దతు

*** బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలుకు వ్యతిరేకంగా ఉన్న బీజేపీని గద్దె దింపాలి**

*** వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర**

*** ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి**

హైదరాబాద్, అక్టోబర్ 14 (భారత శక్తి): బీసీ రిజర్వేషన్ల సాధనకు వివిధ బీసీ సంఘాలతో ఏర్పడిన 'బీసీ ఐక్య కార్యాచరణ కమిటీ' (బీసీ జేఏసీ) 'బంద్ ఫర్ జస్టిస్' పేరుతో ఈ నెల 18న తలపెట్టిన రాష్ట్ర బంద్ కు ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని, బంద్ లో ప్రత్యక్షంగా రాష్ట్ర వ్యాప్తంగా పాల్గొంటామని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర తెలిపారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం హిమాయత్ నగర్ లోని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో జరిగింది.ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్రలు మాట్లాడుతూ, బిసి రిజర్వేషన్ల సాధనకు తెలంగాణ ఉద్యమ తరహాలోనే ఒక సామాజిక ఉద్యమంగా ముందుకు సాగాలని సూచించారు.బిసి బిల్లును ఆమోదించి, రిజర్వేషన్లను అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపైన ఉందని స్పష్టం చేశారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు జీవోతో పాటు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ మీద హైకోర్టు స్టే విధించడంతో, రిజర్వేషన్ల అమలు, స్థానిక సంస్థల ఎన్నికలు నిలిచిపోయాయి. దీనికి ప్రధాన కారణం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమేనని, ఇప్పటికైనా రాష్ట్రం నుండి ప్రాతినిథ్యం వహిస్తున్న బీజేపీ ఎంపీలు,కేంద్ర మంత్రులు నైతిక బాధ్యత వహించి,వారి పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన, సర్వే నిర్వహించి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు కేంద్రానికి పంపించినా స్పందించలేదన్నారు. శాసనసభలో అన్ని పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించి ఆర్డినెన్స్ చేసి గవర్నర్ కు పంపించినా




ఆమోదించకపోవడం వల్లే రిజర్వేషన్లు ఆగిపోయాయన్నారు. బీజేపీ కులతత్వ, మనువాద పార్టీ అయినందున, కుల వ్యవస్థ, అసమానతలు ఉండాలని, మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని కోరుకుంటుందని ఆరోపించారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలకు రావాల్సిన హక్కులన్నింటినీ కాలరాస్తున్నదని ధ్వజమెత్తారు. బీసీల పట్ల బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే తొమ్మిదివ షెడ్యూలులో చేర్చేందుకు రాజ్యాంగ సవరణ ద్వారా అవసరమైతే కేంద్ర ప్రభుత్వం తక్షణమే పార్లమెంటును సమావేశపరిచి, ఆ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. రిజర్వేషన్లు 50 శాతం పరిమితి పేరుతో ఏళ్ళ తరబడి బిసిల రిజర్వేషన్ పెంపు అంశాన్ని నాన్చడం ఏ మాత్రం తగదన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యూ ఎస్) రిజర్వేషన్ వర్తింపులో ఈ పరిమితిని ఇప్పటికే దాటి పోయిన విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలన్నారు. గవర్నర్ వద్ద పెండింగ్ ఉన్న బిల్లులు నిర్ణీత కాలపరిమితి లోగా ఆమోదం లభించకపోతే, నోటిఫై చేయవచ్చని తమిళనాడు కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పరిశీలించాలన్నారు.రాష్ట్రం నుండి ప్రాతినిథ్యం వహిస్తున్న బీజేపీ ఎంపీలు, మంత్రులు కేంద్రంపై ఒత్తిడి తేవడానికి ఎటువంటి ప్రయత్నమూ చేయలేదన్నారు. కేంద్రంలో అధికారంలో బీజేపీ ఉండడం వల్లనే ఈ రోజు ఈ రిజర్వేషన్లు అమలు కాని పరిస్థితి ఏర్పడిందని, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు కావాలంటే రాష్ట్రంలో, కేంద్రంలో బీజేపీని భూస్థాపితం చేయాలని అన్నారు. అదే విధంగా ఈ సమావేశంలో సీపీఐ పార్టీ శత జయంతి వార్షికోత్సవాల సందర్భంగా డిసెంబర్ నెలలో మూడు రోజుల పాటు హైదరాబాద్ లో రాష్ట్ర స్థాయి వర్క్ షాప్ నిర్వహించాలని, అన్ని జిల్లాల్లో యువజన సంఘాన్ని బలోపేతం చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల యువజన వ్యతిరేక విధానాలపై పోరాటాలు నిర్వహించాలని నిర్ణయించడం జరిగింది.ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ బిజ్జ శ్రీనివాసులు, టి. సత్య ప్రసాద్, శ్రీమాన్, యుగంధర్,చేపూరి కొండల్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.